శుభోదయం
ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!
WWW.SUBHODAYAMDAILY.COM
అమరావతి,హైదరాబాద్, సంపుటి : 01, సంచిక : 354, పేజీలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు (6281773157) శనివారం - 08 - మార్చి - 2025

## ట్రంప్ దెబ్బకు దిగొచ్చిన చైనా.. భారత్ వైపు చూపు



బీజింగ్: అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టిన తర్వాత దిగుమతి సుంకాలను భారీగా పెంచినసంగతి తెలిసిందే. ప్రధానంగా కెనడా, మెక్సికో ఉత్పత్తులపై 25 శాతం చొప్పున, చైనా ఉత్పత్తులపై అదనంగా 10 శాతం సుంకాలు విధించబోతున్నామని, మంగళవారం నుంచే ఇది అమల్లోకి వస్తుందని ట్రంప్ ప్రకటించారు. అమెరికాకు వస్తువులను ఎగుమతి చేసే దేశాలు సుంకాలు చెల్లించాల్సిందేనని తెలిపారు.

## నేనేమీ ఆ మాజీ సీఎం మాదిరి కాను



ముంబై: మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్?, డిప్యూటీ సీఎం ఏక్ నాథ్ షిండేల మధ్య 'వర్గపోరు'కు దాదాపు ఫుల్ స్టాప్ పడినట్లే కనబడుతోంది. ఇటీవల ఏక్ నాథ్ షిండే మాట్లాడుతూ.. తనను తేలిగ్గా తీసుకోవద్దని, మహారాష్ట్ర ప్రభుత్వాన్ని కూల్చిన విషయాన్ని మర్చిపోవద్దనే విషయాన్ని మరిచిపోవద్దంటూ వార్నింగ్ ఇచ్చారు. ఈ విషయం ఎవరికి అర్థం కావాలో వారికి అర్థమైతే బాగుంటుందనే కూడా ఏక్ నాథ్ షిండ్ చెప్పుకొచ్చారు.

## తమిళంలో వైద్య, ఇంజనీరింగ్ విద్య బోధించండి



రాణిపేట (తమిళనాడు) : తమిళనాడులోని అధికార డిఎంకె, బిజెపి నేతృత్వంలోని కేంద్రం మధ్య రాష్ట్రంలో చెలరేగుతున్న భాషా వివాదం నేపథ్యంలో రాష్ట్రంలో తమిళంలో ఇంజనీరింగ్, వైద్య విద్యా బోధన గరపవలసిందిగా ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్‌ను కేంద్ర హెూమ్ శాఖ మంత్రి అమిత్ షా శుక్రవారం కోరారు. ముఖ్యంగా హిందీ భాష 'నిర్బంధం'పై స్టాలిన్ అభ్యంతరం దృష్ట్యా భాషా సమస్యపై ముఖ్యమంత్రిని

## కుటుంబాలు వలస వెళ్లడం చూశాకే
# ఆ హామీ ఇచ్చాం

- సాగు, తాగునీటికి సంబంధించి పవన్ కల్యాణ్‌తో రెండుసార్లు చర్చించానన్న మంత్రి
- సీజనల్ హాస్టళ్ల పనితీరును మెరుగుపరుస్తామన్న మంత్రి లోకేశ్
- వలసల నివారణకు చరలు తీసుకుంటామని హామీ



వివరాలు 2లో..

అమరావతి,:ఆలూరు, ఆదోనిలో యువగళం పాదయాత్ర కొనసాగుతున్న సమయంలో కుటుంబాలు మూకుమ్మడిగా వలసలు వెళ్లడం చూశానని, అవన్నీ చూశాకే ఇరిగేషన్, లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి చేసి సాగు, తాగునీరు ఇస్తామని హామీ ఇచ్చానని మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. ఒకే వాహనంపై 200 మంది వెళ్లడం

## పవన్‌కు అవగాహన లేదు..
## కూటమి నుంచి బయటకు రావాలి



అసెంబ్లీలో మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్సీ బొత్స మాట్లాడుతూ.

ఎన్నికల సమయంలో కూటమి ఇచ్చిన హామీలపైనే మేము ప్రశ్నిస్తున్నాం

అమరావతి: ఏపీ శాసనమండలి వేదికగా వాస్తవాలను వివరిస్తుంటే టీడీపీ వాళ్లు జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు ప్రతిపక్ష నాయకులు బొత్స సత్యనారాయణ. ఎన్నికల ముందు చంద్రబాబు సంపద సృష్టిస్తామన్నారు కదా?. మరి ఇప్పుడు ఏమైంది మీ సంపద సృష్టి? అని ప్రశ్నించారు. ఇదే సమయంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు అస్సలు అవగాహన లేదు. ప్రతిపక్ష హెూదా మా హక్కు. సంఖ్యాపరంగా

## ఉచిత బస్సు ప్రయాణం అని చెప్పి
## ఇప్పుడు కండిషన్ అప్లై అంటారా...



- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీ ఇచ్చిన కూటమి
- జిల్లా స్థాయి వరకే పరిమితం అంటూ తాజాగా వెల్లడి
- ఇది మోసం చేయడమేనంటూ షర్మిల విమర్శలు
- రాష్ట్రస్థాయిలో ఉచిత ప్రయాణం కల్పించాలని డిమాండ్

అమరావతి,: ఏపీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కచ్చితంగా అమలవుతుందని,

## ఉద్యోగుల జేఏసీతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమావేశం



- బకాయిల కోసం సచివాలయం చుట్టూ తిరగొద్దు: ఉద్యోగుల జేఏసీతో భట్టి విక్రమార్క
- తమ డిమాండ్లను భట్టి ముందుంచిన ఉద్యోగుల జేఏసీ ప్రతినిధులు
- రూ.8 వేల కోట్ల బకాయిలను క్రమపద్ధతిలో చెల్లిస్తామని భట్టి హామీ
- ఏప్రిల్ నుంచి నెలకు రూ.600 కోట్లు చెల్లిస్తామని వెల్లడి

# మోదీ జీ.. ఇదెక్కడి న్యాయం..
## గ్రేటర్ హైదరాబాద్‌లో ఆస్తి పన్ను చెల్లింపు..

- ఇండియా టుడే కాంక్లెవ్ లో సీఎం రేవంత్ మాట్లాడుతూ..
- ఉచిత పథకాలకు సంబంధించి దేశ వ్యాప్తంగా చర్చ జరగాలన్న తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి
- 1971 నాటి జనాభా లెక్కల ఆధారంగా డీ లిమిటేషన్ జరగాలి



ఢిల్లీ: ఉచిత పథకాలకు సంబంధించి దేశ వ్యాప్తంగా చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి. ఇండియా టుడే కాంక్లెవ్ లో సీఎం రేవంత్ మాట్లాడుతూ..

## ఏపీ జల దోపిడీపై రేవంత్ రెడ్డి మొద్దు నిద్ర వీడాలి : హరీశ్‌రావు



చంద్రబాబును అడ్డుకునే ధైర్యం, కేంద్రాన్ని అడిగే దమ్ము కాంగ్రెస్, బీజేపీ ఎంపీలకు లేదా?

బాబు, రేవంత్, బీజేపీ మధ్య లోపాయికార ఒప్పందం ఏమిటి?

ఏపీ ప్రభుత్వ జల దోపిడీని అడ్డుకోండి.

హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జల దోపిడీపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మొద్దు నిద్ర వీడాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచించారు.

## వైసీపీ ముఖ్య నేతలతో సజ్జల టెలికాన్ఫరెన్స్... కీలక సూచనలు



- ఈ నెల 12న ఫీజు పోరు నిర్వహించాలన్న సజ్జల
- అదే రోజున పార్టీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించాలని ఆదేశం
- గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ జెండా ఎగరాలన్న సజ్జల

అమరావతి,: వైసీపీ ముఖ్యనేతలతో పార్టీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన

## పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేనలో చేరిన వైసీపీ మాజీ ఎమ్మెల్యేల



వివరాలు 2లో..

- జనసేన కండువా కప్పుకున్న పిఠాపురం మాజీ ఎమ్మెల్యే దొరబాబు
- దొరబాబుకు సాదర స్వాగతం పలికిన పవన్ కల్యాణ్
- జనసేనలోకి వచ్చిన పిఠాపురం నియోజకవర్గ ఇతర వైసీపీ నేతలు

## కేబినెట్ భేటీ అనంతరం
# రంగన్న మృతిపై మంత్రివర్గంలో చర్చ

- వాచ్ మన్ రంగన్న మృతిపై అనుమానాలు వ్యక్తం చేసిన సీఎం చంద్రబాబు
- వివేకా హత్య కేసులో ప్రత్యక్ష సాక్షిగా ఉన్న వాచ్ మన్ రంగన్న
- ఊపిరితిత్తుల వ్యాధితో తన భర్త మరణించాడని రంగన్న భార్య వెల్లడి
- గతంలో పరిటాల హత్య కేసులోనూ సాక్షులు ఇలాగే మరణిస్తూ వచ్చారన్న చంద్రబాబు



అమరావతి,: వివేకా హత్య కేసులో ప్రత్యక్ష సాక్షిగా ఉన్న వాచ్ మన్ రంగన్న మృతి చెందడం చర్చనీయాంశంగా మారింది. రంగన్న ఊపిరితిత్తుల వ్యాధితో మరణించాడని ఆయన భార్య

# ట్రంప్ దెబ్బకు దిగొచ్చిన చైనా.. భారత్ వైపు చూపు

మొదటి పేజీ తరువాయి

మంగళవారం నుంచే ఇది అమల్లోకి వస్తుందని ట్రంప్ ప్రకటించారు. అమెరికాకు వస్తువులను ఎగుమతి చేసే దేశాలు సుంకాలు చెల్లించాల్సిందేనని తెలిపారు. దీనికి చైనా కూడా అంతే ఘాటుగా స్పందించింది. తమ దేశంలోకి దిగుమతి అయ్యే అమెరికా వస్తువులపై అదనంగా 15 శాతం టారిఫ్ విధిస్తున్నట్లు ప్రకటించింది. చికెన్, గోధుమలు, మొక్కజొన్న, పత్తి తదితర దిగుమతులపై ఈ టారిఫ్ వసూలు చేస్తామని, అలాగే జొన్న, సోయాబీన్, పోర్క్, బీఫ్, సముద్ర ఉత్పత్తులు, పండ్లు, కూరగాయాలు, పాడి ఉత్పత్తులపై అదనంగా 10 శాతం సుంకాలు విధించనున్నట్లు వెల్లడించింది. అయితే చైనా ప్రస్తుత చూపులు భారత్ వైపు పడ్డాయి. భారత్ తో గతంలో ఉన్న విరోధాన్ని పూర్తిగా పక్కన పెట్టేందుకు సిద్ధమైంది చైనా. భారత్ తో శత్రుత్వం కంటే మిత్రత్వమే మేలనే భావనకు వచ్చింది చైనా.-భారత్ తో కలిసి పని చేయాలని చూస్తోంది., ఈ మేరకు ఇప్పటికి ఓ మెట్టు దిగి భారత్ సహకారం కావాలంటోంది డ్రాగన్.

ఇద్దరం కలిసి పని చేద్దాం: చైనా విదేశాంగ మంత్రి

భారత్ తో కలిసి పని చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యి స్పష్టం చేశారు. ఒకరిని ఒకరు కించ పరుచుకోవడం కంటే కలిసి పని చేస్తే అద్భుతాలు సృష్టించవచ్చాన్నారు వాంగ్ యి. ఆ దేశ నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ మీట్ తర్వాత వాంగ్ యి మాట్లాడుతూ.. ' ఢిల్లీ?, బీజింగ్ కలిసే పని చేసే సమయం ఆసన్నమైంది. డ్రాగన్, ఎలిఫెంట్ డ్యాన్స్ కలిసి చేస్తే బాగుంటుంది. ఇరుదేశాలు ఒకరికొకరు సహకరించుకోవాల్సిన అవసరం ఉంది. సహకారంతో పోయేదేమీ ఉండదు. సహకారం ఇచ్చి పుచ్చుకుంటే మరింత బలోపేతం అవుతాం. ఇది దేశ ప్రజలకు, దేశాలకు మంచిది' అని పేర్కొన్నారు. ఇటీవల దక్షిణాఫ్రికాలో జరిగిన టీ20 విదేశాంగ మంత్రుల సమావేశంలో భారత్ విదేశాంగ? మంత్రి జైశంకర్ తో వాంగ్ యి భేటీ అయ్యారు. అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. 2020లో గల్వాన్ ఘటన తర్వాత ఇరు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. అప్పట్నుంచి నిన్న మొన్నటి వరకూ ఇరు దేశాలు పెద్దగా సమావేశం అయ్యింది కూడా తక్కువే. ఆపై 2024లో ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ భేటీ తరువాత .ఇరు దేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం కాస్త చల్లబడింది. సరిహద్దుల్లో ఉద్రిక్తతలు ఉన్న చోట నుంచి ఇరు దేశాలు తమ బలగాలను వెనక్కి పిలిపించడంతో అప్పట్నుంచీ సామరస్య వాతావరణం కనిపిస్తోంది.

# నేనేమీ ఆ మాజీ సీఎం మాదిరి కాను

మొదటి పేజీ తరువాయి

ఈ విషయం ఎవరికి అర్థం కావాలో వారికి అర్థమైతే బాగుంటుందనే కూడా ఏక్ నాథ్ షిండ్ చెప్పుకొచ్చారు. తాను సీఎం ఉండగా శంకుస్థాపన చేసిన ప్రాజెక్టును ఫడ్నవీస్ ఆపేసారనే ఆరోపణల నేపథ్యంలో ఏక్ నాథ్ షిండే కాస్త ఘాటుగా స్పందించారు. అయితే దీనికి ఫడ్నవీస్ ఇంచుమించు తెరదించినట్లే కనబుడుతున్నారు. తనకెందుకు వచ్చిన గొడవో ఏమిటో అనుకున్నారో కానీ శంకుస్థాపనుల, ఆరంభించిన ఏ ప్రాజెక్టును ఆపడం లేదన్నారు ఫడ్నవీస్. గవర్నర్ కు ధన్యవాదాలు తీర్మానంలో భాగంగా మహారాష్ట్ర అసెంబ్లీలో మాట్లాడిన ఫడ్నవీస్.. ' నేనేమీ మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రేను కాను. తలపెట్టిన ప్రాజెక్టులను ఆపిన ఘనత ఉద్ధవ్ ది. నేను అటువంటి సీఎం ను కాను అన్ని ప్రాజెక్టులు పట్టాలెక్కుతాయి. ఇందులో ఎటువంటి సందేహం లేదు. షిండే హయాంలో ఉండగా కొన్ని ప్రాజెక్టులు చేపట్టాం. అది మేమంతా(షిండే, అజిత్ పవార్) కలిసి తీసుకున్న నిర్ణయం. ఆ ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లే బాధ్యత మా అందరిపైనా ఉంది' అంటూ పేర్కొన్నారు.

మాపై ప్రజలు పెద్ద బాధ్యత ఉంచారు

గతేడాది మహారాష్ట్రలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తమ మహాయుతి కూటమికి భారీ సీట్లు ఇచ్చి అధికారాన్ని ఇచ్చారన్నారు. అందుచేతు ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని, బాధ్యతను నిలబెట్టుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలు ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా ముందుకు వెళతామని, భవిష్యత్ తరాలకు మంచి చేయడమే తమ ముందున్న లక్ష్యమన్నారు ఫడ్నవీస్.

# తమిళంలో వైద్య, ఇంజనీరింగ్ విద్య బోధించండి

మొదటి పేజీ తరువాయి

ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్‌ను కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా శుక్రవారం కోరారు. ముఖ్యంగా హిందీ భాష 'నిర్బంధం'పై స్టాలిన్ అభ్యంతరం దృష్ట్యా భాషా సమస్యపై ముఖ్యమంత్రిని అమిత్ షా లక్ష్యం చేసుకుంటూ, నరేంద్ర మోడీ ప్రభుత్వం మార్పులు తీసుకువచ్చిందని, కేంద్ర సాయుధ పోలీస్ దళాల (సిఎపిఎఫ్) అభ్యర్థులు ఇప్పుడు తమ తమ ప్రాంతీయ భాషల్లో పరీక్ష రాయగలిగేలా ప్రభుత్వం చూసిందని వెల్లడించారు. చెన్నైకి దాదాపు 70 కిలో మీటర్ల దూరంలో రాణిపేట జిల్లా ఆర్‌టిసి తక్కోళంలో సిఐఎస్‌ఎఫ్ 56వ స్థాపక దినోత్సవ కార్యక్రమంలో కేంద్ర హోమ్ శాఖ మంత్రి మాట్లాడుతూ, 'ఇప్పుడు ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఆ పరీక్షను తమిళంలో కూడా రాయగలిగేలా చూసింది' అని చెప్పారు. 'విద్యార్థుల ప్రయోజనార్థం రాష్ట్రంలో తమిళంలో ఇంజనీరింగ్, వైద్య విద్యా బోధన గరపవలసిందిగా తమిళనాడు ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేస్తున్నాను' అని కూడా ఆయన తెలిపారు. రాష్ట్రంలో తీవ్ర స్థాయిలో భాషా వివాదం సాగుతున్న నేపథ్యంలో సిఎం లక్ష్యంగా అమిత్ షా ఆ వ్యాఖ్యలు చేశారు. జాతీయ విద్యా విధానం (ఎన్‌పి) ద్వారా హిందీని నిర్బంధం చేస్తున్నారని తమిళనాడులోని అధికార డిఎంకె ఆరోపిస్తోంది. అయితే, ఆ ఆరోపణను కేంద్రం ఖండించింది. తాము ద్విభాషా విధానం అంటే తమిళం. ఇంగ్లీష్ భాషలను మాత్రమే అనుసరిస్తామని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. ఇది ఇలా ఉండగా, అమిత్ షా తమిళనాడు కొనియాడుతూ, భారత సాంస్కృతిక రంగాన్ని పటిష్ఠం చేయడంలో ఈ దక్షిణాది రాష్ట్ర సంస్కృతి ప్రధాన పాత్ర పోషించిందని తెలియజేశారు. 'పరిపాలన సంస్కరణలు, ఆధ్యాత్మిక శిఖరాలు అధిరోహించడం, విద్య లేదా దేశ సమైక్యత, సమగ్రత పరిరక్షణ విషయంలో తమిళనాడు ప్రతి రంగంలో భారతీయ సంస్కృతిని బలోపేతం చేసింది' అని అమిత్ షా చెప్పారు. సిఐఎస్‌ఎఫ్ జవాన్ల రమణీయ కవాతు, యోగ ప్రదర్శన, కమాండో కార్యకలాపాలు ఈ కార్యక్రమంలో చోటు చేసుకున్నాయి. సిఐఎస్‌ఎఫ్ గురించి అమిత్ షా మాట్లాడుతూ, భారత్‌ను 2047 నాటికి ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా, అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలన్న ప్రధాని నరేంద్ర మోడీ సంకల్పం నెరవేరడంలో ఈ దళం తోడ్పాటు అత్యంత ముఖ్యమైనదని పేర్కొన్నారు. 'దేశ పారిశ్రామిక, వాణిజ్య లేదా పరిశోధన సంస్థల అభివృద్ధి విషయంలో సిఐఎస్‌ఎఫ్ జవాన్లు లేకుండా వాటి భద్రతను ఊహించజాలం. సిఐఎస్‌ఎఫ్ తిరుగులేని విధేయత, అంకితభావం ఫలితంగానే ఇప్పుడు దేశం సదరు రంగాల్లో దేశం సురక్షితంగా ముందుకు సాగుతోంది' అని అమిత్ షా తెలియజేశారు.

## ఉద్యోగుల జేఏసీతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమావేశం

హైదరాబాద్,: తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నేడు ఉద్యోగుల జేఏసీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జేఏసీ ప్రతినిధులు పలు డిమాండ్లను వినిపించారు. ఉద్యోగుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. పెండింగ్ డీఏలు ఇవ్వాలని, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. దీనిపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందిస్తూ... పెండింగ్ బిల్లుల కోసం సచివాలయం చుట్టూ తిరగొద్దని ఉద్యోగులకు సూచించారు. ఉద్యోగులకు బకాయిలను క్రమపద్ధతిలో చెల్లిస్తామని హామీ ఇచ్చారు. రూ.8 వేల కోట్ల బకాయిలను క్రమపద్ధతిలో చెల్లిస్తామని స్పష్టం చేశారు. ఏప్రిల్ మాసం నుంచి ప్రతి నెలా రూ.600 కోట్లు చెల్లిస్తామని చెప్పారు.

## ఏపీ జల దోపిడీపై రేవంత్ రెడ్డి మొద్దు నిద్ర వీడాలి : హరీశ్‌రావు

హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జల దోపిడీపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మొద్దు నిద్ర వీడాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచించారు. బనకచర్ల ద్వారా 200 టీఎంసీల కృష్ణా నీళ్ల తరలింపు కోసం ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు కుట్ర చేస్తుంటే రేవంత్ రెడ్డి ఎందుకు మౌనం వహిస్తున్నారని హరీశ్‌రావు ప్రశ్నించారు. బనకచర్ల ద్వారా గోదావరి వరద జలాలనే తీసుకువెళ్తున్నాం, తెలంగాణకు నష్టం లేదు అని ఏపీ నీళ్ల మంత్రి అంటే నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ మౌనం వహించడం వెనుక అంతర్యమేంటని ప్రశ్నించారు. మూడు నెలలుగా నాగార్జునసాగర్ కుడి కాలువ నుంచి రోజుకు 10వేల క్యూసెక్కులను ఏపీ తరలించుకుంటుంటే రాష్ట్ర ప్రభుత్వం మౌనంగా ఉందన్నారు. గోదావరి, కృష్ణా నీటిలో తెలంగాణ వాటాను ఏపీ ఇష్టారాజ్యంగా తరలలించే కుట్రలు చేస్తుంటే ఈ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి, ఉత్తం కుమార్ రెడ్డి సహా ఒక్క నాయకుడికి పట్టింపు లేదు అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. "బనకచర్ల తో తెలంగాణకు ఏమి నష్టం" అని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టంగా మాట్లాడి మూడు రోజులైనా ఒక్కరూ గట్టిగా స్పందించలేదు. తెలంగాణ నీటి ప్రయోజనాలు ఈ సర్కారుకు పట్టవా? అక్రమంగా నీటిని తరలించుకు పోతుంటే మొద్దు నిద్రలో ఉంటారా..? చంద్రబాబును అడ్డుకునే ధైర్యం, కేంద్రాన్ని అడిగే దమ్ము కాంగ్రెస్, బీజేపీ ఎంపీలకు లేదా? చంద్రబాబుతో బీజేపీ, రేవంత్ దోస్తీ చేస్తూ తెలంగాణను మోసం చేస్తారా? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. బాబు, రేవంత్, బీజేపీ మధ్య లోపాయికార ఒప్పందం ఏమిటి? బిఆర్‌ఎస్ పార్టీ గొంతెత్తినా మీకు చలనం కలగదా? కాంగ్రెస్, బిజెపి తీరు తెలంగాణ తాగు, సాగు నీటి రంగానికి గొడ్డలి పెట్టుగా మారుతున్నది. తెలంగాణ ప్రయోజనాల కోసం బిఆర్‌ఎస్ పార్టీ పడుతున్న ఆరాటం మీకు ఎలాగూ అర్థం కాదు, కనీసం మీడియాలో వస్తున్న కథనాలను చూసైనా కదలండి. ఇప్పటికైనా ఏపీ ప్రభుత్వ జల దోపిడీని అడ్డుకోండి. కేంద్రాన్ని నిలదీయండి. రేవంత్ సహా బిజెపి ఎంపీలు, కేంద్ర మంత్రులు మౌనం వీడండి! అని హరీశ్‌రావు సూచించారు.

## వైసీపీ ముఖ్య నేతలతో సజ్జల టెలీకాన్ఫరెన్స్... కీలక సూచనలు



**అమరావతి,:** వైసీపీ ముఖ్యనేతలతో పార్టీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. పార్టీ అధినేత జగన్ నిర్ణయం మేరకు ఈ నెల 12న నిర్వహించే ఫీజు పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చెప్పారు. లక్షలాది మంది విద్యార్థులు, యువతను మోసగించిన కూటమి ప్రభుత్వంపై శాంతియుతంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. పార్టీ కేడర్ మొత్తం ఈ కార్యక్రమంలో పాల్గొనాలని చెప్పారు. అదే రోజున వైసీపీ ఆవిర్భావ వేడుకలను కూడా ఘనంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. ఫీజు పోరు కార్యక్రమం సందర్భంగా వైసీపీ కేడర్ ర్యాలీగా వెళ్లి జిల్లా కలెక్టర్లకు మెమోరాండం అందించాలని సజ్జల తెలిపారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని... ఈ వేడుకల్లో మన పార్టీపై ప్రజాభిమానం ఏమాత్రం తగ్గలేదనేది వెల్లడవ్వాలని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ఉదయన్నే పూర్తి చేసుకుని... ఆ తర్వాత ఫీజు పోరు కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు వైసీపీ జెండా ఎగరాలని చెప్పారు.

# మోదీ జీ.. ఇదెక్కడి న్యాయం..

మొదటి పేజీ తరువాయి

ఇండియా టుడే కాంక్లేవ్ లో సీఎం రేవంత్ మాట్లాడుతూ.. ఉచిత పథకాలపై దేశ వ్యాప్త చర్చ జరగాలన్నారు. ఇక పెట్టుబడులన్నీ ప్రధాని నరేంద్రమోదీగుజరాత్ రాష్ట్రానికి తరలించుకుపోతున్నారన్న సీఎం రేవంత్.. ఇదెక్కడి న్యాయం? అని ప్రశ్నించారు. 'నెలకు 18 వేల కోట్ల రూపాయల ఆదాయం తెలంగాణకు వస్తే...అందులో 13 వేల కోట్ల రూపాయలు జీతాలు అప్పుల చెల్లింపులకే పోతుంది. మిగిలిన 5000 కోట్ల రూపాయలలోనే అభివృద్ధి, సంక్షేమ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మౌలిక వసతుల ప్రాజెక్టులపై కనీసం 500 కోట్ల రూపాయలు కూడా మేము ఖర్చు పెట్టలేకపోతున్నాం. 1971 నాటి జనాభా లెక్కల ఆధారంగా డీ లిమిటేషన్ జరగాలి. డిలిమిటేషన్ పై చర్చ జరిపేందుకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి. హిందీని బలవంతంగా రుద్దడాన్ని మేము వ్యతిరేకిస్తాం. హైదరాబాదులో ఒలింపిక్ క్రీడలు నిర్వహించడానికి అవసరమైన మౌలిక వసతులున్నాయి' అని సీఎం రేవంత్ పేర్కొన్నారు.



## గ్రేటర్ హైదరాబాద్‌లో ఆస్తి పన్ను చెల్లింపు.. తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

హైదరాబాద్,: హైదరాబాద్ నగర వాసులకు జీహెచ్ఎంసీ శుభవార్త చెప్పింది. ఆస్తి పన్ను చెల్లింపులో వడ్డీపై 90 శాతం డిస్కౌంట్ ఇస్తున్నట్లు ప్రకటించింది. ఇప్పటికే గతేడాది బకాయిదారులకు బల్దియా వన్ టైం సెటిల్‌మెంట్ అవకాశాన్ని కల్పిచ్చింది. తాజాగా, మరోసారి ఆ అవకాశాన్ని కల్పిస్తూ పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దాన కిషోర్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ నెలాఖరు వరకు పెండింగ్ ప్రాపర్టీ ట్యాక్స్ కట్టేవారికి ఈ సౌకర్యం అందుబాటులో ఉంటుంది. తద్వారా 100 శాతం 10 శాతం వడ్డీతో బకాయిదారులంతా తమ ఆస్తిపన్నును చెల్లించే వెసులుబాటు కలుగుతుంది. అయితే,ఈ ఓటీఎస్ ద్వారా పెండింగ్‌లో ఉన్న ప్రాపర్టీ ట్యాక్స్ వసూలవుతుందని జీహెచ్ఎంసీ అధికారులు భావిస్తున్నారు.

# కుటుంబాలు వలస వెళ్లడం చూశాకే ఆ హామీ ఇచ్చాం

మొదటి పేజీ తరువాయి

అవన్నీ చూశాకే ఇరిగేషన్, లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి చేసి సాగు, తాగునీరు ఇస్తామని హామీ ఇచ్చానని మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. ఒకే వాహనంపై 200 మంది వెళ్లడం కూడా గమనించానని ఆయన తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం సాగు, తాగునీరు ఇచ్చే బాధ్యత ఎన్డీయే ప్రభుత్వం తీసుకుంటుందని చెప్పారు. అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ, నంద్యాల తర్వాత కర్నూలులో పాదయాత్ర చేశానని, ఈ రెండు ప్రాంతాల మధ్య ఎంతో వ్యత్యాసం కనిపించిందని అన్నారు. కర్నూలు జిల్లాలో మారుమూల ప్రాంతాలకు కూడా సాగు, తాగునీరు అందించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ విషయమై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో రెండుసార్లు చర్చించినట్లు అసెంబ్లీ వేదికగా చెప్పారు. స్థూల నమోదు నిష్పత్తి, అక్షరాస్యతలో కర్నూలు వెనుకబడి ఉందనేది ఎవరూ కాదనలేని వాస్తవమని ఆయన అన్నారు. అందుకే రాబోయే డీఎస్సీలో కర్నూలుకు ఎక్కువమంది ఉపాధ్యాయులు రాబోతున్నారని తెలిపారు. విద్యార్థులకు అపార్ ఐడీని కేంద్రం తప్పనిసరి చేస్తోందన్నారు. కేజీ నుండి పీజీ వరకు ఒక కంట్రోల్ రూమ్ పెట్టి విద్యార్థులను ట్రాక్ చేస్తామని వెల్లడించారు. ఇందుకు అవసరమైన ఐటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను తయారు చేస్తున్నామని తెలిపారు. ఒక్క డ్రాపవుట్ కూడా ఉండకూడదనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. సీజనల్ హాస్టల్స్‌కు సంబంధించి కేవలం భోజనం పెట్టడానికి మాత్రమే అవకాశం ఉందన్నారు. కరవు ప్రాంతాల్లోని ప్రజలు వేరేచోటకు వలసలు వెళ్లిన సమయంలో అక్కడ అడ్మిషన్లు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు చెప్పారు. హాస్టళ్ల పనితీరు, విద్యార్థుల ట్రాకింగ్ ఉంటేనే డ్రాపవుట్స్ తగ్గుతాయని ఆయన అన్నారు. రాష్ట్రంలో 2024-25లో 121 సీజనల్ హాస్టళ్లు ఉండగా, వాటిలో 6,040 మంది విద్యార్థులకు భోజన వసతి కల్పించినట్లు చెప్పారు. ఇందుకోసం రూ.6.04 కోట్లు ఖర్చు పెడుతున్నామని ఆయన అన్నారు. సీజనల్ హాస్టళ్ల నిర్వహణ ఇప్పటివరకు ప్రణాళికాబద్ధంగా లేదని అన్నారు. పిల్లలకు మెరుగైన విద్య అందించాలన్నదే తమ లక్ష్యమని నారా లోకేశ్ అన్నారు. పిల్లల వలసల నివారణకు గత ప్రభుత్వం పని చేయలేదని విమర్శించారు. సీజనల్ హాస్టళ్ల పనితీరు మెరుగుదలకు అసెంబ్లీ అయ్యాక శాసనసభ్యులతో చర్చిస్తామని అన్నారు. హాస్టళ్ల పనితీరు మెరుగు, పాఠశాలల్లో చేరేవారి నిష్పత్తి, విద్యార్థులు-ఉపాధ్యాయుల నిష్పత్తి పెరుగుదలకు వచ్చే మూడేళ్లు కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. బీసీ, ఎస్సీ హాస్టళ్లను కన్వర్జెన్స్ చేసి సీజనల్ హాస్టళ్ల పనితీరు మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి అన్నారు. రాబోయే మూడేళ్లలో హాస్టళ్ల పనితీరులో మార్పు తెస్తామన్నారు. సీజనల్ హాస్టళ్లకు సంబంధించి పలు పత్రికల్లో ఆర్టికల్స్ వచ్చాయని, ఏ మీడియాలో వచ్చినా సీరియస్‌గా తీసుకుంటున్నామని చెప్పారు. రాబోయే రెండు, మూడు నెలల్లో సీజనల్ హాస్టళ్ల పనితీరులో మార్పును మీరే గమనిస్తారని మంత్రి లోకేశ్ తెలిపారు.



# పవన్‌కు అవగాహన లేదు.. కూటమి నుంచి బయటకు రావాలి

మొదటి పేజీ తరువాయి

ఇదే సమయంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు అస్సలు అవగాహన లేదు. ప్రతిపక్ష హోదా మా హక్కు. సంఖ్యాపరంగా తమకే సీట్లు ఎక్కువ వచ్చాయని పవన్ అంటున్నారు. మాకు ప్రతిపక్ష హోదా ఇవ్వనప్పుడు.. పవన్ కూటమి నుంచి బయటికి రావాలి.. అని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్సీ బొత్స మాట్లాడుతూ.. బడ్జెట్ ప్రసంగంపై నేను మాట్లాడాను. మేము ప్రజల తరఫున మాట్లాడుతున్నాం. ప్రజల కోసం ప్రశ్నించాల్సిన బాధ్యత మాపై ఉంది కాబట్టే నిలదీస్తున్నాం. రాష్ట్రంలో 18 ఏళ్లు నిండిన మహిళలకు రూ.1500 ఇస్తామన్నారు. బడ్జెట్‌లో ఆ ప్రస్తావనే లేదు. ఉచిత బస్సు పథకానికి సంబంధించి కూడా బడ్జెట్‌లో ప్రస్తావన లేదు. ఎన్నికల ముందు చంద్రబాబు సంపద సృష్టిస్తామన్నారు కదా?. మరి ఇప్పుడు ఏమైంది మీ సంపద సృష్టి?. ఎన్నికల సమయంలో కూటమి ఇచ్చిన హామీలపైనే మేము ప్రశ్నిస్తున్నాం.

సూపర్ సిక్స్ నిధులేవి..

రూ.322 కోట్ల బడ్జెట్ లోటు, విధ్వంసం అనే పదంపైన నేను అసెంబ్లీలో మాట్లాడాను. విద్యుత్ చార్జీలు పెంచమని, ట్రూ ఆఫ్ చార్జీలు వేయమని చెప్పారని తప్పులు మాట్లాడితే మాట్లాడానని చెప్పం. రూ.2400 కోట్లు ఉపాధి హామీ పథకం నిధుల బకాయిలు గురించి చెప్పం. వాస్తవాలు తట్టుకోలేక పోతున్నారు. సూపర్ సిక్స్ అమలు చేస్తామని అధికారంలోకి వచ్చారు. ప్రస్తుతం ఇస్తున్న పథకాల కంటే ఎక్కువ ఇవ్వలేమని మా నాయకుడు వైఎస్ జగన్ ముందే చెప్పారు. ప్రస్తుతానికి సూపర్ సిక్స్‌లో ఒక్కటి అమలు చేస్తున్నారు. తల్లికి వందనంకి 9400 పెట్టి.. డిమాండ్‌లో 8200 కోట్లు చూపించారు.. మరి మిగిలింది ఎక్కడ నుండి తెస్తారు. రైతు భరోసాకి 20వేల రూపాయలు కేంద్రం ప్రభుత్వంతో సంబంధం లేకుండా ఇస్తామని చెప్పారు.. అలా చూసినా 6300 కోట్లు కేటాయించారు.. కావాల్సింది 7500 కోట్లు. 4 లక్షల ఉద్యోగాలు ఇచ్చామని చెప్పారు.. అడిగితే ఉద్యోగాలు వస్తున్నాయని చెప్పారు. నిరుద్యోగ భృతి ఊసే బడ్జెట్ లేదు.. ఆడబిడ్డ నిధి లేదు. 50 ఏళ్లకు పెన్షన్ లేదు. బుల్డోజర్ ప్రభుత్వం.. మాట్లాడితే లాక్కొని వెళ్ళిపోతున్నారు. మహిళలకు ఉచిత బస్సు పెడితే ప్రభుత్వానికి 30 శాతం మాత్రమే భారం.. అది కూడా పెట్టలేకపోయారు.



అప్పులే సంపద సృష్టి..

చిత్తశుద్ధి, కమిట్మెంట్, చేద్దామనే ఉద్దేశ్యం కూడా లేదు. 93వేల కోట్లు 10 నెలల కాలంలో అప్పులు చేశారు.. మార్క్‌ఫెడ్ నుండి 13వేల కోట్లు అప్పులు చేశారు. సత్యదూరమైన మాటలు, కించపరిచే మాటలు, ఏం మాట్లాడకపోయిన మధ్యలో ఇబ్బంది పెడుతూనే ఉన్నారు. 25వేల కోట్లు బకాయిలు, ఐఆర్, పీఆర్సీ ఇస్తామని చెప్పారు.. ఒక్కటీ అమలు చేయలేదు. జీతాలు కూడా ఒకటో తేదీన పడడం లేదు. సంపద సృష్టి చేస్తామని ఎక్కడ చేస్తున్నారు. చెత్తపన్ను రద్దు చేశారు.. కానీ చెత్త ఎత్తడం లేదు. 80 వేల టన్నులు చెత్త పేరుకుపోయింది. రైతుల సమస్యలపై మాట్లాడితే భరించే పరిస్థితి లేదు. కూటమి సభ్యుల మాదిరిగా అనుకూలంగా మాట్లాడాలి.. భజన చేయాలి అనుకొంటున్నారు. సభలో జరిగిన తీరును ఖండిస్తున్నాం. ప్రజలకు వాస్తవాలు తెలియజేయడానికి మేము ఉండాలి. కోటి 15లక్షల లబ్ధిదారులు ఉంటే 85 లక్షల మందికి కేటాయించారు. వాళ్ళు చెప్పిన అప్పులు అన్ని కూడా కూటమి ప్రభుత్వం లో చేసిందే. మా ప్రభుత్వ హయంలో 59వేల కోట్లు అత్యధికంగా చేసింది. పది నెలల కాలంలో లక్ష కోట్లు అప్పులు చేశారు. మేము విధ్వంసం చేస్తే అప్పు ఎలా పుట్టింది?. ప్రజల తరఫున మేము ప్రశ్నిస్తూనే ఉంటాం.. ఎన్నికల సమయంలో కూటమి ఇచ్చిన హామీలపైనే మేము ప్రశ్నిస్తున్నాం' అని తెలిపారు.

## కేబినెట్ భేటీ అనంతరం రంగన్న మృతిపై మంత్రివర్గంలో చర్చ

**అమరావతి,:** వివేకా హత్య కేసులో ప్రత్యక్ష సాక్షిగా ఉన్న వాచ్ మన్ రంగన్న మృతి చెందడం చర్చనీయాంశంగా మారింది. రంగన్న ఊపిరితిత్తుల వ్యాధితోమరణించాడనిఆయనభార్య చెబుతున్నప్పటికీ, పలు వైపుల నుంచి అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా, ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా రంగన్న మృతిపై అనుమానాలు వ్యక్తం చేశారు. ఏపీ కేబినెట్ భేటీ అనంతరం వాచ్ మన్ రంగన్న మృతిపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ... గతంలో పరిటాల రవి హత్య కేసులోనూ సాక్షులు ఇదే విధంగా మరణిస్తూ వచ్చారని... ఇప్పుడు వివేకా హత్య కేసులో అలాంటి పరిణామాలే కనిపిస్తున్నాయని వ్యాఖ్యానించారు. కాగా, వివేకా హత్య జరిగినప్పుడు జగన్, వైఎస్ భారతిలను కారులో హైదరాబాద్ నుంచి తీసుకువచ్చిన డ్రైవర్ అనుమానాస్పద స్థితిలో మరణించాడన్న విషయం, వివేకా హత్య గురించి కారులో జగన్, భారతి మాట్లాడుకున్న మాటలను ఆ డ్రైవర్ విన్నాడని, ఆ తర్వాత అనుమానాస్పదంగా మృతి చెందాడంటూ గతంలో జరిగిన ప్రచారంపైనా ఈ సమావేశంలో చర్చ జరిగింది. వివేకా వ్యవహారానికి సంబంధించి ఇప్పటిదాకా ఏడుగురు మరణించారని కూడా చర్చ జరిగింది. దీనిపై చంద్రబాబు స్పందిస్తూ... జగన్ కుట్రల పట్ల అప్రమత్తంగా ఉండాలని తాను అనేకసార్లు చెబుతున్నానని గుర్తుచేశారు. కాగా, వాచ్ మన్ రంగన్న మృతి వెనుక పోలీసుల హస్తం ఉందంటూ వచ్చిన వార్తలపై డీజీపీ స్పందించారు. డీజీపీ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, రంగన్న మృతిలో అనుమానాలు ఉన్న మాట నిజమేనని, పోలీసుల విచారణలోనూ ఆ విషయం స్పష్టమైందని అన్నారు.

## ఉచిత బస్సు ప్రయాణం అని చెప్పి ఇప్పుడు కండిషన్ అప్లై అంటారా...



**అమరావతి,:** ఏపీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కచ్చితంగా అమలవుతుందని, అయితే ఏ జిల్లా మహిళలు ఆ జిల్లాలోనే ఉచితంగా ప్రయాణించేందుకు అర్హులు అని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొనడం తెలిసిందే. దీనిపై పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఏరు దాటేంత వరకు ఓడ మల్లన్న... ఏరు దాటాక బోడి మల్లన్నలా కూటమి ప్రభుత్వ తీరు ఉందని మండిపడ్డారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అని ఊదరగొట్టి ఓట్లు వేయించుకున్నారని, ఇప్పుడు కండిషన్ అప్లై అనడం దారుణం అని షర్మిల విమర్శించారు. "మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం జిల్లా స్థాయి వరకే పరిమితం అని చెప్పడం మోసం. అమలు చేయాలన్న చిత్తశుద్ధి లేక ఇలాంటి సాకులు చెబుతున్నారు. ఆదిలోనే యూటర్న్ తీసుకోవడం అంటే ఇదే మరి. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి 9 నెలలు దాటినా ఉచిత బస్సు ప్రయాణం కల్పించకుండా కమిటీల పేరుతో కాలయాపన చేశారు. రాష్ట్రాల్లో పర్యటిస్తూ విహార యాత్రలు చేశారు. పథకం అమలుకు ముందే ఇన్ని నిబంధనలు పెట్టిన ఈ ప్రభుత్వం... రేపు పథకాన్ని అమల్లోకి తీసుకువచ్చే సరికి నియోజకవర్గం, మండల పరిధి వరకే ఫ్రీ అంటుందేమో" అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో మహిళలకు రాష్ట్రమంతటా ఉచిత ప్రయాణమేనని షర్మిల స్పష్టం చేశారు. పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్ బస్సుల్లో ఎక్కడి నుంచి ఎక్కడికైనా అంతా ఉచితమే... ఆధార్ కార్డు చూపిస్తే చాలు... ఎంతదూరమైనా జీరో టికెట్ అని వివరించారు. "ఇటువంటి మంచి పథకాన్ని, అతి తక్కువ ఖర్చుతో మహిళలకు మేలు జరిగే హామీని అమలు చేయడానికి కూటమి ప్రభుత్వానికి ఇంకా మనసు రావడంలేదు. నెలకు రూ.350 కోట్లు మహిళల కోసం ఆర్టీసీకి ఇవ్వడానికి ప్రభుత్వానికి ధైర్యం చాలడంలేదు. మహిళలకు భద్రత కల్పించే విషయంలో కూడా లాభనష్టాలు చూడాలా? తక్షణం మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించాలని, రాష్ట్రమంతటా ఉచిత ప్రయాణ సౌకర్యం ఉండాలని మహిళల తరఫున కూటమి ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోంది" అంటూ షర్మిల ట్వీట్ చేశారు.

## పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేనలో చేరిన వైసీపీ మాజీ ఎమ్మెల్యేల




**అమరావతి,:** పిఠాపురం వైసీపీ మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు నేడు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. పెండెం దొరబాబుకు పవన్ కల్యాణ్ జనసేన కండువా కప్పి పార్టీలోకి సాదర స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్, శాసనమండలిలో జనసేన విప్ హరిప్రసాద్, జనసేన కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ కూడా పాల్గొన్నారు. కాగా, పెండెం దొరబాబుతో పాటు పిఠాపురం నియోజకవర్గానికి చెందిన ఇతర వైసీపీ నేతలు కూడా జనసేన పార్టీలోకి వచ్చారు. వారికి నాదెండ్ల మనోహర్ జనసేన కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. జనసేనలో చేరిన వారిలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, పిఠాపురం మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ కొత్తపల్లి పద్మ బుజ్జి, గొల్లప్రోలు మార్కెట్ కమిటీ చైర్మన్ మొగిలి వీర వెంకట సత్యనారాయణ కూడా ఉన్నారు.

## బీఆర్ఎస్ నేతలతో భేటీ.. కేసీఆర్ కీలక నిర్ణయం



సిద్ధిపేట: ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ నేతలతో కేసీఆర్ సమావేశమయ్యారు. పలు అంశాలపై ఆయన చర్చించారు. ఎమ్మెల్సీగా ఎవర్ని నిలపాలన్న విషయంపై అభిప్రాయాలను కేసీఆర్ తీసుకున్నారు. యాసంగి పంటకు సాగునీరు అందించే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి నిర్ణయించారు. హామీల అమలుకై పోరాటాలకు కార్యాచరణ రూపొందించాలని కేసీఆర్ సూచించారు. బహిరంగ సభపై పార్టీ నేతలతో చర్చించిన కేసీఆర్.. ఏప్రిల్ 27న వరంగల్ వేదికగా బీఆర్ఎస్ ఆవిర్భావ సభ నిర్వహించాలని నిర్ణయించినట్లు సమాచారం. కేసీఆర్‌తో బీఆర్ఎస్ నేతల సమావేశం సుదీర్ఘంగా కొనసాగింది. పార్టీ ప్లీనరీ, బహిరంగ సభ, ఎమ్మెల్సీ అభ్యర్థి, అసెంబ్లీ సమావేశాలపై చర్చ జరిగింది. హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్న కేసీఆర్.. కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. నిత్యం ప్రజల్లో ఉండాలని బీఆర్ఎస్ నేతలను కేసీఆర్ ఆదేశించారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రజా సమస్యలపై రేవంత్ సర్కార్‌ను నిలదీయాలని కేసీఆర్ సూచించారు.

## ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



బీర్కూర్, మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్):ఈరోజు బీర్కూర్ మండల పరిషత్ కార్యాలయం లో రెడ్ క్రాస్ మరియు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించడం జరిగింది మహిళాలకు ఆటల పోటీలు మరియు వివిధ డిపార్ట్మెంట్ లో ఉత్తమ మహిళా లకు సన్మానం నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమం లో ఎంపీడీఓ బాను ప్రకాష్ , ఏఎంసి వైస్ చైర్మన్ యమ రాములు , మాజీ ఎంపీపీ రఘు, రెడ్ క్రాస్ జిల్లా నిర్వాహక కమిటీ ప్రతినిది విఠల్ , టీచర్ దుర్గ ప్రసాద్, ఏపిఎం గంగాధర్, సీసీఎస్ మహేందర్,నగలక్ష్మి, పందరి, బుమయ్య, ఐకేపీ మహిళలు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎర్రబెల్లి స్వర్ణ వరదలు



పరకాల నియోజకవర్గం (శుభోదయం న్యూస్) : వర్ధన్నపేట కేంద్రంలో ఎ.బి.యస్ ఫంక్షన్ హాల్ లో బంగారు సుజాత-సదానందం కూతురు వివాహ మహోత్సవానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శ్రీమతి శ్రీ ఎర్రబెల్లి స్వర్ణ-వరదరాజేశ్వర్ రావు ఈ కార్యక్రమం లో కౌన్సిలర్ సుధీర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గంగాధర్ రావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అఫ్సర్, ప్రభాకర్, మసూద్ నాయకులు ఎర్ర శ్రీకాంత్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ పోలీస్ కమిషనరేట్ నూతన కమిషనర్ గా సన్ ప్రీత్ సింగ్




వరంగల్ జిల్లా ( శుభోదయం న్యూస్ ): వరంగల్ పోలీస్ కమిషనరేట్ నూతన పోలీస్ కమిషనర్ గా సన్ ప్రీత్ సింగ్ ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారిచేసింది. ప్రస్తుతం సూర్యాపేట జిల్లా ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న సన్ ప్రీత్ సింగ్ 2011ఐపిఎస్ బ్యాచ్ కు చెందినవాడు.2012 సంవత్సరంలో ములుగు ఏ. ఎస్పీ, వరంగల్ రూరల్ ఓ ఎస్ డి గా పని చేశారు. అనంతరం ఎల్.బి నగర్ డిసిపీ గా,ఎస్పీగా జగిత్యాల్ లో పనిచేశారు. ప్రస్తుతం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా రామగుండం పోలీస్ కమిషనర్ బదిలీ అయినారు.

## గుండెపోటుతో మరణించిన కార్మికుని కుటుంబానికి ఆర్థిక సహాయం ఇప్పించిన

-బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్



శేర్లింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ లో కట్టెల మండిలో గత కొన్ని సంవత్సరాలుగా కట్టెల మండి ఓనర్ శ్రీనివాస్ దగ్గర శ్రీకాకుళానికి చెందిన కార్మికుడు దుర్యోధన అక్కడ పని చేయడం జరుగుతుంది... కట్టెల మండిలో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు గుండెపోటు రావడంతో దుర్యోధన అనే కార్మికుడు మరణించడం జరిగింది... మరణించిన కార్మికుడు దుర్యోధన కుటుంబ సభ్యులకు ఎవరైతే న్యాయం చేస్తారో అని తెలుసుకొని వాళ్ళ కుటుంబ సభ్యులు, బి ఆర్ టి యు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్ ను ఆశ్రయించారు.. వెంటనే స్పందించిన రవిసింగ్ మియాపూర్ కట్టెల మండి ఓనర్ శ్రీనివాస్ దగ్గరికి వెళ్లి చనిపోయిన దుర్యోధన కుటుంబానికి ఏలాంటి ఉపాధి లేకపోవడంతో కుటుంబ సభ్యులకు ఎలాగైనా తగిన ఆర్థిక న్యాయం జరగాలని ఆ కుటుంబానికి, మూడు లక్షల రూపాయలు ఇప్పించడం జరిగింది.. కుటుంబ సభ్యులు మాట్లాడుతూ మాకు న్యాయం చేసిన కార్మిక నాయకుడు రవిసింగ్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.. ఈ కార్యక్రమంలో అనిల్, సుదర్శన్, జగన్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు..

## తెలంగాణలో 21 మంది ఐపీఎస్ అధికారుల బదిలీలు

తెలంగాణ స్టేట్ బ్యూరో( కె రామారావు ) శుభోదయం న్యూస్:

తెలంగాణలో 21 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది బదిలీ అయిన అధికారుల్లో ఒక అడిషనల్ డీజీ ఇద్దరు ఐజీలు ఇద్దరు డిఐజీలు ఇద్దరు నాన్ క్యాడర్ ఎస్పీలు ఉన్నారుఈ మేరకు సీఎస్ శాంతి కుమారి, ఈరోజు మధ్యా హ్నం ఉత్తర్వులు జారీ చేశారు బదిలీ అయిన అధికారుల్లో ఒక అడిషనల్ డీజీ ఇద్దరు ఐజీపీలు ఇద్దరు డీఐజీలు ఉన్నారు ఇద్దరు నాన్ క్యాడర్ ఎస్పీ లకు సైతం స్థాన చలనం కల్పించింది ప్రభుత్వం మిగిలిన 14 మంది ఎస్పీలు బదిలీ అయ్యారుబదిలీ అయిన ఐపీఎస్?లు..రామగుండం సీపీగా అంబర్ కిషోర్ ఝావరంగల్ సీపీగా సన్‌ప్రీత్ సింగ్ఇంటెలిజెన్స్ ఎస్పీగా సింధూశర్మకామారెడ్డి ఎస్పీగా రాజేష్ చంద్రనిజామాబాద్ పోలీస్ కమిషనర్‌గా సాయిచైతన్యకరీంనగర్ సీపీగా గౌస్ ఆలంఆదిలాబాద్ ఎస్పీగా అఖిల్ మహజన్‌నార్కోటిక్ బ్యూరో ఎస్పీగా రూపేష్‌భువనగిరి డీసీపీగా అక్షాన్ష్ యాదవ్‌సంగారెడ్డి ఎస్పీగా పంకజ్ పరితోష్‌సిరిసిల్ల ఎస్పీగా గీతే మహేష్ బాబా సాహెబ్‌వరంగల్ డీసీపీగా అంకిత్ కుమార్‌మంచిర్యాల డీసీపీగా భాస్కర్‌పెద్దపల్లి డీసీపీగా కరుణాకర్‌సెంట్రల్ జోన్ డీసీపీగా శిల్పవల్లిసూర్యాపేట ఎస్పీగా నరసింహసీఐడీ ఐజీగా ఎం.శ్రీనివాసులుసీఐడీ ఎస్పీగా పి.రవీందర్ ఎస్పీగా వై.సాయిశేఖర్‌అడిషనల్ డీజీపీగా అనిల్‌కుమార్‌ఉమెన్ సేఫ్టీ వింగ్ ఎస్పీగా చేతన ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది.

## ఆర్టీసీ బస్సు ఢీకొని గీత కార్మికునికి తీవ్ర గాయాలు




వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్)యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని నాగారం గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో రోజువారి కళ్ళు గీత పనికి వెళ్లి వస్తున్న గీతా కార్మికుడిని ఆర్టీసీ బస్సు ఢీకొని తీవ్ర గాయాల పాలయ్యాడు. గీత కార్మికుడు వలిగొండ మండలంలోని లింగరాజుపల్లి గ్రామానికి చెందిన గోపగోని సాయిలుగా గుర్తించారు. అతడు రోజువారి పనిలో భాగంగా గోకారం గ్రామంలో తాటి చెట్లను ఎక్కి కళ్ళు గీసి తిరిగి ఇంటికి వెళుతున్న సమయంలో నాగారం గ్రామం వద్ద నల్లగొండ నుండి భువనగిరికి వెళుతున్న యాదగిరిగుట్ట డిపోకు చెందిన ఎక్స్ ప్రెస్ బస్సు ఢీకొనడంతో గీత కార్మికుడు బస్సు యొక్క ముందర టైర్లు వద్ద అతని ద్విచక్ర వాహనం పడడంతో అతడు రోడ్డు పక్కన ఎగిరి పడడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని వెంటనే 108 అంబులెన్స్ వాహనంలో మెరుగైన వైద్యం కొరకు హైదరాబాదుకు తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉందని గ్రామ ప్రజలు తెలుపుతున్నారు. నాగారం గ్రామ ప్రజలు రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే రోడ్డుపై బైఠాయించి ఆర్టీసీ అధికారులు వచ్చేంతవరకు ధర్నా నిర్వహించారు. సంఘటన స్థలానికి పోలీసులు వచ్చి ధర్నా చేస్తున్న గ్రామ ప్రజలను రాకపోకలకు ఇబ్బంది కలగకుండా చూసి ఆర్టీసీ అధికారులతో మాట్లాడి ఆర్టీసీ అధికారులు వచ్చి గ్రామ ప్రజలతో మాట్లాడడం జరిగినది. నాగారం గ్రామం వై జంక్షన్ లా ఉండడం వల్ల చుట్టుపక్కల దాదాపుగా 10 గ్రామాల ప్రజలు బస్సులలో ప్రయాణం చేసి ఇక్కడ దిగి గ్రామాలకు వెళ్లవలసి ఉండడంతో గ్రామ ప్రజలు నాగారం వద్ద రిక్వెస్ట్ స్టాప్ ని ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను కోరారు. ఆర్టీసీ అధికారులు వెంటనే స్పందించి నాగారం గ్రామం వద్ద రిక్వెస్ట్ స్టాప్ ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.ఈ హామీతో గ్రామ ప్రజలు మళ్లీ ఇలాంటి సంఘటన జరగకుండా చూడాలని అధికారులను గ్రామ ప్రజలు కోరారు.

## ఎంపీడీవో చేతుల మీదుగా గ్రామపంచాయతీ కార్మికులకు ఐడెంటి కార్డుల పంపిణీ : సిఐటియు



వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్): యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో పనిచేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులకు,గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు వలిగొండ మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో జితేందరరెడ్డి చేతుల మీదుగా కార్మికులకు ఐడెంటి కార్డులను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి. తుర్కపల్లి సురేందర్ మాట్లాడుతూ ప్రభుత్వాలు ఎన్ని మారినా గ్రామపంచాయతీ కార్మికుల బ్రతుకుల్లో మార్పు రావడంలేదని, వారి సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమైనాయని అన్నారు. సిఐటియు పోరాట ఫలితంగా కార్మికుల యొక్క పెండింగ్ వేతనాలు విడుదలై, ఐడెంటి కార్డు సాధించుకోవడం జరిగిందని ఈ సందర్భంగా శుక్రవారం వలిగొండ మండల కేంద్రంలో ఎంపీడీవో చేతుల మీదుగా ఐడెంటి కార్డు పంపిణీ చేసుకోవడం శుభపరిణామని అన్నారు. కార్మికుల వేతనాలు ప్రత్యేక బడ్జెట్ కేటాయించి ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రతినెలా ఒకటో తేదీని బ్యాంకు ద్వారా వేతనాలు ఇవ్వాలని ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని, మార్చి 7 న జరిగే ఎంపీడీవో ఆఫీస్ ముందు ధర్నా జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. సిఐటియు మండల నాయకులు రాదారపు మరియు నాయకులు ఎడవల్లి ఎల్లమయ్య, కొండే నరసింహ,గంగాపురం సురేందర్, ముఉ కుర్తి రాములు, బోడ వెంకటేశం,కందుల లింగ స్వామి, సూరారం మధు, చెరుకు అంజయ్య, పోలేపాక లలిత, పావురాల శీను, కలుకూరి స్వామి, నీలం రాజు, రాములు, ఎల్లంకి స్వామి, ఉ కుర్తి పుష్ప, రేణుక, శ్రీరాములు సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత దేశవ్యాప్తంగా దళితులపై పెరిగిన దాడులు

-చేవెళ్ల ఎస్సీ ఎస్టీ డిక్లరేషన్ పై సీఎం మౌనం వీడాలికేవీపీస్




వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్) బిజెపి అధికారంలోకి వచ్చాక దేశంలో దళితులకు రక్షణ లేకుండా పోయిందని దేశ వ్యాప్తంగా దళితులపై దాడులు, హింస పెరిగిందని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు దుబ్బ లింగం, కెవిపిఎస్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి సిర్పంగి స్వామి లు అన్నారు. అదేవిదంగా కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినవిధంగా చేవెళ్ల ఎస్సీ ఎస్టీ డిక్లరేషన్ పై సీఎం మౌనం వీడాలని తక్షణమే అంబేద్కర్ అభయహస్తానికి మార్గదర్శాకాలు వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు.శు క్రవారం రోజున వలిగొండ మండల కేంద్రంలో జరిగిన కేవీపీస్ మండల మహాసభలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్న సందర్భంగా వారు మహిళల అణిచివేతకు మహిళల గ్యాంగ్ రేపులు అత్యాచారాలు హింస పెరగడానికి మనువాద భావజాలాన్ని వ్యాప్తి చేస్తున్న ఆర్ఎస్ఎస్ బిజెపి విధానాలే ప్రధాన కారణం అన్నారు.శాస్త్ర సాంకేతిక రంగం ఎంతో పురోభివృద్ధి చెందినప్పటికీ చంద్రయాన్ ప్రయోగం జరిగినప్పటికీ నేటికీ కులవక్ష అంటరానితనం కొనసాగడం దేశం సిగ్గుతోతలదించుకోవాల్సి వస్తుందన్నారు అంటరానితనాన్ని నేటి ఆధునిక యువతరం ప్రతిఘటించంచాలన్నారు పౌర సమాజ అభ్యుదయ వ్యక్తులు ప్రగతిశీల కాముకులు ఈ ప్రతిఘటన ఉద్యమాల్లో పాల్గొనాలని వారు కోరారు .రాష్ట్రంలో రేవంత్ రెడ్డి సర్కార్ దళితులకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడం లేదన్నారు ఎస్సీ కార్పొరేషన్ ను బలోపేతం చేసే విధంగా బడ్జెట్ కేటాయింపులు ఉండాలన్నారు. గత ప్రభుత్వం దళిత బంధును అవినీతి మయం చేసిందన్నారు. చేవెళ్ల డిక్లరేషన్ లో ప్రకటించిన విధంగా ఏడాదికి 750 కోట్ల రూపాయల చొప్పున కేటాయించాలన్నారు. దళితులకు అసైన్డ్ చేయబడిన భూములకు సత్వరమే పట్టాలు ఇవ్వాలన్నారు రైతుబంధు రైతు బీమా అసైన్డ్ భూమి హక్కు దారులకు ఇవ్వాలన్నారు కౌలు రైతులకు సైతం రైతుబంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ హాస్టల్ల అద్దెభవనాలకు కిరాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు మెస్ కాస్మోటిక్ చార్జీలు పెంచిన ప్రభుత్వం వాటిని విడుదల చేయడం లేదన్నారు. కులాంతర వివాహాలు చేసుకున్న దంపతులకు ఏళ్ల తరబడి పెండింగ్ ఉన్న ప్రభుత్వ ప్రోత్సాహకాలను తక్షణమే విడుదల చేయాలన్నారు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల బాధితులకు అందాల్సిన ఎక్స్ గ్రేషియో కూడా పెండింగ్ లో ఉండటం విచారకరమన్నారు రాష్ట్ర ప్రభుత్వం 11 నెలల కిందట దళితులకోసం ప్రకటించిన ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కేంద్ర బిజెపి సర్కార్ రాజ్యాంగం రద్దుకు పరోక్షంగా కుట్రలు కుతంత్రాలు చేస్తుందన్నారు రాష్ట్రంలో కూడా మతోన్మాద మూక దాడులు కుల దురహంకార హత్యలు పెట్రేగిపోతున్నాయని చెప్పారు వాటిని అరికట్టడానికి కులాంతర వివాహితుల రక్షణ చట్టం చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో పిఎన్ఎం మండల కార్యదర్శి కొమ్ము స్వామి పాల్గొన్నగా,ఈ మహాసభలో కెవిపిఎస్ మండల అధ్యక్షులుగా ఏటెల్లినరసింహ,మండల కార్యదర్శిగా వేముల అమరేందర్, ఉపాధ్యక్షులుగా ఈర్లపల్లి నర్సింహ,వేముల లక్ష్మయ్య, సహాయ కార్యదర్శులుగా పోలేపల్లి స్వామి చేగురి నాగయ్య, కోశాధికారిగా గోళ్ళ శివకుమార్ సభ్యులుగా కందుల మత్స్యగిరి, గణేష్, కందుల స్వామి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారి కళ్యాణ మహోత్సవం లో ఎంఎల్ఏ పోచారం



బీర్కూర్, మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్):బీర్కూరు మండలం తిమ్మాపూర్ శివారు తెలంగాణ తిరుమల దేవస్థానము (టీటీడీ) నందు జరుగుతున్న శ్రీలక్ష్మీ గోదా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దశమ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈరోజు జరిగిన శ్రీ దేవి,భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర



స్వామి కళ్యాణ మహోత్సవము కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు శ్రీ పోచారం శ్రీనివాస రెడ్డి . పాల్గొన్న బోధన్ సబ్ కలెక్టర్ శ్రీ వికాస్ మహ తో ,శ్రీ పోచారం శంభు రెడ్డి , డాక్టర్ శ్రీ పోచారం రవీందర్ రెడ్డి , శ్రీ పోచారం సురేందర్ రెడ్డి ,ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు,భక్తులు స్వామి వారి కళ్యాణానికి ముందుగా జరిగిన హోమం లో సతీసమేతంగా పూజలు నిర్వహించిన పోచారం .నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు, భారీ ఎత్తున భక్తులు ఈ కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో ముదురుతున్న వార్..

-కాంగ్రెస్ పార్టీ నుండి వీరగొని రాజుకుమార్ అల్లం మార్రెడ్డీ ని సస్పెండ్ చేసిన మండల అధ్యక్షులు శ్రీనివాస్



గీసుగొండ,మార్చి07(శుభోదయం):కాంగ్రెస్ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న గీసుగొండ మండల నాయకులు విరగోని రాజుకమార్,అల్లం మార్రెడ్డి ఇద్దరిని కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్ చేసామని మండల అధ్యక్షులు తుమ్మనపల్లి శ్రీనివాస్ తెలిపారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ..వీరిద్దరూ టిఆర్ఎస్ బిజెపిలతో లోపాయకార ఒప్పందం ఏర్పరచుకొని కాంగ్రెస్ పార్టీని అభాష్పాలు చేస్తున్నారని అన్నారు.ఈ రోజు నుండి రాజుకుమర్ అల్లం మారెడ్డి ఇద్దరికి కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని గీసుకొండ మండల సమన్వయ సమితి నిర్ణయం మేరకు ఇరువురిని కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్ చేశామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పరకాల కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి చాడ కోమురారెడ్డి మాజీ ఎంపీపీ భీమాగాని సౌజన్య దూలం వెంకటేశ్వర్లు మాజీ ఎంపిటిసి మని గోపాల్,కిసాన్ సెల్ అధ్యక్షుడు పత్తి పొగాకు రవీందర్,కూసం రమేష్,సాంబరెడ్డి,మార్కెట్ డైరెక్టర్ అకుల రుద్ర ప్రసాద్,ఎస్సీ సెల్ గొర్రె రాజు,ఎల్కుర్తి కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు నల్ల సురేష్,లాడె రాజు,తిరుపతి,రమేష్,భాస్కర్,అశోక్ కుమార్,కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## కాలం చెల్లిన... వాహన స్క్రాపింగ్ విధానం కఠిన తరం

రాష్ట్రంలో... రెండో స్క్రాపింగ్ కేంద్రం ప్రారంభం

భవిష్యత్తు తరాలకు కాలుష్య రహిత వాతావరణం అందిద్దాం

ట్రాన్స్ పోర్ట్ జిల్లా అధికారి కొండలరావు



వర్గల్ మండల రిపోర్టర్ విష్ణువర్ధన్ రెడ్డి (శుభోదయం న్యూస్) కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వాతావరణ సమతుల్యతపై ప్రత్యేక దృష్టి సారిస్తూ చర్యలు తీసుకుంటుండగా, కాలం చెల్లిన వాహన స్క్రాపింగ్ చట్టాన్ని కఠిన తరం చేస్తున్నట్లు రవాణ జిల్లా అధికారి కొండలరావు స్పష్టం చేశారు. సిద్ధిపేట జిల్లా వర్గల్ మండలం చందాపూర్ శివారులో అంబర్ ఎంటర్ ప్రైజెస్ పేరిట రెండవ స్క్రాపింగ్ కేంద్రం ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. భవిష్యత్తు తరాలకు కాలుష్య రహిత వాతావరణం కల్పించే క్రమంలో కాలం చెల్లిన వాహనాల తొలగింపు ప్రక్రియ వేగవంతం చేయాలని పేర్కొన్నారు. పాత వాహనాలు తొలగింపుతో రహదారుల భద్రత మెరుగుపర్చి కాలుష్యాన్ని నియంత్రించవచ్చని అన్నారు. అయితే కాలం చెల్లిన వాహనాల తొలగింపులో ప్రభుత్వం వివిధ రకాల రాయితీలు కల్పిస్తుండగా, కొత్త వాహనాలను ప్రోత్సహించినట్లు అవుతుందని తెలిపారు. కాగా ద్విచక్ర, త్రిచక్ర, ఫోర్ వీలర్, భారీ వాణిజ్య వాహనాలను అధికృత ఆటోమేటిక్ టెస్టింగ్ సిస్టం ద్వారా ఫిట్నెస్ పరీక్షలు నిర్వహించి చర్యలు తీసుకోనున్నట్లు స్పష్టం చేశారు. ముఖ్యంగా కాలుష్య నియంత్రణ బోర్డు ఆమోదంతో స్క్రాపింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తుండగా, ఒరిజినల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పునరుద్ధరించని, ఫిట్నెస్ మంజూరి కానీ, వివిధ సందర్భాలలో దెబ్బతిన్న, గడువు ముగిసిన వాహనాలను స్క్రాపింగ్ కేంద్రాలకు పంపిస్తామని, ఇందుకు వాహనదారులు సహకరించాలని కోరారు. ఇప్పటికే ఢిల్లీ వంటి ప్రముఖ ప్రాంతాలలో కాలుష్యం మితిమీరి అడుగు పెట్టలేక పోతుండగా, సామాజిక బాధ్యతగాప్రతి ఒక్కరు 15 ఏళ్లు ముగిసిన, కాలం చెల్లిన వాహనాలను స్క్రాపింగ్ కేంద్రాలలో అప్పగించి సహకరించాలని చెప్పారు. ఆయితే వాహనాల తొలగింపు బహుముఖ ప్రయోజనాలతో చక్కటి ఫలితాలు సాధిస్తుందని, వాతావరణాన్ని సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని గుర్తు చేశారు. వాతావరణంలో సమతుల్యత లోపించి వివిధ రకాల వ్యాధులు ప్రభలే అవకాశం ఉండగా, నగరాలకు పరిమితమైన పొల్యూషన్ సమస్య గ్రామాలకు సైతం విస్తరించడం దురదృష్టకరమని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ క్రిస్టోఫర్, ఏసిపి వెంకట్ రెడ్డి, సంస్థ డైరెక్టర్లు గిరీష్ కుమార్, హరి గోవింద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆరు నెలలుగా పెండింగ్ లో గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు తక్షణమే చెల్లించాలి



అనంతగిరి మండలం (శుభోదయం న్యూస్) : పెండింగ్లో ఉన్న గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు తక్షణమే ప్రభుత్వం చెల్లించాలని కార్మికులు ధర్నా నిర్వహించిన సంఘటన సూర్యాపేట జిల్లా అనంతగిరి మండల ఎంపీడీవో కార్యాలయం ఎదుట చోటుచేసుకుంది ప్రభుత్వం జిపి కార్మికులకు మొండి చేయి చూపిస్తుందని 6 నెలలుగా వేతనాలు రాక విద్యా వైద్యం నిత్యవసర ఖర్చుల భారంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు రాష్ట్ర ప్రభుత్వం 51 జీవోను రద్దుచేసి 61 జీవో నెంబర్ పరచాలని డిమాండ్ చేశారుగ్రామపంచాయతీ కార్మికులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని తెలిపారు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా గ్రీన్ ఛానల్ పద్ధతిలో



వేతనాలు చెల్లిస్తామని ప్రభుత్వం ఇచ్చిన మాటను అమలు చేయాలన్నారు లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెకు దిగుతామని హెచ్చరించారు అనంతరం స్థానిక ఎంపీడీవో సుష్మ కు వినతి పత్రం అందజేశారు.

## అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



మంగపేట, మండల రిపోర్టర్ - తులసి (శుభోదయం న్యూస్):శ్రీ లక్ష్మీనరసింహ దత్త సేన సేవా ట్రస్ట్ చైర్మన్ ఏడు నూతల ఈశ్వర్ చందు ఆదేశానుసారం ట్రస్ట్ మండల అధ్యక్షులు నూతుల కంటి ఈశ్వర్ చంద్ ఆధ్వర్యంలో తిమ్మంపేట గ్రామం ఎస్సీ నేతకాని కాలనీలో బుధవారం రోజున షార్ట్ సర్కిల్ వల్ల గోమాసు సమ్మయ్య (75) వారి ఇల్లు పూర్తిగా అగ్నికి దగ్ధం కావడంవల్ల వారు నిరాశ్రయులైన అయ్యారు..వారికి శ్రీ



లక్ష్మీనరసింహ దత్త సేన సేవా ట్రస్ట్ నుండి 50 కేజీల బియ్యం నిత్యవసర సరుకులు సహాయంగా అందించడం జరిగింది..ఈ కార్యక్రమంలో ట్రస్ట్ గైడెన్సీ జై భీమ్ రామ్మోహన్, ట్రస్టు సభ్యులు సాంబయ్య, గౌరీ శంకర్, మరియు గ్రామస్తులు పూసల నర్సింగరావు, దీకొండ కాంతారావు ,దికొండ బాబు, దుర్గా నర్సింగరావు, సంతోష్, రాంబాబు ,శశి, నాగేష్, తదితరులు పాల్గొన్నారు

## శివకుమార్ కుటుంబానికి భరోసాగా నిలిచిన
# శ్రీ లక్ష్మీనరసింహ దత్త సేన సేవా ట్రస్ట్..



మంగపేట, మండల రిపోర్టర్ - తులసి (శుభోదయం న్యూస్):మంగపేట మండలం కొత్తపేట గ్రామానికి చెందిన గుండారం శివకుమార్ అనే యువకుడు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై మరణించడం జరిగింది శివకుమార్ నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తి కావడం వల్ల ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతుందని తెలుసుకున్న శ్రీ లక్ష్మీనరసింహ దత్త సేన సేవా ట్రస్ట్ చైర్మన్ ఏడునూతుల ఈశ్వర్ చంద్ శర్మ వారి కుటుంబానికి 50 కేజీల బియ్యం మరియు నిత్యవసరకులు సహకారంగా అందించడం జరిగింది.. ఈ కార్యక్రమం ట్రస్ట్ మండల అధ్యక్షులు నూత్తుల కంటి ఈశ్వర్ చంద్ ఆధ్వర్యంలో జరిగింది..ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు ట్రస్టు గైడెన్సీ జై భీమ్ రామ్మోహన్, రాష్ట్ర సభ్యులు సాంబయ్య, గౌరీ శంకర్ మరియు తదితరులు పాల్గొన్నారు

## మున్సిపల్ ఎన్నికల ముందే సింగరేణి మారుపేర్ల విజిలెన్స్ పెండింగ్ కేసులను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్



రామగుండం మండలం రిపోర్టర్- తిరుపతి, (శుభోదయం న్యూస్) రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ నివాసంలో మెమొరండం సమర్పించిన మారుపేర్ల విజిలెన్స్ పెండింగ్ కేసుల కార్మికుల పిల్లలు. త్వరలో జరగబోయే మున్సిపల్ ఎలక్షన్ ముందే మారుపేర్ల విజిలెన్స్ పెండింగ్ కేసుల సమస్యను పరిష్కరిస్తాము. ఇటి సమస్య పరిష్కారం కొరకై తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో ఇంతకముందే మాట్లాడడం జరిగింది. త్వరలో ఈ సమస్యకు పరిష్కారం చూపుదామని కూడా మాట్లాడినారు. కావున సింగరేణి కార్మికులు ఎవరు కూడా ఆందోళన పడాల్సిన అవసరం లేదు, ఇది కేవలం కాంగ్రెస్ ప్రభుత్వం తోనే సాధ్యమవుతుంది అని చెప్పినారు. నా మీద ప్రేమ చూపి నన్ను గెలిపించిన మీకు ఖచ్చితంగా మీ సమస్య పరిష్కరిస్తాను. ఇది నా మాట, మీకు ఉద్యోగాలు తెప్పించే బాధ్యత నాది అని తెలియజేసినారు. అనంతరం మెమరండం సమర్పించిన వారు లక్క శ్రావణ్ గౌడ్, తిరుమల శ్రీనివాస్, రామిళ్ళ సందీప్, పున్నం వెంకటేష్, పర్తపల్లి హరీష్, ఇంజపెల్లి ఓం ప్రకాష్, సాయికిరణ్, ఈర్ల రాజయ్య, డిష్ బాబు మెమోరాండం ఇచ్చి వారి బాధను తెలియజేసుకున్నారు.

## ఉత్పత్తి మీద చూపెట్టే శ్రద్ధ కార్మికుల సమస్యల పరిష్కారం పై చూపెట్టండి.!

ఆర్ ఎఫ్ సి ఎల్ యాజమాన్యానికి ఏఐటీయూసీ డిమాండ్

ఆర్ ఎఫ్ సి ఎల్ కార్మిక సంఘాలకన్వీనర్ ఏఐటీయూసీ డిస్ట్రిక్ట్ జనరల్ సెక్రెటరీ కడారి సునీల్



రామగుండం మండలం రిపోర్టర్- తిరుపతి, (శుభోదయం న్యూస్)ఆర్ ఎఫ్ సి ఎల్ లో యూరియా ఉత్పత్తి ఉత్పాదకత మీద చూపెట్టే శ్రద్ధ కార్మికుల వేతన బోనస్ కార్మిక చట్టాలు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం పై ఆర్ ఎఫ్ సి ఎల్ యాజమాన్యం ప్రత్యేక శ్రద్ధ చూపెట్టాలని.ఏఐటీయూసీ డిస్ట్రిక్ట్ జనరల్ సెక్రెటరీ ఆర్ ఎఫ్ సి ఎల్ కార్మిక సంఘాల జేఏసీ కన్వీనర్ కడారి సునీల్ ఆర్.ఎఫ్.సి.ఎల్యాజమాన్యాని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికుల పరిస్థితి ఆర్ ఎఫ్ సి ఎల్ లో కరివేపాకు లాగా మారిందని వాడుకోవడం విడిచిపెట్టడం యూస్ అండ్ త్రో లాగా కార్మికుల బ్రతుకులు ఎలాంటి చట్టబద్ధ హక్కులకు నోచుకోకుండా వారి శ్రమ పరిశ్రమకు పెట్టుబడిగా మారుతుందని కార్మికుల శ్రమకు తగ్గ ఫలితం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు స్థానిక నిరుద్యోగ యువత నిరాశకు లోనవుతున్నారు అన్నారు. ఆర్ ఎఫ్ సి ఎల్ పరిశ్రమకు త్యాగం చేసిన పల్లెలు చిన్నబోయి చూస్తున్న అని అన్నారు. ఉద్యోగ అవకాశాలు లేక చట్టబద్ధ హక్కులు లేక మధ్య దళారీల వ్యవస్థ కొనసాగుతుందని అన్నారు. ట్రేడ్ యూనియన్లు కార్మికుల సమస్యలపై పోరాడాలని పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. స్థానిక శాసనసభ్యులు రాష్ట్ర ప్రభుత్వం ఆర్ ఎఫ్ సి ఎల్ పరిశ్రమపై ప్రత్యేక దృష్టి సారించి ప్రభుత్వ జీవోలు కార్మిక చట్టాలు,అమలు అయ్యే విధంగా చొరవ చూపెట్టాలని విజ్ఞప్తి చేశారు.ఆర్ ఎఫ్ సి ఎల్ కార్మికులు ఎదుర్కొంటున్న అనేక రకాల సమస్యల పరిష్కారం కై కార్మిక సంఘాల జాయింట్ సమావేశం ఏర్పాటు చేసి మళ్లీ ఉద్యమాలు ఉదృతం చేయడానికి రూపకల్పన జరుగుతుందని కడారి సునీల్ అన్నారు.

## ధర్మ రక్ష వ్యవస్థాపకులు చీకోటి ప్రవీణ్ ను కలిసిన ఎస్సిఆర్పిఎస్ జిల్లా అధ్యక్షులు భుషిపాక సంతోష్ మహారాజ్, ఉపాధ్యక్షులు గొర్రె రాజు

ధర్మాన్ని కాపాడండి. ధర్మ రక్షకులుగా పనిచేయండి

చికోటి ప్రవీణ్ ధర్మ రక్ష వ్యవస్థాపక అధ్యక్షులు



గోదావరిఖని టౌన్ రిపోర్టర్- సురేష్, (శుభోదయం న్యూస్) హైదరాబాద్ లో ధర్మ రక్షణ వ్యవస్థాపకులు చీకోటి ప్రవీణ్ గారిని జూబ్లీహిల్స్ లో గల సొంత నివాసంలో, ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు భూషిపాక సంతోష్ మహారాజ్ మర్యాదపూర్వకంగా కలిసి పెద్దపెల్లి జిల్లా లో, ధర్మ రక్షణ సంస్థను విస్తరింప చేయడం కోసం, మరియు జిల్లా నియోజకవర్గంలో ఉన్న ప్రజా సమస్యలు, స్థితిగతుల గురించి చర్చించడం జరిగింది.... అనంతరం చికోటి ప్రవీణ్ గారు మాట్లాడుతూ ధర్మ రక్షణ సంఘాన్ని పెద్దపెల్లి జిల్లాల్లో సంఘాన్ని బలోపేతం చేస్తూ హిందూ మతంపైన దాడి చేస్తు కించపరిచే విధంగా మాట్లాడుతున్న కుహన రాజకీయ నాయకులను బుద్ధి చెప్పాలని హిందువులంతా సంఘటితమై ఏకతాటిపైకి వచ్చి ధర్మాన్ని కాపాడాలని ప్రతి ఒక్క హిందూ మేల్కోవాలి, హిందూ ధర్మ సమాజ స్థాపన కోసం నిరంతరం పనిచేయాలని, మీకు ఎల్లవేళలా అన్నదండ నేను ఉంటానని,కోరారు ఆయన కోరారు ఈ కార్యక్రమంలో మీడియా ఇంచార్జ్ నర్సింగ్, తదితరులు ఉన్నారు.ధర్మాన్ని కాపాడండి ధర్మ రక్షకులుగా పనిచేయండి చికోటి ప్రవీణ్ ధర్మ రాక్ష వ్యవస్థాపక అధ్యక్షులు హైదరాబాద్ లో , ధర్మ రక్షణ వ్యవస్థాపకులు చీకోటి ప్రవీణ్ ని జూబ్లీహిల్స్ లో గల సొంత నివాసంలో, ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు భూషిపాక సంతోష్ మహారాజ్ మర్యాదపూర్వకంగా కలిసి పెద్దపెల్లి జిల్లా లో, ధర్మ రక్షణ సంస్థను విస్తరింప చేయడం కోసం, మరియు జిల్లా నియోజకవర్గంలో ఉన్న ప్రజా సమస్యలు, స్థితిగతుల గురించి చర్చించడం జరిగింది. అనంతరం చికోటి ప్రవీణ్ మాట్లాడుతూ ధర్మ రక్షణ సంఘాన్ని పెద్దపెల్లి జిల్లాల్లో సంఘాన్ని బలోపేతం చేస్తూ హిందూ మతంపైన దాడి చేస్తు కించపరిచే విధంగా మాట్లాడుతున్న కుహన రాజకీయ నాయకులను బుద్ధి చెప్పాలని హిందువులంతా సంఘటితమై ఏకతాటిపైకి వచ్చి ధర్మాన్ని కాపాడాలని ప్రతి ఒక్కమేల్కోవాలి,హిందూ ధర్మ సమాజ స్థాపన కోసం నిరంతరం పనిచేయాలని, మీకు ఎల్లవేళలా అన్నదండ నేను ఉంటానని కోరారు. ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో మీడియా ఇంచార్జ్ నర్సింగ్, తదితరులు ఉన్నారు.

## బొడ్డుపల్లి రంజిత్ కుమార్ భారతీయ జనతా పార్టీ 32 వ డివిజన్ ఇంచార్జ్ ఆధ్వర్యంలో విజయోత్సవాలు

# ఎన్నికలు ఏవైనా విజయం బిజెపిదే ..



గోదావరిఖని టౌన్ రిపోర్టర్- సురేష్,(శుభోదయం న్యూస్) గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలలో చిన్మైల్ అంజిరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో మల్కా కొమురయ్య భారతీయ జనతా పార్టీ ఘనవిజయం సాధించిన సందర్భంగా రామగుండం కార్పొరేషన్ 32వ డివిజన్ ఇన్చార్జి బొడ్డుపల్లి రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బొడ్డుపల్లి రంజిత్ కుమార్ మాట్లాడుతూ ఈ విజయం పార్టీపై ప్రజల విశ్వాసానికి నిదర్శనమని గెలుపొందిన అభ్యర్థుల నాయకత్వంలో పట్టభద్రుల ,ఉపాధ్యాయుల అభివృద్ధికి బిజెపి నిరంతరం కృషి చేస్తుందని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఆరు అబద్ధాలు 66 మోసాలతో గద్దనెక్కిన కాంగ్రెస్ కి ఇది చెంపపెట్టు లాంటి ఫలితం అదేవిధంగా జనాలని మోసం చేస్తూ సాట్ల తౌడు పోసి కుక్కల కొట్లాట పెడుతున్న కాంగ్రెస్ పార్టీకి రానున్న రోజులలో బుద్ధి చెప్తామని వారు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరై బాణసంచా కాల్చి మిఠాయిలు పంచుతూ విజయోత్సవాన్ని ప్రదర్శించారు మేధావి వర్గం ఇచ్చిన మద్దతుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ పార్టీ అభివృద్ధికి ప్రజా సంక్షేమమే తమ లక్ష్యమని రంజిత్ కుమార్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రామగుండం అసెంబ్లీ కన్వీనర్ కొండపర్తి సంజీవ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అదేవిధంగా పార్టీ నాయకులు కంచర్ల శ్రీకాంత్, బోడ్డుపల్లి భరత్, జంపాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ సర్వేక్షన్ -2025 పై ఇంటింటికి అవగాహన కార్యక్రమం

నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి

రామగుండం నగర పాలక సంస్థ, మెప్మా విభాగాల సిబ్బంది ఆధ్వర్యంలో



రామగుండం మండలం రిపోర్టర్- తిరుపతి, (శుభోదయం న్యూస్)స్వచ్ఛ సర్వేక్షణ్ 2025 లో రామగుండం నగరం మెరుగైన ర్యాంక్ సాధించేందుకు చెత్తను బయట వేయకుండా మున్సిపల్ వాహనాలకు అందించి సహకరించాలని నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ వెంకట స్వామి కోరారు. ఎన్ టి పి సి మేడి పల్లి చౌరస్తా తదితర ప్రాంతలలో శుక్రవారం స్వచ్ఛ సర్వేక్షణ్ 2025 పై ఇంటింటికీ అవగాహన కల్పించే కార్యక్రమాన్ని రామగుండం నగర పాలక సంస్థ , మెప్మా విభాగాల సిబ్బంది ఆద్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఇంటి వద్ద నే తడి చెత్త , పొడి చెత్త వేరు చేయాలని సూచించారు. హోమ్ కంపోస్టింగ్ విధానంలో తడి చెత్త నుండి ఎరువు తయారు చేసుకొని మొక్కల పోషణకు ఉపయోగించుకోవాలని సూచించారు. పొడి చెత్త ను మున్సిపల్ వాహనాలకు అందిస్తే డ్రై రీసోర్స్ సెంటర్ లేదా డంపింగ్ యార్డ్ కు తరలించడం జరుగుతుందని అన్నారు. ఈ సంధర్భంగా వాడ వాడలా స్వచ్ఛ భారత్ పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ నాగ భూషణం , వార్డు అధికారులు మహేందర్ , అభినవ్ , శ్యామ్ కుమార్ , అజయ్ కుమార్ , ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మధుకర్ , ఎం ఐ ఎస్ ఆపరేటర్ శ్రీకాంత్ , సూపర్ వైజర్ రాజా బాబు , మెప్మా ఆర్ పి లు పాల్గొన్నారు.

## మహిళా రిక్షా కార్మికులకు పని తో పాటు ఆరోగ్య భద్రత కూడా ఉండాలి

33 వ డివిజన్ లో జరిగిన ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ఖని మెడికల్ కాలేజ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శిరీష మహిళా రిక్షా కార్మికులను ఘనంగా సన్మానించిన మద్దెల దినేష్



గోదావరిఖని టౌన్ రిపోర్టర్- సురేష్, (శుభోదయం న్యూస్) మహిళా రిక్షా కార్మికులకు పని తో పాటు ఆరోగ్య భద్రత కూడా ఉండాలని ఖని మెడికల్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శిరిష అన్నారు . శుక్రవారం రామగుండం నగర పాలక సంస్థ పరిధిలోని 33 వ డివిజన్ లో జరిగిన ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రామగుండం నగర పాలక సంస్థ లో



ఇంటింటికి తిరుగుతూ చెత్తను సేకరించె మహిళ కార్మికులు పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్నారని వారి పాత్ర మరువలేనిదని అన్నారు. రిక్షా కార్మికులు నిరంతరం కష్టపడి పని చేస్తూ ఇంటింటికి చెత్త సేకరించి పారిశ్రామిక ప్రాంతాన్ని శుభ్రపరచడంలో ముందు వరుసలో ఉన్నారని ఆమె అన్నారు.కష్టపడి పని చేస్తున్న మహిళా రిక్షా కార్మికులు వారి కుటుంబాల కోసం ఆరోగ్యాలు కూడా కాపాడుకోవాలని ఆమె అన్నారు. మహిళా రిక్షా కార్మికులు ఆరోగ్యాంగా ఉంటేనే వారి కుటుంబం బాగుంటుందని, వారికి ఉద్యోగ భద్రత తో పాటు ఆరోగ్య భద్రత కూడా ఉండాలని , వారి సేవలు, చేసే కృషి మరువలేనిదని ఆమె అన్నారు.అనంతరం మద్దెల దినేష్ మాట్లాడుతూ నిరంతరం చెత్తా చెదారం, దుర్వాసన ల మధ్యే ఉంటారని ఐనా, మహిళా కార్మికులు అరకొర వేతనాలతో పనిచేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.ఒక వేళ వారు అనారోగ్యం పాలైతే ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం చేసుకునేంత స్తోమత వారికి లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇక నుంచి ఐన రిక్షా కార్మికులకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రయత్నం చేయాలన్నారు. భవిష్యత్తులో ఆరోగ్యపరంగా సమస్యలు ఏర్పడితే ఖర్చు లేకుండా వైద్య సేవలు ప్రభుత్వంఅందించాలన్నారు.ఏఐటియుసి కాంట్రాక్టు కార్మిక సంఘం అధ్యక్షులు ఎం.ఏ గౌస్ మాట్లాడుతూ రిక్షా కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అందించాల్సిన అవసరం ప్రభుత్వం పై ఉందని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం దాదాపు వంద మంది రిక్షా మహిళా కార్మికులకు శాలువా కప్పి సత్కరించి షీల్డ్ అందజేయడం జరిగిందన్నారు.ఇంకా డివిజన్ పెద్ద మనుషులు మేదరి శ్రీనివాస్, పెర్క శ్రీనివాస్, తాళ్ళపల్లి రవి, ఇందూరి రాజేశ్వర్ రావు, పొగాకు గోవర్ధన్, మానవ వికాస వేదిక, నాయకులు జూల మోహన్, ఎజ్జ రాజయ్య, రాజనర్సు, దప్పు రాజు, గంగారపు ప్రసాద్, అబ్బు, యాకుబ్, మరియు మహిళలు, పద్మ అనసూర్య, అరుణ, సౌజన్య, లలిత, వెంకటమ్మ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీలలో బకాయి పడిన వేతనాలను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు గొరిగె సోములు



శుభోదయం న్యూస్ ప్రతినిధి యాదాద్రి జిల్లా : రామన్నపేట తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ( సిఐటియు) రాష్ట్ర పిలుపులో భాగంగా ఈరోజు రామన్నపేట ఎంపీడీవో కార్యాలయం ముందు జరిగిన ధర్నా కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గొరిగె సోములు హాజరై మాట్లాడుతూ వివిధ పంచాయతీలలో బకాయి వేతనాలు మూడు నెలల నుండి ఏడు నెలల వరకు బకాయి పడ్డాయని రాష్ట్రంలో గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికులకు ప్రతి నెల ఒకటవ తారీఖున ప్రభుత్వ ఉద్యోగుల వలే వేతనాలు చెల్లిస్తామని చెప్పినప్పటికీ వేతనాలు చెల్లించడంలేదు,రాష్ట్ర ప్రభుత్వం బకాయి పడిన వేతనాలు వెంటనే చెల్లింపులు చేయాలని ప్రభుత్వమే నేరుగా గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లిస్తామని ప్రకటించినప్పటికీ అట్టి ప్రకటన అమల్లోకి రాలేదని తక్షణమే ప్రభుత్వం చొరవ తీసుకొని ప్రతి నెల వేతనాలు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని రాష్ట్రంలో మల్టీపర్పస్ వర్కర్ విధానం వల్ల పంచాయతీ సిబ్బందికి ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే కనీస వేతనాలు అమలు చేస్తామని మల్టీ పర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేస్తామని చెప్పినప్పటికీ ప్రభుత్వం అనేక పోరాటాల నిర్వహిస్తున్న దాటవేత ధోరణి అవలంబిస్తుందని రాష్ట్రంలోని అన్ని వర్గాలలో మార్పులు తీసుకొస్తానన్న ప్రభుత్వం గత ప్రభుత్వం కట్టు బానిసల్లా ఉండే జీవో నెంబర్ 51 మల్టీ పర్పస్ వర్కర్ విధానాన్ని తీసుకువచ్చి ఆదివారం సెలవులు పండుగ సెలవులు సమయపాలన ఇటువంటి అమలు కాకుండా దుర్భరమైన జీవితాలు గడుపుతున్న ఏ శాఖలో లేని విధానాలను ఈ శాఖలో తీసుకొని వచ్చి పంచాయతీ సిబ్బంది ని చాల ఇబ్బందుల పాలు చేస్తున్నారు.ఈ పంచాయతీ ఉద్యోగుల పట్ల ఈ ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదని రాబోయే బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఎస్సీ వర్గీకరణ ఏవిధంగానైతే అమలుకు తీర్మానం చేశారో రాష్ట్రంలో 90 శాతం దళితులు ఉన్న గ్రామపంచాయతీ ఉద్యోగుల పట్ల ఇబ్బందికరంగా ఉన్నటువంటి 51 జీవోను సవరించాలని మల్టీ పర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని స్వయంగా ముఖ్యమంత్రి గారె చొరవ చూపి చర్యలు చేపట్టాలని మల్టీ పర్పస్ వర్కర్ విధానం రద్దుకై అసెంబ్లీలో ప్రకటన చేయాలని పంచాయతీ సిబ్బందికి న్యాయం చేయాలి కనీస వేతనాలు 26,000 అమలు చేయాలి కారోబార్ బిల్ కలెక్టర్లకు ప్రత్యేక స్టేటస్ కల్పించాలి ఉద్యోగ భద్రత కల్పించాలి ఇన్సూరెన్స్ సౌకర్యం ప్రతి కార్మికుడి కుటుంబం వీధిన పడకుండా 15 లక్షలు అమలు చేయాలి అని కోరుతూ బకాయి పడిన వేతనాలు వెంటనే చెల్లించాలి,రాష్ట్రంలో ఎండల తీవ్రత బాగా పెరిగినందున ఒక్క పూట పనులకు సిబ్బందికి అవకాశాలు కల్పించాలని కోరడం జరిగినది ఈ కార్యక్రమంలో మండలఅధ్యక్షులు గాదె ఎల్లయ్య,మండల ప్రధాన కార్యదర్శి నకరేకంటి రాము,మండల కన్వీనర్ కడారి భాగ్య, మంచల రేణుక,కాడ యాదమ్మ,బూడిద మారయ్య,చిన్న లచ్చి స్వామి,బొడ్డు సాలయ్య, నకరికంటి యాదమ్మ, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



శుభోదయం న్యూస్ ప్రతినిధి యాదాద్రి జిల్లా : రామన్నపేట స్థానిక గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్,జాతీయ సేవా పథకం మరియు స్టాఫ్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా మహిళ అధ్యాపకులను,సిబ్బందిని ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఆచార్య రాహత్ ఖానం మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని,అనేక సవాళ్లను ఎదుర్కొని ధైర్యంగా నడవాలని పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ జహీదా బేగం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ తన జీవితంలో అనేక కష్టనష్టాలు ఎదురైనా ఈ స్థాయికి చేరుకోవడానికి తన తండ్రి ప్రోత్సాహం ఎంతో ఉందని పేర్కొన్నారు. తన తండ్రి కోరిక మేరకు గిన్నిస్ బుక్ రికార్డులో స్థానం సంపాదించానని పేర్కొన్నారు.ఇదే స్ఫూర్తిని విద్యార్థులు తీసుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ జి సునీత మాట్లాడుతూ మహిళలు నేడు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని,తమకు చేయూతనిస్తే ఇంకా బాగా పనిచేస్తామని పేర్కొన్నారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ స్త్రీలు ఎక్కడ పూజించబడతారో అక్కడ దేవతలు సంచరిస్తారని కావున మహిళలను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు.చరిత్ర అధ్యాపకులు డాక్టర్ కిషన్ తెలుగు ఉపన్యాసకులు, డాక్టర్ కృష్ణ కౌండిన్య, అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.కళాశాల ఎగ్జామినేషన్ కోఆర్డినేటర్ డాక్టర్ జే.చిన్నబాబు వందన సమర్పణ చేశారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ సిహెచ్ వెంకటేశ్వర్లు, డాక్టర్ ఎం రవీందర్ రావు , డాక్టర్ లక్ష్మీ నీలిమ,డాక్టర్ బ్రహ్మం,డాక్టర్ రాచమల్లు శ్రీను,శ్రీనివాసులు,నరేష్, యాదగిరి,ఆంజనేయులు అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# పల్లివాడ ప్రాథమికోన్నత పాఠశాలలో ఘనంగా స్వపరిపాలన దినోత్సవం!!



శుభోదయం ప్రతినిధి యాదాద్రి జిల్లా రామన్నపేట మండలం పల్లివాడ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్ర వారం రోజు విద్యార్థులే ఉపాధ్యాయులయ్యి,ఎం ఎల్ ఏ,కలెక్టర్, ఎంపీడీవో, డీ ఈ ఓ, ఎంఈఓ,టీచర్లుగా మారి ఒకరోజు స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు.ఈ సందర్భంగా విద్యార్థులు తమ తమ పాలన దక్షతలను చాటి అబ్బురపరిచారు.కలెక్టరుగా అక్షిత, ఎమ్మెల్యే గా చరణ్, ప్రధానోపాధ్యాయులుగా సీతు, డీఈవో గా శివమణి సమస్యలపై చర్చించి తోటి టీచర్లకు సూచనలందించారు. అనంతరం ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం జరిగింది. అనంతరం జరిగిన సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధారాణి మాట్లాడుతూ ఈ దేశ భవిష్యత్తు నిర్మించడంలో నేటి విద్యార్థులు రేపటి పౌరులు కాబట్టి మీరందరూ జన్మ భూమికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులను కోరారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఘాసీరాం, రఘురాంరెడ్డి,పాల్వంచ హరికిషన్,జయశ్రీ, నిర్మలదేవి, కృష్ణయ్య, భూపాల్,లలిత, మధుబాబు,విద్యా వాలంటీర్లు,పాఠశాల సిబ్బంది విద్యారులు తదితరులు పాల్గొన్నారు. తదుపరి ఈ రోజు రామన్నపేట ఎంపీడీవో యాకూబ్ నాయక్ పల్లివాడ పాఠశాలను సందర్శించి వంట ఏజెన్సీలందించే మధ్యాహ్న భోజనం పథకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసి అనంతరం స్వపరి పాలన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థి విద్యార్థులను అభినందించారు.వీరివెంట ఎంపీ ఓ రవూఫ్ అలీ,ఏపీఓ వెంకన్న,కార్యదర్శి శిరీష ఉన్నారు.

# సిబిఐటిలో ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం



హైదరాబాద్, శుభోదయం న్యూస్ : చైతన్య భారతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కి చెందిన ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ మరియు ఎన్ ఎస్ ఎస్ ఆధ్వర్యయం లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ వేడుకలో డాక్టర్ తేజస్విని మనోజ్ఞ (ఎమ్ డి పీడియాట్రిక్స్, మిస్ ఎర్త్ 2019, పి ఎమ్ మెడల్ అవార్డు గ్రహీత, భారతదేశపు ఉత్తమ క్యాడెట్ మరియు భరతనాట్య కళాకారిణి) సమానత్వం, మహిళా సాధికారత మరియు నాయకత్వంపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. ప్రపంచంలోని అన్ని రంగాల్లో మహిళలు తమవంతు సహకారం అందిస్తున్నారని ఆమె అన్నారు. వైద్యులు పగలు, రాత్రి అని తేడా లేకుండా పనిచేస్తున్నారు. పోలీసులు, ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు తమ రంగాల్లో హద్దులు పెంచుతున్నారు. వీధి వ్యాపారులు తమ పిల్లలకు మెరుగైన జీవితాన్ని అందించడానికి ప్రతి పైసాను పొదుపు చేస్తారు. గృహిణులు తమ కుటుంబాల శ్రేయస్సు కోసం తమను తాము అంకితం చేసుకుంటారు, ఎల్లప్పుడూ తమ ప్రియమైన వారిని మొదటి స్థానంలో ఉంచడటానికి తమ శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారు. విద్యార్థులు తమ కలలను సాకారం



చేసుకునేందుకు కృషి చేస్తూ మహిళలు దేనికైనా సిద్ధమని నిరూపించారు.డబ్ల్యూ డి సి , సి బి ఐ టి కన్వీనర్ డాక్టర్ పి కౌస్తుభ ప్రసంగిస్తూ నేటి కాలంలో ప్రతి మహిళ తనను తాను బహుముఖ ప్రజ్ఞాశాలిగా మలచుకోవాలిసిన అవసరం ఎంతో ఉందని దానికి డాక్టర్ తేజస్విని మనోజ్ఞ మార్గదర్శకంగా నిలిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక ప్రదర్శనలు, అత్యుత్తమ మహిళా సాధకులను గుర్తించే సన్మాన కార్యక్రమం మరియు మహిళల హక్కులు మరియు అవకాశాల గురించి అవగాహన పెంపొందించే ఇంటరాక్టివ్ సెషన్‌లు జరిగియి. సీనియర్ ఫ్యాకల్టీ సభ్యుల మార్గదర్శకత్వంలో ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ మరియుఎన్ ఎస్ ఎస్ ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేసింది.ఈ సందర్భంగా చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె. కృష్ణవేణి మాట్లాడుతూ, విద్య మరియు వృత్తిపరమైన రంగాలలో మహిళలకు సమగ్రమైన మరియు సాధికారత కలిగించే వాతావరణాన్ని పెంపొందించడం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు.

# బిహెచ్ఈఎల్ ఫ్లైఓవర్ బ్రిడ్జును సందర్శించిన మెదక్ ఎంపీ రఘునందన్ రావు



పటాన్చెరు : (శుభోదయం న్యూస్)పటాన్చెరువు నియోజకవర్గం రామచంద్రాపురం బిహెచ్ఇఎల్ చెక్ పోస్ట్ వద్ద కేంద్ర ప్రభుత్వం నిర్మిస్తున్నటువంటి బ్రిడ్జ్ను మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు సందర్శించడం జరిగింది. ఈ యొక్క బ్రిడ్జిను అతి తొందరలో కేంద్ర మంత్రివర్యులు ఘట్కరి గారితో ఓపెనింగ్ చేయడం జరుగుతున్నందున రఘునందన్ రావు ఈ ఫ్లై ఓవర్ బ్రిజు పనులను ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించారు అదేవిధంగా ఉన్నత అధికారులతో చర్చించి ఈ యొక్క సర్కిల్ను చాలా సుందరకంగా తీర్చిదిద్దాలని ఉన్నత



అధికారులకు ఆదేశించడం జరిగింది. అంతేగాకుండా మరి ముఖ్యంగా అమీన్పూర్ మున్సిపాలిటీకి వెళ్లే రోడ్డును చాలా పెద్దగా చేసి ఇక్కడ కమాన్ నిర్మించలని మున్సిపల్ అధికారులను జిహెచ్ఎంసి అధికారులను కోరడం జరిగింది.ఉన్నత అధికారులందరూ అతి తొందరలో అమీన్పూర్ మున్సిపాలిటీ ముఖద్వారం ఏర్పాటు చేసి ఈ యొక్క రోడ్డును బిహెచ్ఎల్ చౌరస్తా వాగు పక్క నుండి శ్రీదేవి టాకీస్ వరకు కలపాలని ఉన్నతాధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షురాలు చిన్న మైల్ గోదావరి, అమీన్పూర్ బిజెపి మండల అధ్యక్షులు ఈర్ల రాజు ముదిరాజ్, రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు పటాన్చెరువు నియోజకవర్గ బిజెపి మండల అధ్యక్షులు మున్సిపల్ అధ్యక్షులు డివిజన్ అధ్యక్షులు నాయకులు పాల్గొన్నారు.

# పటాన్చెరు పట్టణంలో వృద్ధురాలికి అంత్యక్రియలు నిర్వహించిన ఎండిఆర్ ఫౌండేషన్.

## ఆర్థిక సహకారం అందించిన పృధ్వి రాజు



పటాన్చెరు : (శుభోదయం న్యూస్)సంగారెడ్డి జిల్లా పటాన్చెరువు పట్టణం ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంప్ సమీపంలో బుధవారం రాత్రి ఒక వృద్ధురాలు కింద పడి ఉండటం చూసి గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మరియు 108 సిబ్బంది వచ్చి పరిశీలించగా వృద్ధురాలు చనిపోయిందని చెప్పి చెప్పడంతో ఎండిఆర్ ఫౌండేషన్ సభ్యుల సహకారంతో వృద్ధురాలని అంబులెన్స్ లో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి గురువారం వృద్ధురాలికి సంబంధించి కొడుకు వున్నా కూడా ఎటువంటి ఆర్థిక స్తోమత లేకపోవడంతో బిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నాడు అని తెలుపడంతో, ఎండిఆర్ ఫౌండేషన్ అన్నీ తామై అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియలకు ఫౌండేషన్ కో-ఫౌండర్ పృథ్వీరాజ్ ఆర్థిక సహాయం అందించారు.

# కానుకుంట మల్లన్న దేవాలయం వద్ద సిజిఆర్ ట్రస్ట్ ద్వారా నీటి బోరు ఏర్పాటు

## బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ ఛిమ్ముల గోవర్ధన్ రెడ్డి



గుమ్మడిదల : (శుభోదయం న్యూస్) గుమ్మడిదల మండలం కానుకుంట గ్రామ పరిధిలోని మల్లన్న దేవాలయం వద్ద భక్తులకు, గ్రామస్తులకు నీటి సౌకర్యం కల్పించేందుకు సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి తన స్వంత నిధులతో నీటి బోరు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, "ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో తమ ట్రస్ట్ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు



నిర్వహిస్తున్నామని అన్నారు. భవిష్యత్తులో కూడా మరిన్ని అభివృద్ధి పనులు చేపడతాం అని తెలిపారు. అనంతరం గ్రామ పెద్దలు, భక్తులు, ప్రజాప్రతినిధులు, సిజిఆర్ ట్రస్ట్ చేస్తున్న సేవా కార్యక్రమాలను ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కుమార్ గౌడ్ మాజీ సర్పంచ్ లు నరసింహ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, రాజశేఖర్, వేణు, నాయకులు నక్క వెంకటేష్ గౌడ్ తుపాకుల రాజు, నరహరి, మొగులయ్య శ్రీనివాసరెడ్డి, బాల్ రెడ్డి గోపాల్, రమేష్,చంద్రారెడ్డి,వెంకటేష్, కాంతారావు,మురళీ, భార్గవ్, యాదయ్య,సిజిఆర్ ట్రస్టు సభ్యులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

# పోచమ్మ దేవాలయానికి విరాళం అందజేసిన చిమ్ముల గోవర్ధన్ రెడ్డి





గుమ్మడిదల : (శుభోదయం న్యూస్)సంగారెడ్డి జిల్లా, హత్నూర మండలంలోని నాగారం గ్రామంలో నిర్మాణంలో ఉన్న పోచమ్మ నూతన దేవాలయానికి ఒక్క లక్ష ఒక్క వెయ్యి ఒక్క వంద 16 రూపాయలు వీరాళం అందజేసిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి. అనంతరం దేవాలయం కమిటీ సభ్యులు గోవర్ధన్ రెడ్డిని శాలువతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ పోచమ్మ తల్లి కృపతో జిల్లా ప్రజలు ఆనందంగా ఉండాలని అన్నారు. దేవాలయాల అభివృద్ధికి ఎల్లప్పుడూ తన వంతు సహకారం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ప్రతి వారం నా తల్లి ఆశీస్సులతో అన్నదానం చేసి ఎంతో మంది గర్భిణీ స్త్రీల ఆకలి తీర్చండం నా పూర్వ జన్మ పుణ్యం

## లేపాక్షి ఆలయ చైర్మన్ కరణం శ్రీ రమానందన్..





లేపాక్షి మండల రిపోర్టర్ అమరేష్ (శుభోదయం న్యూస్ ) : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి వారం జరిగే పరీక్షలకు విచ్చేసిన గర్భిణీ మహిళలకు శ్రీమతి కీ,, శే,, రమామణి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో,ట్రస్ట్ అధినేత, సమాజ సేవకులు,లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్ కరణం శ్రీ రమానందన్ ఈ రోజు (07-03-25) దాదాపు 84 మంది మహిళలకు ఉచితంగా పౌష్టికాహారంఅందజేసేకార్యక్రమం ప్రతి వారం లాగే యథా విధిగానిర్వహించడంజరిగింది.కరణం శ్రీరమానందన్ వారితల్లిపేరు మీదమాతృమూర్థులకు(గర్భిణి లకు )భోజనం ఉచితంగాఅందజేయడంనాఅదృష్టం అని అయన సంతోషం వ్యక్తంచేశారు..ఈకార్యక్రమంలో ఆరోగ్య కేంద్ర డాక్టర్లు, వైద్య సిబ్బంది, గర్భిణీ మహిళలు, చైర్మన్ రమానందన్మిత్రమండలి పాల్గొన్నారు.

# అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమంలో భాగంగా......

# ఏలూరులో రెండవ కే. మారథాన్ ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్, కె వ్యక్తి సెల్వ



ఏలూరు జిల్లా,(శుభోదయం న్యూస్), జిల్లా ప్రతినిధి ఎన్ చిట్టిబాబు అంతర్జాతీయ మహిళా దినోత్సవం-2025. కార్యక్రమంలో భాగంగా ఏలూరులో నిర్వహించిన రెండవ. కే. మారథాన్ ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్, కె వ్యక్తి సెల్వ. ఏలూరు జిల్లా అల్లూరి సీతారామరాజు స్టేడియం నుంచి పాత బస్టాండ్ వరకు నిర్వహించ, కె.మారథాన్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్. కె. వెత్రి సెల్వ, జాయింట్ కలెక్టర్ పి దాత్రి రెడ్డి. డి.ఎస్.పి శ్రావణ్ కుమార్. కార్యక్రమంలో పాల్గొన్న వివిధ శాఖల మహిళా అధికారులు.. ఉద్యోగులు మహిళలు, బాలికలు. కలెక్టర్ వెత్రి సెల్వ కామెంట్స్ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వారం రోజులుగా వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగానే ఈరోజు రెండవ మారథాన్ నిర్వహిస్తున్నాం. అందరికీ హక్కులు సమానత్వం మహిళా సాధికారత పై చైతన్య పరచడం ధ్యేయంగా ముందుకు సాగుతున్నాం. మహిళా అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి.

# ఆర్థిక స్వావలంబనలో మహిళల ముందడుగు - నేడు మహిళా దినోత్సవం సందర్భంగా



రెంటచింతల, మండల రిపోర్టర్ - శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్ ) : నేడు మహిళలు అనేక రంగాల్లో అడుగుపెట్టి అభివృద్ధిలో, దేశ ప్రగతిలో భాగస్వాములవుతున్నారు. నాటి కాలంలో కాకతీయ చరిత్రను ఇరుముడింపజేసిన రుద్రమదేవి శౌర్యానికి ప్రతీకగా నిలిస్తే, రామాయణాన్ని తెలుగులో వ్రాసి మొల్ల, మధురా విజయం వ్రాసి గంగాదేవి, సుభద్ర కల్యాణం వ్రాసి తాళ్లపాక తిమ్మక్క, వెంకటాచల మహత్యం రాసిన తరిగొండ వెంగమాంబ వంటి మహిళామణులు ఎందరో సాహిత్య జగత్తులో విరాజిల్లారు. ప్రస్తుతం మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో దూసుకెళు ్తున్నారు. సాగు నుంచి పైలెట్ వరకు.. వంటింటి నుంచి సమాజ సేవ వరకు రాణించటమే కాకుండా ఇల్లూ, పిల్లలు, ఉద్యోగం ఇలా ఎన్నో బాధ్యతలను నేర్పుగా,



ఓర్పుగా నెరవేరుస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. దైనందిన వృత్తి జీవితాన్ని సమన్వయం చేసుకుంటూ సమర్థంగా పలువురు మహిళలు ముందుకెళుతున్నారు. పెరుగుతున్న నిత్యావసర ధరలు, చాలీచాలని ఆదాయంతో కుటుంబాన్ని ముందుకు నడిపించడం సామాన్య, మధ్యతరగతి ప్రజలకు తలకు మించిన భారంగా మారుతోంది. ఇంటి భారాన్ని భర్తలపైనే మోపకుండా తమ వంతు సహకారాన్ని అందిస్తున్నారు గృహిణిలు. శిక్షణ తీసుకుని స్వయం ఉపాధిలో రాణిస్తూ కుటుంబాలకు చేదుడుగా నిలుస్తున్నారు. వ్యవసాయం చేస్తున్న భర్త ఆదాయం అంతంత మాత్రంగా ఉండడంతో వ్యాపారం చేయాలని ఆలోచించి స్వయం సహాయక సంఘం ద్వారా బ్యాంకులో రుణం తీసుకుని వస్త్ర వ్యాపారిగా ఇంటిపట్టునే ఉండి మరి కొందరు ఉపాధి పొందుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. టైలర్ గా 14 సంవత్సరాలుగా పనిచేస్తున్న రెంటచింతలకు చెందిన కుందూరు రాణి సొంతంగా టైలరింగ్ షాపు నిర్వహిస్తూ ముగ్గురు సహాయకులకు ఉపాధినిస్తూ నెలకు రూ. 30,000 ఆదాయం గడిస్తోంది. అలాగే చిలకలూరిపేట మండలం పసుమర్రు గ్రామానికి చెందిన కొత్త మమత డిగ్రీ అర్హత గల 2018 బ్యాచ్ పోలీస్ ఉద్యోగి. ఆమె ప్రస్తుతం రెంటచింతల పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్ గా విధులు నిర్వర్తిస్తూ ఉద్యోగంలో రాణిస్తున్నారు.ఇలా గృహిణిలుగా బాధ్యతలు నిర్వహిస్తూ ప్రైవేట్, ప్రభుత్వ ఉద్యోగ రంగాల్లో దూసుకెళ్తూ తమ టాలెంట్ నిరూపించుకుంటున్నారు. ఆర్థిక స్వావలంబన సాధిస్తూ తమ సామర్థ్యంతో ముందుకెళుతున్న మహిళలను సమాజం గౌరవించాలి. ఇదే మహిళా దినోత్సవ ప్రధాన ఉద్దేశ్యం కూడా.

## భూలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద భారీ అన్న సమారాధన



శుభోదయం న్యూస్ : జీలుగుమిల్లిమండలంలోని దర్భగూడెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ భూలక్ష్మి అమ్మవారి 50వ వార్షికోత్సవ ఉత్సవాలు ఎంతో ఘనంగా ముగిసాయి. చివరి రోజు అయిన శుక్రవారం అమ్మవారి ఆలయం వద్ద అన్న సమారాధన ఘనంగా జరిగింది. అంతకు ముందు అమ్మవారికి అర్చకులు జటావల్లబుల త్రినాధ్ మూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక కుంకుమ పూజలు, లక్ష్మీ హోమం జరిగింది. అనంతరం ఆలయం వద్ద బొల్లారెడ్డి సత్తిరెడ్డి జ్ఞాపకార్ధం వారి కుమారుడు సునీల్ రెడ్డి ద్రవ్య సహాయంతో భారీ అన్న సమాధానం కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్న సమారాధనకు చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కేతిరెడ్డి రాఘవరెడ్డి, సురేష్ రెడ్డి, పర్రెడ్డి రామకృష్ణారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అబ్దుల్ కలాం ఫౌండేషన్ కర్లపాలెం ద్వారా ప్రతి శుక్రవారం సేవలు



శుభోదయం న్యూస్, బాపట్ల జిల్లా:శుభోదయం న్యూస్ : అబ్దుల్ కలాం ఫౌండేషన్ కర్లపాలెం ద్వారా ప్రతి శుక్రవారం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఫౌండేషన్ ప్రెసిడెంట్ ,గ్రామ ఉప సర్పంచ్ పఠాన్ అహ్మద్ బాష తెలిపారు.కర్లపాలెం అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కర్లపాలెం దండుబాటలోని 10 మంది నిరుపేద మహిళలకు చీరెల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పఠాన్ అహ్మద్ బాష మాట్లాడుతూ పేదలకు ప్రతి శుక్రవారం బియ్యం ,నిత్యావసర సరుకులు ,దుప్పట్లు ,అనారోగ్యంగాఉన్న వారికి ఆర్థిక చేయూత అందించడం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్ బాజి ( ఆర్మీ రిటైర్డ్ ) ,సంపటి శ్రీనివాసరెడ్డి, బహదూర్ బాష,షేక్ ఇబ్రహీం,షేక్ జానీ బాష ,షేక్ మౌలాలి తదితరులు పాల్గొన్నారు,

## చీరాల రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో మహిళలకు అవగాహన సదస్సు





బాపట్ల జిల్లా: శుభోదయం న్యూస్ :చీరాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల సందర్భంగా, చీరాల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సిఇసి ఇంజనీరింగ్ కాలేజ్ క్యాంపస్ లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాం. ఈ కార్యక్రమంలో చీరాల డీస్పీ , ఎండి,మోయిన్, చీరాల రూరల్ సిఐ శేషగిరిరావు , ట్రైనింగ్ డిఎస్పీ, ఎస్ఐ, చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు చీరాల ఇంజనీరింగ్ కళాశాల గర్ల్స్ స్టూడెంట్స్ కు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా, భారతదేశ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖ గుప్తా, భారతదేశ ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ వంటి మహిళలు అత్యున్నత స్థాయిలో కొనసాగుతున్నారని ప్రస్తావించాము. అన్ని రంగాల్లో మహిళలు ముందంజలో ఉన్నారని, వారిని స్ఫూర్తిగా తీసుకుని విద్యలో రాణించి, మంచి ఉద్యోగాలు సాధించి, ఉన్నత స్థానాలకు చేరుకోవాలని విద్యార్థులను ప్రోత్సహించారు అలాగే, తాత్కాలిక ఆనందం కోసం చెడుదారిలో నడవకూడదని, విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని సూచించాం. మహిళల రక్షణ కోసం పోలీస్ శాఖ ప్రత్యేకంగా ఉమెన్ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసిందని, మహిళలపై జరిగే నేరాలకు తక్షణ స్పందన కోసం ఆ సేవలను వినియోగించుకోవాలని అవగాహన కల్పించారు కార్యక్రమం ముగింపులో, విద్యార్థినుల్లో స్ఫూర్తిని నింపేందుకు "విజిల్" సినిమా ప్రదర్శించారు,

## ప్రధానమంత్రి భారతీయ జన ఔషధ కేంద్రాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ వెంకట మురళి





శుభోదయం న్యూస్, బాపట్ల జిల్లా: బాపట్ల,విద్యానగర్ 3వ వార్డు లో ప్రధాన మంత్రి భారతీయ జన ఔషధ కేంద్రాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి, ఈ కార్యక్రమంలో పాల్గొన్న బాపట్ల పట్టణ బుడ చైర్మన్ సలగల రాజశేఖర్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు,

## ఈరోజు ఉమ్మడి అనంతపురం జిల్లా యాదవ సంఘం నాయకుల సమావేశం..



ఉమ్మడి,అనంతపురం జిల్లా బ్యూరో "నరేంద్ర "(శుభోదయం న్యూస్ ) :- అనంతపురం జిల్లా లోని ఈరోజు అనంతపురం రామ్ నగర్ లోని నక్కా రామయ్య యాదవ్ భవన్ నందు యాదవ సంఘం నాయకులు సమావేశం అయ్యి ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లో ఖాళీ అయిన ఎమ్మెల్యే కోటా కింద 5 ఎమ్ ఎల్ సి స్థానాలలో ఉమ్మడి అనంతపురం జిల్లా లోని యాదవులకు ఒక ఎమ్ ఎల్ సి అభ్యర్థి గా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎంపిక చెస్తే రాయలసీమ వ్యాప్తంగా కూడా యాదవులకు సముచిత స్థానం కల్పించిన వారు అవుతారు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో రామకృష్ణ యాదవ్, వరప్రసాద్ యాదవ్, నచ్చు బాలకృష్ణ యాదవ్, నాగ భూషణం యాదవ్, వీరాంజనేయులు యాదవ్, చక్రదర్ యాదవ్, సదాశివప్ప యాదవ్, శ్రీరాములు యాదవ్, మహేష్ యాదవ్, ఉమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా డిఎస్ఓ ని సన్మానించిన భాజపా నాయకులు జయరాం...



ఉమ్మడి,అనంతపురం జిల్లా బ్యూరో "నరేంద్ర" (శుభోదయం న్యూస్):-ఈరోజు ప్రపంచ ప్రసిద్ధి చెందిన తిమ్మమ్మ మర్రిమాను మహా వృక్షాన్ని మరియు అక్కడ కొలువు దీరిన శ్రీ తిమ్మమాంబ,బాల వీరయ్య స్వామి వారి ప్రత్యేక దర్శన నిమిత్తం విచ్చేసిన శ్రీ సత్య సాయి జిల్లా పౌర సరాపర జిల్లా అధికారి "డి ఎస్ ఓ " శ్రీ వంశీ కృష్ణ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకోవడం జరిగింది.వీరికి భారతీయ జనతా పార్టీ శ్రీ సత్య సాయి జిల్లా సమాచార చట్ట హక్కు కన్వీనర్ జయరాములు మర్యాద పూర్వకంగా కలిసి శాలువ తో సన్మానించడం జరిగింది.అదే విధంగా స్థానిక సర్పంచ్ శ్రీ విష్ణు మూర్తి , ఆలయ కమిటీ సభ్యులు వెంకట నారాయణ ,డీలర్ లక్ష్మీనారాయణ రెడ్డి ,తీర్థ ప్రసాదాలు అందజేశారు.గైడు మనోహర్ అమ్మ వారి చరిత్రను వివరించారు...

## పలు పార్టీల్లో బీసీలకు ప్రాధాన్యత ఇవ్వకపోతే పార్టీలకు మనుగుడ ఉండదు



శుభోదయం న్యూస్, బాపట్ల జిల్లా: బీసీ బడుగు బలహీన వర్గాల సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఉప్పాల మురళి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పలు పార్టీల్లో పార్టీలకు జండాలు మోయటమే గాని బీసీలకు తగిన ప్రాధాన్యత కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు, రాబోయే రోజుల్లో ఇదేవిధంగా ఉంటే ఏ పార్టీ అయితే బీసీలను చిన్న చూపు చూస్తుందో ఆ పార్టీలకు మనుగడ ఉండదని ఈ సందర్భంగా తెలియజేశారు, ఈ కార్యక్రమంలో బీసీ బడుగు బలహీన వర్గాల సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు,

## రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి డిపాజిటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎవేర్నెస్ ఫండ్ ఆర్థిక సహాయం తో అవార్డు స్వచ్ఛంద సంస్థ వారి ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత అవగాహనా కార్యక్రమం జరిగింది.




సింగరాయకొండ, మండల రిపోర్టర్ - పసుమర్తి జాలయ్య (శుభోదయం న్యూస్ ):-ఈ కార్యక్రమం లో స్టేట్ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ గారైన శివరామకృష్ణ, ఎంపీడీఓ శ్రీ జయమణి , ఏఎస్ఐ సీనా రెడ్డి , మండల సమైక్య అధ్యక్షురాలు శ్రీ రసూల్ బి , ఐసిడిఎస్ సూపర్వైజర్ రిజ్వాన ,బీసీ కిషోర్ , స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్ సుధాకర్ , ఎఫ్ ఎల్ సి కౌన్స్ లర్ డి . సూర్య ప్రకాష్ , అవార్డు సంస్థ డైరెక్టర్ శ్రీ రమణయ్య ముఖ్య అతిధులుగా పాలొగొన్నారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఇంత మంచి కార్యక్రమాన్ని నిర్వహించినందుకు రిజర్వ్ బ్యాంకు వారికి అవార్డు సంస్థ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు ఫీల్డ్ ఆఫీసర్ శివరామకృష్ణ మాట్లాడుతూ బ్యాంకు ఖాతాలో లావాదేవీలు సక్రమంగా జరపాలని నామినేషన్ కచ్చితంగా చేయించుకోవాలని చెప్పారు. ఏ ఎస్ ఐ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని వివరించారు మండల సమైక్య అధ్యక్షురాలు మాట్లాడుతూ పొదుపు గ్రూపు మహిళలందరూ కచ్చితంగా సామాజిక భద్రత పథకాలలో చేరాలని కోరారు ఎఫ్ ఎల్ సి కౌన్సిలర్ సూర్య ప్రకాష్ బ్యాంకు ఖాతా రకాలు వివిధ రకాల రుణాలు గురించి వివరించారు అవార్డు డైరెక్టర్ మాట్లాడుతూ తీసుకున్న డ్వాక్రా రుణాలు మరియు పంట రుణాలు గాను సకాలంలో చెల్లించి వడ్డీ రాయితీ పొందాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో బ్యాంకు లో జరిపే నగదు రహిత లావాదేవీలు గురించి వీడియో క్లిపింగ్స్, కళాకారులు పాటలు పాడటం జరిగింది. ఈ కార్యక్రమం లో అవార్డు సంస్థ ప్రతినిధులు కె . జాషువా, ర్ మదన్, బి . పిటర్, వై . నాగమణి మ్ అశోక్, స్వాంతన సంస్థ డైరెక్టర్ ర్ జె కుమార్ గ్రామ రైతులు, గ్రూప్ మహిళలు పాల్గొన్నారు.



## స్థలం వివాదం ఘర్షణలో ఇద్దరిపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టారు ఒకరు మృతి.



దోర్నాల మండల రిపోర్టర్- ఆవులయ్య (శుభోదయం న్యూస్ ):ప్రకాశం జిల్లా పెద్ద దోర్నాల మండలం తూర్పు బొమ్మలాపురం గ్రామంలో సుమారు రెండు సంవత్సరముల నుండి స్థలం వివాదము జరుగుతున్నది. స్థలం వివాదం తీవ్రంగా మారింది .దారుణంగా సంఘటన చోటు చేసుకుంది. ధాయాధుల మధ్య వచ్చిన గొడవలో నాగుర్ వలి సైదాబిలపై ఒక వ్యక్తి పెట్రోలు పోసి ఇద్దరిపై నిప్పు పెట్టిన విషయము కలకం సృష్టించింది. ఈ దాడి లో గాయపడిన నాగూర్ వలి సైదాబీలను హుటా హుటినా పెద్ద దోర్నాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. నాగూర్ వలి పరిస్థితి విషమించడంతో మార్కాపురం ఏరియా వైద్యశాలకు తరలించారు. నాగూర్ వలి మార్కాపురం ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. సైదాబీ మార్కాపురం ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. దోర్నాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

## దగ్ధమైన ఆయిల్ ఫామ్ తోటను పరిశీలించిన - ఎమ్మెల్యే



శుభోదయం న్యూస్ : జీలుగుమిల్లి మండలంలోని పాకలగూడెం లో సరియం ముత్యాలరావు అనే రైతు సుమారు 5 ఎకరాలు ఆయిల్ ఫామ్ తోట దగ్ధమైంది. విషయం తెలుసుకున్న పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సంఘటన స్థలానికి వెళ్ళి ఆయిల్ ఫామ్ తోటను పరిశీలించి ఆ రైతును పరామర్శించారు. ఎవరు అధైర్య పడొద్దు కూటమి ప్రభుత్వం ప్రజలకు ఎప్పుడు అండగానే ఉంటుందని ఆ రైతుకు ఎమ్మెల్యే ధైర్యం చెప్పారు. ఎవరికి ఏ ఆపద వచ్చినా తక్షణమే ఎమ్మెల్యే సమస్యను పరిష్కార దిశగా తీసుకెళ్తున్నారని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## ఇంటి పన్ను, నీటి పన్నులు వసూలు చేయకపోతే డ్వాక్రా గ్రూప్ ఆర్పీలను తొలగిస్తామనే పద్ధతిలో మున్సిపల్ కమిషనర్ మాట్లాడడం సరైంది కాదు సిపిఎం పట్టణ కార్యదర్శి జి.ఎల్ నరసింహులు




ఉమ్మడి,అనంతపురం జిల్లా బ్యూరో "నరేంద్ర "(శుభోదయం న్యూస్) :- సత్యసాయి జిల్లా కదిరి పట్టణంలోని డ్వాక్రా గ్రూపులకు సంబంధించిన పనులు నిర్వహించే రిసోర్స్ పర్సన్ " ఆర్.పి" లకు ఇంటి పన్నులు, నీటి పన్నులు వసూలు చేయాలని లేకపోతే విధుల నుంచి తొలగిస్తానని బెదిరించే పద్ధతిలో మాట్లాడడం మంచిది కాదన్నారు. పన్నులు వసూలు చేయడానికి ప్రత్యేక విభాగం ఉందనే విషయాన్ని కమిషనర్ మర్చిపోయినట్టున్నారు. డ్వాక్రా సంఘాలలో పొదుపు చేసుకున్న పేద కుటుంబాల నుండి పన్నులు వసూలు చేయడంలో ఉన్న శ్రద్ధ మున్సిపాలిటీ ఆదాయానికి గండి కొడుతున్న వారిని నిలువరించడంలో చూపాలని సూచించారు. ఒకవైపు ఆర్పీలు రాజకీయ వేధింపులతో ఇంకోవైపు అధికారుల వేధింపులతో సతమతమవుతున్నారని తెలిపారు. పన్నులు వసూలు చేసే పని "ఆర్.పి "లకు సంబంధం లేని పని అన్నారు. డ్వాక్రా సంఘాల మహిళలు పిల్లల ఫీజులు చెల్లించడానికి పొదుపు చేసుకున్న తమ డబ్బులను తీసుకోవడానికి కూడా కమిషనర్ సంతకాలు పెట్టకుండా డ్వాక్రా గ్రూప్ మహిళలను మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారన్నారు. కమిషనర్ ఆర్పీలను పన్నులు వసూలు చేయాలని వేధించడం ఆపాలని, డ్వాక్రా సంఘాలలో మహిళలు పొదుపు చేసుకున్న వాళ్ళ డబ్బును తీసుకోవడానికి సంతకాలు పెట్టకుండా వేధిస్తే "డ్వాక్రా మహిళలతో కలిసి" ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

## ఏపీజీబీ బ్యాంకులో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



సింగరాయకొండ, మండల రిపోర్టర్ - పసుమర్తి జాలయ్య (శుభోదయం న్యూస్):-ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు సింగరాయకొండ బ్రాంచ్ ,హెడ్ ఆఫీస్ ఆదేశాలమేరకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం ని బ్రాంచ్ నందు జరిపించారు , ఆ సందర్భంగా ,మహిళా వ్యాపార మరియు నారి శక్తి రుణాలను ఖాతాదారులకు అందచేశారు , బ్యాంకు యొక్క ముఖ్య మహిళలుగా ,రామలక్ష్మా గారు, రసూల్ బి ను సన్మానించారు మరియు ఈ కార్యక్రమాన్ని సింగరాయకొండ బ్రాంచ్ సిబ్బంది మరియు మేనేజర్ స్ విక్రమ తేజ నిర్వహించారు ముఖ్య అతిధులుగా కే నారాయణ,రామచంద్రయ్య విశ్రాంత మండల విద్య అధికారులు, వెలుగు సిబ్బంది హాజరు అయ్యారు

## గంటా వెంకటరమణారెడ్డి కి ఘన సన్మానం .



దోర్నాల మండలం రిపోర్టర్- (శుభోదయం న్యూస్) :ప్రకాశం జిల్లా పెద్ద దోర్నాల మండలం వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ గా రెండవసారి ఎన్నికైన గంటా వెంకటరమణ రెడ్డి నీ మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలతో శాలువలతో శుక్రవారం వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు కార్యకర్తలు ఘనంగా సన్మానించి హర్షం వ్యక్తం చేశారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గ వైఎస్ఆర్సిపి టి యు సి అధ్యక్షుడు పెద్ద దోర్నాల సేఫ్టీ డైవర్స్ యూనియన్ అధ్యక్షుడు షేక్ షేక్షావలి ఆధ్వర్యంలో పలువురు వైఎస్ఆర్సిపి నేతలు కార్యకర్తలు అభిమానులు గంటా వెంకటరమణారెడ్డి కి శుభాకాంక్షలు తెలిపారు. వైయస్సార్ పార్టీ బలోపేతంపై చర్చించి భవిష్యత్ కార్య చరణ పై సమాలోచన జరిపారు. సేఫ్టీ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు షేక్షావలి మాట్లాడుతూ గంటా వెంకటరమణారెడ్డికి రెండవసారి మండల కన్వీనర్ గా ఇచ్చినందుకు అభివందనాలు తెలిపారు. మండల ప్రజలందరికీ అందుబాటులో ఉండి ప్రతి ఒక్కరి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. సన్మాన గ్రహీత గంటా వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ నాకు రెండవసారి మండల వైఎస్ఆర్సిపి కన్వీనర్ గా బాధ్యతలు అప్పగించిన పార్టీ అధినేత ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నాకు సహాయ సహకారం అందించిన ఎర్రగొండపాలెం నియోజకవర్గ శాసనసభ్యులు మా అన్న తాటిపర్తి చంద్రశేఖర్ కు కృతజ్ఞతలు తెలిపారు. నా మీద నమ్మకంతో నన్ను ఎన్నుకున్నందుకు మండల ప్రజలందరికీ వైఎస్ఆర్సిపి టియుసి అధ్యక్షుడు పెద్ద దోర్నాల సేఫ్టీ డైవర్స్ యూనియన్ అధ్యక్షుడు షేక్షావలికి యూనియన్ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనముగా నూతన విగ్రహ ప్రతిష్ట వేడుకలు



పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): చంద్రశేఖరపురం మండల పరిధిలోని శీలంవారిపల్లి గ్రామం నందు రిటైర్డ్ స్పెషల్ కలెక్టర్ పిడుగు బాబురావు ఆధ్వర్యంలో నూతనముగా నిర్మించిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ట వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజా కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా వేద పండితుల వేదమంత్రాల మంత్రోచ్చరణతో మంగళ వాయిద్యాలతో ఉదయము విష్వక్సేనపూజ పుణ్యాహవచనం పంచగవ్యఆరాధనం పంచగవ్యప్రాశనం వాస్తు హోమం అకల్మాషహోమం అక్ష్య న్మో క్రీయన్మనం పంచగవ్యాదివాసం హారతి తీర్థ ప్రసాద వినియోగం సాయంత్రం విష్వక్సేనపూజ పుణ్య హావచనం అగ్ని ప్రతిష్టాపన కుంభా సాధనం కుంభారాధనం నిత్య హోమం నివేదన హారతి తీర్థ ప్రసాద వినియోగము కార్యక్రమాలు నిర్వహించారు భక్తులు పూజా కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో హాజరై హోమం కార్యక్రమంలో పాల్గొన్నారు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు అనంతరం వేద పండితులు భక్తులకు శ్రీమన్నారాయణ ప్రవచనాలను చదివి వినిపించారు ఈ సందర్భంగా హోమము పూజా కార్యక్రమాలకు విచ్చేసిన భక్తులకు గ్రామస్తులకు అన్న ప్రసాదవితరణ కార్యక్రమం నిర్వహించారు.



## పుట్టినరోజు వేడుకలకు హాజరైన ఇంచార్జి దద్దాల




శుభోదయం న్యూస్ : నెల్లూరు ఎన్ 56 అంబ్రోసియా రెస్టారెంట్ నందు జరిగిన కనిగిరి నియోజకవర్గం మైనారిటీ సెల్ అధ్యక్షులు లిషేక్ గయాజ్ కుమారుడు షేక్ మాహిద్ మొదటి పుట్టినరోజు వేడుకలకు కనిగిరి వైసీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ హాజరయ్యారు.. ఈ సందర్భంగా మాహిద్ ను ఆశీర్వదించి,జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా వైయస్ఆర్‌సీపీ ఉపాధ్యక్షులు,జడ్పీటీసీ గుంటక తిరుపతిరెడ్డి, కనిగిరి మండల అధ్యక్షులు, జడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, పీడీసీసీబీ మాజీ చైర్మన్ వైఎం ప్రసాద్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి గాండ్లపర్తి ఆదినారాయణ రెడ్డి,ఎస్సీ నాయకులు కటికల వెంకటరత్నం, పామూరు మండలం సీనియర్ నాయకులు కల్లూరి రామిరెడ్డి,వైస్ సర్పంచ్ యాదల సాయి,గట్లా విజయభాస్కర్ రెడ్డి,అంబటి కొండారెడ్డి,ఎంపీటీసీ షేక్ అబ్దుల్,షైక్ మహమ్మద్ హుస్సేన్,సర్పంచ్ సైకం స్వర్ణ ఏడుకొండలు రెడ్డి,నియోజకవర్గ వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు పల్నాటి భాస్కర్ రెడ్డి,వాకమళ్ల రాజశేఖర్ రెడ్డి, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి,పోలక సిద్ధారెడ్డి,సంగటి మహేంద్ర రెడ్డి,ముల్లంగి శ్రీహరిరెడ్డి,మాజీ సర్పంచ్ గోబ్బిళ్ల శ్రీను,మడతల వెంకటేశ్వర్లు,ఈర్ల శ్రీను, ఇండ్ల శ్రీకాంత్,కంటూ కేశవ, మోటు తదితరులు పాల్గొన్నారు..

## వివిధ రంగాల్లో మహిళలు రాణిస్తున్నారు : డికె అరుణ



హైదరాబాద్: ప్రతి ఇంటికి ఆడదే ఆధారం. అందుకే పెద్దలు అన్నారు ఇంటికి దీపం ఇల్లాలని. ఎక్కడైతే స్త్రీలు పూజింపబడతారో అక్కడ దేవతలు కొలువుంటారు. కుటుంబ పోషణలో, అభివృద్ధిలో ఈ రోజుల్లో మహిళలది కీలక పాత్ర పోషిస్తుందని బిజెపి ఉపాధ్యక్షురాలు ఎంపి డికె అరుణ తెలిపారు. మహిళ అనుకుంటే ఏదైనా సాధించగలదన్నారు. ఆది పరాశక్తి రూపం అని, నారీ శక్తి ముందు ఏ శక్తి నిలువలేదని, నారీ శక్తిని ప్రపంచానికి చాటుదామని అన్నారు. నాగోల్ లోని పిఎంఆర్ కన్వెన్షన్ లో రెడ్డి విమెన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపి డికె అరుణ హాజరయ్యారు. ఈ సందర్భంగా డికె అరుణను రెడ్డి మహిళా అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. పలు రంగాల్లో ప్రావీణ్యం సాధించిన మహిళలను ఎంపి అరుణ శాలువతో సత్కరించారు. మహిళల శక్తిని ప్రధాని మోడీ గుర్తించి, చట్టసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు తీసుకొచ్చారని అన్నారు. ఈ అవకాశాలను మహిళలు వినియోగించుకోవాలని కోరారు.

## మల్టీప్లెక్స్‌లోనూ టికెట్ ధర రూ.200లే.. సిఎం నిర్ణయం



బెంగళూరు: అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో కర్ణాటక ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సినీ రంగానికి సంబంధించి ప్రభుత్వం కొన్ని ముఖ్యమైన మార్పులను సభ ముందుకు తీసుకువచ్చింది. 2025-26 సంవత్సరానికి గాను సిఎం సిద్ధరామయ్య శుక్రవారం రూ.4.08 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్‌లో మౌలిక సదుపాయాలు మతపరమైన కేటాయింపులు, సినిమా ప్రమోషన్స్, మహిళ సాధికారికత వంటి అంశాలను ప్రధానంగా ప్రస్తావించారు. ముఖ్యంగా సినిమా రంగాన్ని ప్రోత్సహించేందుకు సినిమా టికెట్ ధరను రూ.200గా నిర్ణయించాలని అనుకుంటున్నట్లు చెప్పుకొచ్చారు సిఎం. మల్టీప్లెక్స్‌లతో పాటు అన్ని థియేటర్లలో ఇదే రేటు ఉంటుదని అన్నారు. సామాన్యులకు కూడా సినిమాను అందుబాటులోకి తెచ్చేందుకే ఈ నిర్ణయం తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. కన్నడ సినిమాలను ప్రమోట్ చేసేందుకు ప్రభుత్వ ఆధ్వర్యంలో ఓ ఓటిటి ఫ్లాట్‌ఫామ్‌ను కూడా అందుబాటులోకి తెస్తామని పేర్కొన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో మైసూరులో ఫిల్మ్‌సిటి నిర్మించేందుకు 150 ఎకరాల స్థలాన్ని కేటాయించారు.

## ప్రపంచస్థాయిలో టీచర్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు



అమరావతి: పారదర్శకంగా టీచర్ల సీనియారిటీ జాబితా రూపకల్పన చేస్తున్నామని ఎపి మంత్రి నారా లోకేష్ తెలిపారు. రాష్ట్ర చరిత్రలో తొలిసారి టీచర్ల సీనియారిటీ జాబితా రూపొందిస్తున్నామని అన్నారు. శాసన సభలో లోకేష్ మాట్లాడారు. త్వరలోనే టీచర్ల బదిలీల చట్టం తీసుకొస్తామని, వచ్చే కేబినెట్ భేటీలో బదిలీల చట్టంపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. జివో 117పై అన్ని ఉపాధ్యాయ సంఘాలతోనూ చర్చించామని, వైసిపి ఉపాధ్యాయ సంఘాన్ని కూడా చర్చలకు పిలిచామని తెలియజేశారు. గత ప్రభుత్వం ఐబి, టోఫెల్, సిబిఎస్ఈ తెస్తామని ప్రకటించిందని, ఐబి, టోఫెల్, సిబిఎస్ఈపై ఒక్కోసారి ఒక్కోలా మాట్లాడారని విమర్శించారు. ఐబితో కాంట్రాక్టు కోసం రూ.5 కోట్లు ఖర్చు చేసి, సిబిఎస్ఈ అమలులో గందరగోళం సృష్టించారని మండిపడ్డారు. టీచర్లను సిద్ధం చేయకుండానే సిబిఎస్ఈ అమలు చేశారని, విమర్శించారు. తొలి విడతలో 10 వేల స్కూళ్లలో వన్ క్లాస్- వన్ టీచర్ విధానం అమలు చేశాం. అమరావతిలో ప్రపంచస్థాయి టీచర్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు చేసి, నైతికత పెంపొందించేలా ప్రత్యేక పాఠ్యాంశాలుంటాయని నారా లోకేష్ పేర్కొన్నారు.

## ఏడేళ్ల తర్వాత మొదటి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఒమర్ అబ్దుల్లా



శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌లో ఒమర్ అబ్దుల్లా ప్రభుత్వం శుక్రవారం బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. జమ్ముకాశ్మీర్‌లో ఏడేళ్ల అనంతరం ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ప్రభుత్వం ప్రవేశపెట్టిన మొదటి బడ్జెట్ కావడం గమనార్హం. అసెంబ్లీలో బడ్జెట్‌ను సమర్పిస్తూ.. ఈ ప్రాంతం శాశ్వత శాంతి మార్గంలో ఉందని స్పష్టం చేశారు. యువత మరియు మహిళలకు సాధికారత కల్పించడం, ప్రాంతీయ అసమానతలను పరిష్కరించడం మరియు రాష్ట్ర హెూదా పునరుద్ధరణ కోసం కృషి చేయడంపై బడ్జెట్ దృష్టి పెట్టిందని అన్నారు. ఈ బడ్జెట్‌లో వ్యవసాయానికి రూ.815 కోట్లు కేటాయించామని ,దీంతో 2.88 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని అన్నారు. రాష్ట్రం రెండు పంటల పద్ధతిని పోత్సహిస్తోందని, ఉద్యానవన పంటలను వ్యాప్తి చేయడంపై దృష్టిసారించిందని అన్నారు. ఉన్ని ప్రాసెసింగ్‌ను, తోలు చర్మ శుద్ధిపరిశ్రమను ప్రోత్సహించడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని అన్నారు. స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఈచర్యలు సహాయపడతాయని భావిస్తున్నామని అన్నారు. పర్యాటక అభివృద్ధికి రూ.390.20 కోట్లు కేటాయించినట్లు ఒమర్ అబ్దుల్లా ప్రకటించారు. దృష్టి సారించామని అన్నారు. శివ్‌ఖోరి, దూద్ పత్రి వంటి ప్రదేశాలకు పెరుగుతున్న ప్రజాదరణ, ఇటీవల 1800 మంది ప్రపంచ మారథాన్‌లకు ఆతిథ్యం ఇవ్వడంతో పర్యాటకుల ప్రవాహం పెరిగిందని అన్నారు.

# నల్లమల.. వన్యప్రాణుల ఖిల్లా

### ప్రకృతి అందాలకు నిలయం నల్లమల
### అభయారణ్యంలో 87కు పైగాపెద్ద పులులు
### 400 కు పైగా చిరుతలు, దుప్పులు, జింకలు
### అరుదైన పక్షిజాతులు, వృక్ష సంపద
### వన్యప్రాణుల సంరక్షణ దినోత్సవం





ప్రకృతి అందాలకు నల్లమల అటవీ ప్రాంతం ఆలవాలమైంది. ఎటు చూసినా ఆకాశాన్నంటే చెట్లు, బెబ్బులి గర్జనలు, నెమళ్ల నాట్యాలు, అరుదైన పక్షుల కిలకిలా రావాలు, అటు నుంచి ఇటు పరిగెత్తే జింకలు, సెలయేళ్లు, పర్యాటక ప్రదేశాలకు నల్లమల అటవీ ప్రాంతం నెలవుగా మారింది. ప్రతి ఏడాది మార్చి 3న ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవాన్ని నిర్వహిస్తుంటారు. ప్రజలకు వణ్యప్రాణుల సంరక్షణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తారు.

మార్కాపురం: నల్లమల అటవీ ప్రాంతం ప్రకాశం, గుంటూరు, కర్నూలు జిల్లాల పరిధిలో సుమారు 6.50 లక్షల హెక్టార్లలో విస్తరించి ఉంది. ఈ అటవీ ప్రాంతంలో 87కు పైగా రాయల్ బెంగాల్ టైగర్లు, సుమారు 400 కు పైగా చిరుతలు తిరుగుతున్నాయి. వీటితోపాటు వందల సంఖ్యలో దుప్పులు, జింకలు, నీల్‌గాయ్‌లు, ఎలుగుబంట్లు ఉన్నాయి. వీటితోపాటు ఆకాశంలో 4 నుంచి 5 కిలోమీటర్ల ఎత్తులో తిరుగుతూ క్షణాల్లో భూమిమీద తిరిగే వన్యప్రాణులను తినే అరుదైన క్రస్టడ్ హక్ ఈగల్ (నల్లపాముల గద్ద), షార్టు టోడోస్ స్నేక్‌ఈగల్, హనీబజర్, క్రస్టడ్ సర్పెంట్ ఈగల్‌లు సంచరిస్తున్నాయి. ఇక రష్యా నుంచి 8 వేల కిలోమీటర్లు ప్రయాణించి నల్లమలకు వచ్చే మాన్‌టెగ్యూష్ హారియర్, పాలిడ్ హ్యారియర్ తదితర పక్షులకు కూడా నల్లమల ప్రాంతం నివాసంగా మారింది. మార్కాపురానికి చుట్టుపక్కల నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న పెద్దదోర్నాల, పుల్లలచెరువు, యర్రగొండపాలెం, పెద్దారవీడు, అర్ధవీడు, గిద్దలూరు తదితర మండలాల్లో అటవీ సమీప గ్రామాలున్నాయి. పెద్దదోర్నాల మండలంలోని నల్లగుంట్ల, వై చర్లోపల్లి, తుమ్మలబైలు, శ్రీశైల శిఖరం, బొమ్మలాపురం, ఘాట్‌రోడ్డు, అర్ధవీడు మండలంలోని వెలగలపాయ, మాగుటూరు తాండ, గన్నెపల్లి, లక్ష్మీపురం, దొనకొండ, మార్కాపురం మండలం గొట్టిపడియ, పెద్దారవీడు మండలం గుండంచర్ల తదితర గ్రామాల సమీపాల్లోకి వన్యప్రాణులు తరచుగా వస్తుంటాయి. ముఖ్యంగా పెద్దపులులు, చిరుతలు, ఎలుగుబంట్లు, జింకలు, నెమళ్లు సంచరిస్తున్నాయి. అటవీశాఖ అధికారులు వన్యప్రాణుల సంరక్షణకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నారు. పెద్దపులులు, చిరుతలకు అడవిలోనే నీటి సమస్య లేకుండా సోలార్ సాసర్‌పిట్‌లు ఏర్పాటుచేసి అధికారులు నీటి సమస్య తీర్చారు. నల్లమల పరిధి పెరిగిపోతోంది. గతంలో ఏపీలోని ప్రకాశం, గుంటూరు, కర్నూల్, తెలంగాణలోని మహబూబ్‌నగర్, నల్గొండ తదితర జిల్లాలతో అనుసంధానంగా ఉండగా ఇప్పుడు శేషాచలం అడవులను కలుపుతూ ఎన్ఎస్‌టీఆర్ (నాగార్జున సాగర్ టైగర్ రిజర్వ్ ఫారెస్టు), శేషాచలం అడవులను కలిపి టైగర్ కారిడార్ ఏర్పాటైంది. నల్లమల అడవిలోని పెద్దపులులు కడప మీదుగా వనిపెంట, ఒంటిమిట్ట తదితర ప్రాంతాల్లో ఉన్న శేషచలం అడవుల్లో కూడా సంచరిస్తున్నాయి. దీంతో నల్లమల పరిధి 8 వేల చదరపు కిలోమీటర్ల నుంచి 16 వేల చదరపు కిలోమీటర్లకు విస్తరించింది. పులుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. సుమారు 1000 మంది సిబ్బందిని, 85 బేస్ క్యాంపులను ఏర్పాటు చేశారు. పులుల సంరక్షణకు తీసుకునే చర్యల వలన పులుల సంఖ్య పెరగడం విశేషం.







### ఆకట్టుకుంటున్న జంగిల్ సఫారీ..

దోర్నాల నుంచి శ్రీశైలం మధ్య అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జంగిల్ సఫారీ పర్యాటకులను ఆకర్షిస్తోంది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ జంగిల్ సఫారీని చూడొచ్చు. అటవీశాఖాధికారులు ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనంలో నల్లమల అటవీ ప్రాంతంలో సుమారు 25 కిలోమీటర్ల వరకూ ప్రయాణించవచ్చు. జింకలు, నెమళ్లు, పలురకాల పక్షిజాతులు కనిపిస్తాయి. ఇందులో పులికుంట వద్ద వ్యూ పాయింట్ వద్ద కాసేపు వాహనాన్ని ఆపుతారు. పెద్దపులులు, చిరుతలు ఇక్కడికి తరచుగా వచ్చి నీళు తాగుతాయి. ఇక కొండ చిలువలు, పెద్ద ఖపెద్ద చెట్లకు చుట్టుకుని కనిపిస్తాయి.

### జంగిల్ సఫారీ అద్భుతం

నల్లమల అటవీ ప్రాంతంలో దోర్నాల నుంచి శ్రీశైలం మధ్యలో అటవీశాఖ వారు ఏర్పాటు చేసిన జంగిల్ సఫారీ చాలా అద్భుతం. విజ్ఞానంతోపాటు వినోదాన్ని కూడా అందిస్తుంది. ప్రతి ఒక్కరూ సెలవు రోజుల్లో పిల్లలను తీసుకుని జంగిల్ సఫారీకి వెళితే అన్నీ రకాల వన్యప్రాణులను మనం చూడవచ్చు.

# ఈ అనిశ్చితి పోయేదెలా?



జనవరి 20న గద్దెనెక్కినప్పటినుంచీ అధిక టారిఫ్‌లపై హెచ్చరిస్తూ వచ్చిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్... చివరికి అందుకు తుది గడువు ఖరారు చేశారు. తమ ఉత్పత్తులపై అధిక టారిఫ్‌లు వసూలు చేస్తున్న దేశాలన్నీ వచ్చే నెల 2 నుంచి తమ దెబ్బ కాచుకోవాలని హెచ్చరిక జారీచేశారు. దాదాపు వంద నిమిషాలపాటు అమెరికన్ కాంగ్రెస్‌నుద్దేశించి బుధవారం ఆయన చేసిన ప్రసంగం నిండా ఇలాంటి హెచ్చరికలున్నాయి. ఇప్పటికే చాలా సాధించినట్టు స్వోత్కర్షలున్నాయి. అమెరికా ప్రజల పాలిట తాను ఆపద్బాంధవుడినన్న భ్రమ కూడా ఆయనకు పుష్కలంగా ఉంది. 'నేను విధించబోయే సుంకాలు కేవలం ప్రజానీకం ఉద్యోగాలు కాపాడటానికి మాత్రమే కాదు... ఈ చర్య మన దేశ ఆత్మను కాపాడటానికి కూడా' అని ఆయన చెప్పుకొచ్చారు. సహజంగానే ప్రపంచమంతా ఏప్రిల్ గురించి బెంగపడుతోంది. ముంచుకొచ్చే ద్రవ్యపరమైన అసమతౌల్యతను అధిగమించడమెలాగో తెలియక అయోమయంలో కూరుకుపోతోంది. ఇప్పటికే ట్రంప్ చైనాపై అదనంగా 10 శాతం, మెక్సికో, కెనడాలపై మరో 25 శాతం సుంకాలు ప్రకటించటం వల్ల ఈ ఉపద్రవం ఖాయమని అన్ని దేశాలూ ఆందోళనతో ఉన్నాయి.

సుంకాలను ట్రంప్ 'సర్వరోగ నివారిణి'గా భావిస్తున్నారు. మెక్సికో మాదకద్రవ్య ముఠాల నుంచి పెద్ద యెత్తున వచ్చిపడే ఫెంటానిల్ అమెరికాకు పెద్ద సమస్యగా మారింది. అక్రమ వలసలు దీనికి అదనం. వలసలను అరికట్టి, మాదకద్రవ్య ముఠా నాయకుల్ని పట్టి అప్పగించకపోతే 25 శాతం సుంకాలు తప్పవని గత నెల 4న ట్రంప్ హెచ్చరించటంతో కెనడా, మెక్సికోలు ఒక నెల వ్యవధి కోరాయి. మెక్సికో అధ్యక్షురాలు షీన్‌బామ్ వెనువెంటనే అమెరికా-మెక్సికో సరిహద్దుల్లోకి అదనంగా 10,000 మంది సైనికులను తరలించి తనిఖీలు పెంచి వలసలను నియంత్రించారు. దేశంలో ఫెంటానిల్ నిల్వలను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేయటంతోపాటు భారీయెత్తున అరెస్టులు చేయించారు. 29 మంది డ్రగ్స్ ముఠా నాయకుల్ని అమెరికాకు అప్పగించారు. కెనడా అధ్యక్షుడు ట్రూడో ఫెంటానిల్ సరిహద్దులు దాటకుండా తనిఖీ వ్యవస్థను ముమ్మరం చేశారు. అయినా ట్రంప్ మనసు మారలేదు. ఆ రెండు దేశాలపై 25 శాతం అదనపు సుంకాలుంటాయని తన ప్రసంగంలో ప్రకటించారు. త్వరలో జరగబోయే ఎన్ని కల్లో పార్టీ ఓటమి ఖాయమన్న అంచనాలుండటంతో దీన్ని తనకు అనుకూలంగా మలుచుకోవ టానికి ట్రూడో సిద్ధపడ్డారు. అందుకే 'సై అంటే సై' అంటున్నారు. అమెరికాపై ప్రతీకార సుంకాలు విధించ బోతున్నట్టు ప్రకటించారు. ఇప్పటికే 2,100 కోట్ల డాలర్ల విలువైన సరుకుపై సుంకాలు వడ్డించారు. వివాదం సద్దుమణగకపోతే మరో 8,700 కోట్ల డాలర్ల సరుకుపై ఇది తప్పదని హెచ్చరించారు. షీన్‌బామ్ ఈమధ్యే అధికారంలోకొచ్చారు గనుక ఆమెకు కావలసినంత వ్యవధి వుంది. అందుకే ఎంతో సంయమనం పాటిస్తున్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్ని తలకిందులు చేసే ఈ మాదిరి బ్లాక్‌మెయిలింగ్ కొత్తగా ట్రంప్‌కు పుట్టిన బుద్ధికాదు. అమెరికాలో ఎవరున్నా ఇలాంటి బెదిరింపులతోనే ప్రపంచ దేశాలను దారికి తెచ్చుకున్నారు.

1986-89 మధ్య సుంకాలు, వాణిజ్యాలపై సాధారణ ఒడంబడిక (గాట్)కు సంబంధించిన ఉరుగ్వే రౌండ్ చర్చల్లోనైనా, ఆ తర్వాత ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో)పై జరిగిన దోహా రౌండ్ చర్చల్లోనైనా అమెరికా వ్యూహం ఇదే. బ్రెజిల్ నుంచి వచ్చిన 4 కోట్ల డాలర్ల దిగుమతులపై వంద శాతం సుంకాలు విధించింది. మన నుంచి వెళ్లిన వస్త్ర దిగుమతులపైనా ఇలాంటి చర్యే తీసుకోబోతున్నట్టు హెచ్చరించింది. దాంతో మేధా సంపత్తి హక్కుల(ఐపీఆర్)పై అమెరికా తీసుకొచ్చిన అన్యాయమైన నిబంధనలకు తలొగ్గక తప్పలేదు. ఆఫ్రికా దేశాలనూ ఇలాగే దారికి తెచ్చుకుంది. అమెరికా అతి పెద్ద మార్కెట్ కావటం వల్ల అత్యధిక దేశాలు దానికెళ్లే ఎగుమతులపై ఆధారపడి వుంటాయి. మన దేశం నుంచి అమెరికాకు వెళ్లే ఎగుమతులు 18 శాతమైతే థాయ్‌లాండ్ నుంచి 17 శాతం, దక్షిణ కొరియానుంచి 16 శాతం ఎగుమతులుంటాయి. అమెరికాకు మెక్సికో ఎగుమతులు ఏకంగా 78 శాతం. తమ సంపద పెంచుకోవటానికి సంపన్న రాజ్యాలు నిరంతరం ప్రయత్నిస్తుంటాయి. భారత్‌తో సహా అనేక దేశాలు సుదీర్ఘకాలం పరాయి పాలనలో మగ్గిపోవటానికి ఏకైక కారణం ఇదే. ఉత్పత్తికి అవసరమైన ముడిసరుకు లభ్యతకూ, తయారైన సరుకు అమ్ముకోవటానికీ సరిహద్దులు దాటి వెళ్తూ సమయానుకూలంగా విధానాలు మార్చుకోవడం సంపన్న రాజ్యాల నైజం. గతంలో తన మార్కెట్‌ను విస్తరించుకోవటానికి డబ్ల్యూటీవో తీసుకొచ్చిన అమెరికాయే ఇప్పుడు వేరే మార్గానికి మళ్లింది. అయితే ట్రంప్ చర్యల వల్ల అమెరికాలో ద్రవ్యోల్బణం అధికమవుతుంది. సగటు పౌరుల జీవన వ్యయం పెరిగి పోతుంది. వ్యాపారం దెబ్బతిని నిరుద్యోగం ప్రబలుతుంది. ఆర్థిక వ్యవస్థ మందగిస్తుంది. తరతమ స్థాయిల్లో అన్ని దేశాలూ ఇలాంటి పరిస్థితులు ఎదుర్కొనక తప్పదు. 80 ఏళ్లుగా ప్రపంచ మార్కెట్లను శాసిస్తూ అతిగా సంపద పోగేసిన దేశమే 'నన్ను అందరూ దోచుకుతింటున్నార'ంటూ పెడబొబ్బలు పెట్టడం ఒక వైచిత్రి. కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ నేతృత్వంలోని బృందం అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కోసం ఎదురుచూస్తోంది. ఇప్పుడు ఒక్కొక్క దేశం అమెరికాపై ప్రతీకార సుంకాలకు రెడీ అవుతోంది. మున్ముందు కొత్త మార్కెట్ల వెదుకులాట కూడా మొదలవుతుంది. ఇలాకాక దేశాలన్నీ సమష్టిగా వ్యవహరిస్తేనే ఏదో మేర ప్రయోజనం ఉంటుంది. అమెరికాపై ఒత్తిడి పెరిగి సహేతుకమైన పరిష్కారం వీలవుతుంది.

# ఆత్మగౌరవమా.. లొంగుబాటా?



పీఠమెక్కి రెండు నెలలు కూడా గడవక ముందే కొరడా రాజుగా మారిన డోనాల్డ్ ట్రంప్ తనకు లొంగరు అనుకున్నవారి మీద ఎడాపెడా కొరడా ఝుళిపిస్తున్నాడు. సుంకాలు, ప్రతి సుంకాలు,ఆంక్షలు విధిస్తూ బస్తీమే సవాల్ అంటున్నాడు. తలవంచేట్లు చేసేందుకు బెదిరింపులా, బేరమాడేందుకు వేస్తున్న పాచికలా చివరకు ఏం జరుగుతుంది, ఎలా ముగుస్తుందన్నది ఎవరూ చెప్పలేరు. ప్రతి దేశానికి బలం- బలహీనతలున్నాయి, దానికి అమెరికా మినహాయింపు కాదు గనుక ట్రంపు కూడా తగ్గినా ఆశ్చర్యం లేదు. ప్రతి దేశమూ సర్వసత్తాకమే, ప్రతివారూ తమదైన పద్దతిలో ఆర్థిక వ్యవస్థలను నడిపిస్తున్నారు. తమ దేశాన్ని మరోసారి అగ్రస్థానంలో నిలుపునంటూ ట్రంప్ ప్రపంచం మీద వీరంగం వేస్తే కుదరదు. రవి అస్తమించని సామ్రాజ్యాధి పతులం అనుకున్న బ్రిటన్ ఏమైంది, ప్రపంచాన్ని చాపలా చుట్టి చంకలో పెట్టుకో వాలనుకున్న హిట్లర్‌కు ఏగతి పట్టిందీ ఎరుకే. ఒక పోరులో గెలుస్తామా లేదా అన్నది తర్వాత అంశం, ఎదుటివారు దురాక్రమణకు పాల్పడితే ప్రతిఘటించాలా, చేతులు నలుపుకోవాలా అన్నదే సమస్య. వివాదాలు తలెత్తితే ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యుటిఓ), ఐరాస, ప్రపంచ కోర్టులు ఉన్నాయి. ఎలాంటి సంప్రదింపులు, అభిప్రాయాల మార్పిడి లేకుండానే తన బుర్రలో తెల్లవారుజామున పుట్టిన బుద్దిని బయటపెట్టుకున్నట్లుగా డోనాల్డ్ ట్రంప్ ఏకపక్షంగా సుంకాలు ప్రకటించి చర్చలకు సిద్ధమంటున్నాడు. ఆత్మగౌరవం గల ఏ దేశమూ ఈ దందాను అంగీకరించదు. అందుకే 'మా ఇల్లు మీకెంత దూరమో..మీ ఇల్లూ మాకూ అంతేదూరం' అంటూ వెంటనే స్పందించాల్సిందే. రా! ఎలాంటి యుద్ధం కావాలని కోరుకుంటావో దానికి మేమూ సిద్ధమంటూ తాజాగా చైనా భేరీ మోగించింది. గతంలో ట్రంప్ ప్రారంభించిన వాణిజ్య యుద్ధం, ఇతర మరికొన్ని సమస్యల కారణంగా అక్కడ గతంలో మాదిరి వృద్ధిరేటు లేని మాట నిజం కావచ్చుగాని అది ఏ ఇతర ధనికదేశంతో పోల్చుకున్నా ఎంతో మెరుగైనదే. అది ఎదుర్కొంటున్న సమస్యలను అవకాశంగా తీసుకొని అణగదొక్కుదామని చూస్తే కుదిరేది కాదని తేలిపోయింది. ట్రంపూ అతగాడితో ఊరేగుతున్నవారు, ఉబలాటపడుతున్న వారికీ అర్థమౌ తోందా అంటే లేదనే చెప్పాలి. ఒకవేళ అవగత మైతే పరిణామాలు వేరుగా ఉండేవి. బీజింగ్‌లో జరుగుతున్న పీపుల్స్ కాంగ్రెస్ ఐదుశాతం వృద్ధి రేటు లక్ష్యంగా నిర్ణయించి దానికి అవసరమైన చర్యల గురించి చర్చిస్తున్నది. దశాబ్దాల తరబడి అమెరికా అడుగుజాడల్లో నడుస్తున్న కెనడాను ఆక్రమించి యాభైఒకటవ రాష్ట్రంగా చేసుకోవాలన్న సంకల్పాన్ని ట్రంప్ పదే పదే ప్రకటిస్తున్నాడు. మరోసారి దాన్ని అవమానకరంగా వెల్లడించాడు. ప్రతి సుంకాలు విధిస్తే మరింతగా పెంచుతామంటూ పెట్టిన సామాజిక మాధ్యమ పోస్టులో కెనడా ప్రధానిని ఉద్దేశించి ఈ విషయాన్ని " కెనడా గవర్నర్ జస్టిన్ ట్రుడేవ్‌కు " వివరించండని కూడా దానిలో సలహా ఇచ్చాడు. అంటే కెనడా తమ రాష్ట్రమని పునరు ద్ఘాటించటమే. టిప్‌టాప్‌గా ఉన్నప్పటికీ అతగాడి చర్యలు పిచ్చివాడి పనిగా ఉందంటూ ఒక పత్రిక చేసిన వ్యాఖ్యను ట్రంప్ గురించి ట్రుడేవ్ ఉటంకించాడు, తక్షణమే అమల్లోకి వచ్చే విధంగా ప్రతిసుంకాలను ప్రకటించాడు. అత్యంత సన్నిహితం, భాగస్వామిగా ఉన్న కెనడా మీద వాణిజ్య యుద్ధం ప్రకటించి అదే సమయంలో హంతక నియంత పుతిన్‌ను సంతుష్టీకరించేందుకు పూనుకోవటం మతి ఉండి చేస్తున్న పనులేనా అన్నట్లుగా విరుచుకుపడ్డాడు. అఫ్ కోర్సు ఇదే పెద్ద మనిషి తర్వాత జావగారి పోయినా చేసేదేమీ లేదు, అది వేరే విషయం. చివరికి కెనడాలో అత్యధిక జనాభా గల ఒంటారియో రాష్ట్ర ప్రధాని డగ్ ఫోర్డ్ కూడా ట్రంప్‌ను దుయ్యబట్టాడు. 'మేమిచ్చే విద్యుత్, ఇంధనం మీద ఆధారపడుతూ మమ్మల్ని బాధిస్తారా, మేం తలుచు కుంటే న్యూయార్క్ నగరంలో పదిహేను లక్షల మందికి విద్యుత్ నిలిచిపోతుంది జాగ్రత్త' అన్నాడు. ఇక్కడ సమస్య ఏమిటంటే ఒక కంచంలో తిని ఒక మంచంలో పడుకున్న కెనడియన్లే అలా స్పందిస్తే మన సంగతేమిటి? ఉన్న కార్యక్రమాలన్నీ ఆకస్మికంగా రద్దు చేసుకొని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ అమెరికా వెళ్లి అక్కడి వాణిజ్యమంత్రితో సంప్రదింపులు జరిపినప్పటికీ వాటిని పరిగణనలోకి తీసుకోకుండా మరుక్షణమే ట్రంప్ ప్రకటన చేశాడు. తాను ప్రపంచమంతా తిరిగి పోయిన భారత ప్రతిష్టను తిరిగి తెచ్చానని చెప్పిన ప్రధాని నరేంద్రమోడీ నోటి నుంచి ట్రంప్ సుంకాల ప్రకటన మీద గడిచినా ఎలాంటి స్పందన లేదు. ఆత్మగౌరవమా, లొంగుబాటా? ఏమనుకోవాలి? ఫిబ్రవరి రెండవ వారంలో మోడీ అమెరికా పర్యటన జరపటానికి ముందే నమస్కార బాణం వేసినట్లుగా కొన్నింటి మీద పన్నులు తగ్గించి ట్రంప్‌ను ప్రసన్నం చేసుకొనేందుకు చూశారు. వ్రతం చెడ్డా ఫలం దక్కలేదనుకోవాలా ? నూటనలభై కోట్ల మంది జనానికి ఏదో ఒకటి చెప్పాలా వద్దా!

## మహిళలకు సానుభూతి కాదు.. సాధికారత అవసరం



న్యూఢిల్లీ : మహిళలకు సానుభూతి కాదని, సమాజంలో సాధికారత అవసరమని సుప్రీంకోర్టు శుక్రవారం వ్యాఖ్యానించింది. ప్రస్తుతం సుప్రీంకోర్టులో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు మహిళా జడ్జీలలో ఒకరైన జస్టిస్ ఎం.త్రివేది మౌఖికంగా వ్యాఖ్యానించారు. బాధితురాలి పట్ల అందరి సానుభూతి ఉందని లైంగిక వేధింపుల కేసు విచారణ సందర్భంగా నిందితుడి తరపున వాదిస్తున్న న్యాయవాది సమర్థిస్తుండగా.. జడ్జి ఖండించారు. 'మహిళలకు సానుభూతి అవసరంలేదు. చట్టాలను సమర్థవంతంగా, కఠినంగా అమలు చేయడం ద్వారా వారికి సాధికారత కల్పించాలి' అని జస్టిస్ త్రివేది పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలపై సీనియర్ న్యాయవాది స్పందిస్తూ.. ఇళ్లలో మహిళలకు అధికారం ఇవ్వాలి. అది జరుగుతోందని అన్నారు. ఈ వ్యాఖ్యలను జడ్జి మరోసారి ఖండించారు. కేవలం ఇళ్లలో ఉన్న మహిళల గురించి మాత్రమే కాదని అన్నారు. సమాజంలో ప్రతి చోటా ఉన్న మహిళలందరికీ సాధికారత అవసరమని జడ్జి స్పష్టం చేశారు. జడ్జి వ్యాఖ్యలతో న్యాయమూర్తి ఏకీభవిస్తూ.. 'అవును .. ప్రతి చోటా ' అని జోడించారు. నిందితుడు ఏడు నెలలుగా జైలులో ఉన్నాడని న్యాయవాది వాదించారు. తమిళనాడుకి చెందిన ఈ కేసు అత్యాచారానికి సంబంధించినది. బాధితురాలి మెడపై చిన్న గాయం మాత్రమే ఉందని, హత్యాయత్నం కేసు కాదు. దీంతో శిక్షను పున:పరిశీలించాల్సి వుందని న్యాయవాది వాదించారు. బాధితురాలి మెడపై ఉన్న గుర్తు సాధారణ గాయం కాదని, నైలాన్ తాడుతో గొంతు కోసి హత్య చేసేందుకు యత్నించారని జడ్జి పేర్కొన్నారు. రెండు కోర్టులు ఈ తీర్పును ధృవీకరించాయి. శిక్ష పరిమితిపై సుప్రీంకోర్టు రాష్ట్రానికి నోటీసులు జారీ చేసింది.

## రెండువారాల్లో వ్యోమగాములను భూమిపైకి తీసుకువస్తాం



వాషింగ్టన్ : నాసా వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్‌లను త్వరలో భూమి మీదకి తీసుకువస్తామని అమెరికా అధ్యక్షులు ట్రంప్ ప్రకటించారు. వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్‌లు 9 నెలలుగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్‌ఎస్)లో చిక్కుకుపోయిన సంగతి తెలిసిందే. ఆ ఇద్దరు వ్యోమగాములు తిరిగి వచ్చినపుడు, వారిని పలకరించడానికి తాను సిద్ధంగా ఉంటానని ట్రంప్ అన్నారు. ఓవల్ ఆఫీసులో గురువారం కీలక ప్రకటన చేశారు. 'మేము మిమ్మల్ని ప్రేమిస్తున్నాం. తీసుకువెళ్లడానికి వస్తున్నాం' అని వ్యోమగాములకు సందేశం పంపామని అన్నారు. వారిని భూమిపైకి తీసుకువచ్చేందుకు బైడెన్ ప్రభుత్వం ఎలాంటి ప్రయత్నం చేయలేదని మండిపడ్డారు. వ్యోమగాములను సురక్షితంగా భూమిపైకి తీసుకువచ్చే బాధ్యతను ఎలన్ మస్క్‌ఉ అప్పగించినట్లు తెలిపారు. రాబోయే రెండువారాల్లో మస్క్ వ్యోమగాములను తిరిగి భూమిపైకి తీసుకువచ్చే స్పేస్ ఎక్స్ క్యాప్సూల్‌ను సిద్ధం చేస్తున్నారని అన్నారు.

## స్టార్‌షిప్ రాకెట్ ప్రయోగం విఫలం



టెక్సాస్ : అంతరిక్ష ప్రయోగంలో ఎలన్‌మస్క్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్టార్‌షిప్ కార్యక్రమానికి భారీ ఎదురుదెబ్బ తగిలింది. గురువారం ప్రయోగించిన కొన్ని నిమిషాలకే స్పేస్‌ఎక్స్ స్టార్‌షిప్ రాకెట్ ప్రయోగం విఫలమైంది. దక్షిణ ఫ్లోరిడా-బహామాస్ సమీపంలో రాకెట్ పేలిపోయి శిథిలాలు చెల్లాచెదురుగా కిందపడ్డాయి. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. టెక్సాస్‌లో గురువారం సాయంత్రం 5:30 గంటలకు స్టార్‌షిప్ రాకెట్‌ను ప్రయోగించారు. నిప్పులుచిమ్ముకుంటూ రాకెట్ విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లింది. హఠాత్తుగా అంతరిక్షంలో ఉండగా పేలిపోయింది. అంతే వేగంగా శిథిలాలు కిందకు వచ్చి పడ్డాయి. ఇందుకు సంబంధించిన దఅశ్యాలు వైరల్ అవుతున్నాయి. రాకెట్ ప్రయోగం విఫలం కావడంపై స్పేస్‌ఎక్స్ స్పందించింది. ఫెయిల్యూర్ నుంచి పాఠాలు నేర్చుకుంటున్నట్లు తెలిపింది. ముందుగా నిర్ణయించిన మార్గంలో త్వరగా వెళ్లలేకపోయిందని.. అనంతరం రాకెట్‌తో సంబంధాలు తెగిపోయాయని తెలిపింది. స్టార్‌షిప్ విశ్వసనీయతను మెరుగుపరచడానికి పాఠాలు నేర్చుకుంటున్నట్లు పేర్కొంది. ఇక భారీ శకలాలు కిందికి దూసుకొచ్చాయి. ఫ్లోరిడా, బహామాస్ ప్రాంతాల్లో తారాజువ్వల్లా కనిపించాయి. దీని వల్ల ఎయిర్ ట్రాఫిక్‌కు కూడా అంతరాయం ఏర్పడింది. ప్రమాదం తర్వాత కరేబియన్ ప్రాంతంలోని అనేక విమానాలను దారి మళ్లించాల్సి వచ్చింది. శిథిలాలు కిందకు దూసుకురావడంతో మయామి, ఫోర్ట్ లాడర్‌డేల్, పామ్ బీచ్, ఓర్లాండో విమానాశ్రయాల్లో విమానాలను తాత్కాలికంగా నిలిపివేశారు. జనవరిలో కూడా ఒక ప్రయోగం విఫలమైంది. రెండు నెలల తర్వాత చేపట్టిన ఈ ప్రయోగం కూడా ఫెయిల్యూర్ అయింది. ఈ రెండు ప్రయోగాలు కూడా అంతరిక్షంలో పేలిపోయాయి. వాటి శకలాలు కింద పడిపోయాయి.

## నా భర్తతో ఎలాంటి మనస్పర్థలు లేవు : గాయని కల్పన



తెలంగాణ : అధిక మోతాదులో నిద్ర మాత్రలు వేసుకొని అపస్మారక స్థితిలోకి వెళ్లిన గాయని కల్పన ప్రస్తుతం కోలుకుంటున్నారు. తన భర్తపై మీడియాలో తప్పుడు ప్రచారం జరుగుతోందని దాన్ని ఆపేయాలని విజ్ఞప్తి చేస్తూ తాజాగా ఓ వీడియో విడుదల చేశారు. ఒత్తిడి కారణంగా నిద్ర పట్టలేదని అందుకే టాబ్లెట్స్ వేసుకున్నట్లు చెప్పారు. " మీడియాలో మా కుటుంబంపై తప్పుడు ప్రచారం జరుగుతోంది. దాని గురించి అందరికీ వివరణ ఇవ్వాలనుకుంటున్నా. నేను నా భర్త, కుమార్తె సంతోషంగా జీవిస్తున్నాం. నేను 45 సంవత్సరాల వయసులో పీహెచ్‌డీ, ఎల్‌ఎల్‌బీ చేస్తున్నాను. నా భర్త సహకారం వల్లే ఇవ్వన్నీ చేయగలుగుతున్నా. ఆయనతో నాకు ఎలాంటి మనస్పర్థలు లేవు. మా కుటుంబం చాలా అన్యోన్యంగా ఉంది. వఅత్తిపరమైన ఒత్తిడి కారణంగా నిద్ర పట్టడం లేదు. దానికోసం చికిత్స తీసుకుంటున్నాను. వైద్యులు సూచించిన ప్రిస్క్రిప్షన్ లో టాబ్లెట్స్ ఓవర్ డోస్ తీసుకున్నాను. అందువల్లే స్పఅహ తప్పి పడిపోయాను. నా భర్త సరైన సమయంలో స్పందించడం, కాలనీవాసుల, పోలీసుల సహాయం వల్ల నేను మీ ముందు ఉన్నాను. త్వరలోనే మళ్లీ నా పాటలతో మిమ్మల్ని అలరిస్తాను. ఆయన సహకారం వల్లే నచ్చిన రంగాల్లో రాణిస్తున్నాను. నా జీవితానికి బెస్ట్ గిఫ్ట్ నా భర్త. నా ఆరోగ్యం గురించి వాకబు చేసిన అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు " అంటూ వీడియో విడుదల చేశారు.

# చిచ్చురాజేస్తున్న పునర్విభజన



నియోజకవర్గాల పునర్విభజనకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు ముమ్మరం చేస్తున్న కొద్దీ ఈ ప్రక్రియపై అలముకున్న వివాదాల తేనెతుట్టె అంతకంతకూ కదలడం మొదలైంది. పునర్విభజన వల్ల తీవ్రంగా నష్టపోయే దక్షిణాది రాష్ట్రాల్లో నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమం లో తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక ముఖ్యమంత్రులు పునర్విభజన విధివిధానాలను తప్పుబడుతూ, జనాభా ప్రాతిపదికన కాకుండా దేశ ఆర్థికాభివృద్ధిలో తమ తమ రాష్ట్రాల భాగస్వామ్యం ఆధారంగా పునర్విభజన జరగాలంటున్నారు. దక్షిణాదిలో రేకెత్తుతున్న ఆందోళనలను దృష్టిలో ఉంచుకుని ఇటీవల కేంద్ర హోంమంత్రి.. నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాదిన ఒక్క సీటు కూడా తగ్గదంటూ చేసిన ప్రకటన నమ్మదగినదిగా లేదు సరికదా, ఏ ఆధారంతో ఆయన అలా అన్నారో కూడా అర్థం కాదు. జనాభా ప్రాతిపదికన జరిగే పునర్విభజన వల్ల తీవ్రంగా నష్టపోయేది దక్షిణాది రాష్ట్రాలే. ఎందుకంటే, ఉత్తరాదిన ఉత్తరప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాలతో పోలిస్తే దక్షిణ భారతంలోని అన్ని రాష్ట్రాలలోనూ జనాభా తక్కువ. కుటుంబ నియంత్రణపై గతంలో దక్షిణాది రాష్ట్రాలు సలిపిన కృషే ఇందుకు కారణం. కుటుంబ నియంత్రణపై కేంద్రంలోని పెద్దల ఆదేశాలను తూచ తప్పక పాటించి, జనాభా పెరుగుదలను నియంత్రించినందుకు తమకు దక్కిన ప్రతిఫలం ఇదేనా అన్న దక్షిణాది రాష్ట్రాల నేతల ప్రశ్న సముచితమైనదే. దేశ జనాభాలో తెలంగాణ జనాభా 2.8 శాతం మాత్రమే. కాబట్టి నియోజకవర్గాల పునర్విభజనలో ప్రస్తుతం ఉన్న 19 కంటే సీట్ల సంఖ్య మరింత తగ్గక తప్పదు. ఉభయ తెలుగు రాష్ట్రాలకు కలిపి ఉన్న 42 సీట్లు, మొత్తం 543 లోక్‌సభ సీట్లలో 7.73 శాతానికి సమానం. అలా చూసినా, ఈ రెండు రాష్ట్రాలలోనూ సీట్ల సంఖ్యలో కోత పడుతుందన్నమాటే.ప్రతి రాష్ట్రంలోనూ జనాభాను బట్టి నియోజకవర్గాల విభజన జరగాలని రాజ్యాంగంలోని 81వ అధికరణ నిర్దేశిస్తోంది. ఈమేరకు పదేళ్లకు ఒకసారి జనగణన జరిపి, నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాల్సి ఉండగా 1970 నుంచీ ఈ ప్రక్రియ ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లుగా ముందుకు కదలలేదు. ఇందుకు కారణం దక్షిణాది రాష్ట్రాలనే చెప్పాలి. కుటుంబ నియంత్రణ సమర్థంగా అమలు చేసిన కారణంగా జనాభా తగ్గిందని, పునర్విభజన జరిపితే తాము నష్టపోతామంటూ దక్షిణాది రాష్ట్రాలు చేసిన వాదనను పరిగణనలోకి తీసుకుని 2001 వరకూ ఈ ప్రక్రియను వాయిదా వేస్తూ 42వ రాజ్యాంగ సవరణ అమలులోకి వచ్చింది. విచిత్రమేమంటే, 2001 నాటికి కూడా ఇదే పరిస్థితి ఉండటంతో పునర్విభజన ప్రక్రియ 2026కు వాయిదా పడింది. ఇప్పటికీ అదే పరిస్థితి నెలకొని ఉండటాన్ని కేంద్రం పరిగణనలోకి తీసుకోవాలి. జనాభా ప్రాతిపదికన కాకుండా ఆయా రాష్ట్రాలు సాధించిన ఆర్థిక ప్రగతిని, దేశాభివృద్ధిలో పోషిస్తున్న పాత్రను పరిగణనలోకి తీసుకుని పునర్విభజన ప్రక్రియకు శ్రీకారం చుట్టడం సముచితంగా ఉంటుందన్న మేధావుల సూచన పరిగణించదగినదే. ఈ నేపథ్యంలో 2026లో జనగణన జరిపి, దాని ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన జరపాలని కేంద్రం సంకల్పించడంతో సమస్య మళ్లీ మొదటకు వచ్చింది. జనాభాకే ప్రాముఖ్యమిచ్చి నియోజకవర్గాలను పునర్విభజన చేయడం వల్ల కొన్ని రాష్ట్రాలకు రాజకీయంగా, ఆర్థికంగా తీవ్ర నష్టం వాటిల్లుతుంది. నియోజకవర్గాల సంఖ్య తగ్గితే రాజకీయ ప్రాతినిధ్యమూ తగ్గుతుంది. తమ రాష్ట్రం తరపున చట్టసభల్లో గొంతు విప్పే సభ్యుల సంఖ్య తగ్గుతుంది. అలా కాకుండా దేశ ఆర్థికాభివృద్ధిలో తమ రాష్ట్రాలు పోషిస్తున్న పాత్రను, సాధిస్తున్న ప్రగతిని దృష్టిలో ఉంచుకుని పునర్విభజన జరిగేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలి. అలా జరగాలంటే, జనాభా ప్రాతిపదికన పునర్విభజన జరిగితే నష్టపోయే రాష్ట్రాలన్నీ ఒక్కతాటిపైకి రావలసిన అవసరం ఉంది. రాజకీయ ప్రాతినిధ్యాన్ని కాపాడుకునేందుకు, ఆర్థిక ప్రయోజనాల పరిరక్షణకు దక్షిణాది రాష్ట్రాలన్నీ చేతులు కలపవలసిన తరుణమిది. అవసరమైతే పునర్విభజన ప్రక్రియ లో అసమానతలు, అన్యాయాలపై కోర్టు గడప తొక్కేందుకు వెనుకాడకూడదు. దక్షిణాదిన బిజెపికి ఎక్కువ సీట్లు లేని కారణంగా పునర్విభజన ద్వారా తమకు పట్టు ఉన్న ఉత్తరాదిలోనే సీట్లు పెంచుకునేందుకు కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ పన్నుతున్న కుట్రగా కొన్ని రాజకీయ పార్టీలు చేస్తున్న ఆరోపణలకు స్పందించడం ద్వారా కమలనాథులు తమ చిత్తశుద్ధిని చాటుకోవాలి. అవసరమైతే పునర్విభజన ప్రక్రియపై సందేహాలు లేవనెత్తుతున్న రాజకీయ పార్టీలతో అఖిలపక్ష భేటీని ఏర్పాటు చేసి, వారిని అనుమానాలను నివృత్తి చేసేందుకు పూనుకోవాలి.

# పాఠాలు పెడదారి... గుణపాఠమే దారి



వరుసగా జరిగిన మానవవాదుల హత్యలు, హేతువాదులపై దాడులు, ఆలోచనా పరులైన రచయితలపై ఒత్తిళ్లు, నోట్ల రద్దు, జిఎస్‌టి, బ్యాంకుల దివాలా, రైతుల లాంగ్ మార్చ్ వంటివన్నీ భవిష్యత్ చీకటిగా ఉండబోతోందని హెచ్చరిస్తున్నాయి. ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. అందుకు కారణం కేంద్ర మంత్రుల ఉపన్యాసాలు ఒక కారణమైతే, వివిధ రాష్ట్రాలలో పాఠ్యపుస్తకాలలోని అంశాలు మరొక కారణం! దేశంలోని వివిధ రాష్ట్రాల్లో పాఠశాల పాఠ్యపుస్తకాల్లో అసంబద్ధమైన అంశాలు, అసత్యాలు ఎలా చోటు చేసుకున్నాయో గమనించండి. పదమూడు పదిహేను సంవత్సరాల మధ్య వయస్సున్న బాల బాలికలకు తప్పుడు సమాచారం అందించడమంటే, వారిని తప్పుడు వ్యక్తులుగా తయారు చేయడమే కదా? గుజరాత్‌లో యాభై వేల మంది చదువుకునే ఒక సామాన్య శాస్త్ర పాఠ్యగ్రంథంలో రెండవ ప్రపంచ యుద్ధం జరుగుతున్న సమయంలో జపాన్, అమెరికాపై అణుయుద్ధం ప్రకటించిందని ఉంది. వక్రీకరించిన చారిత్రక అంశాలు చదువుకుని భావిభారత పౌరులు ఎలా తయారవుతారన్నది ఆందోళనపడాల్సిన విషయం.అదే విధంగా స్త్రీల గౌరవాన్ని దిగజార్చే అంశాలు పాఠ్య గ్రంథాల్లో చేర్చడం వల్ల భవిష్యత్‌లో మహిళల పరిస్థితి ఏమిటి? రాజస్థాన్‌లో బోధిస్తున్న ఒక పాఠ్యగ్రంథంలో స్త్రీలకు గాడిదలకు పోలిక చూపబడింది. ఉదయం నుండి రాత్రి వరకు స్త్రీలు గాడిదల్లా చాకిరి చేయాల్సి ఉంటుందని హిందీ పాఠ్య పుస్తకంలో సెలవిచ్చారు. గాడిదలకు చెట్టుకింద కాసేపు విశ్రాంతి నివ్వొచ్చు. కాని స్త్రీలకు ఇవ్వకూడదు 'పాపం గాడిదలు పారిపోయినా వెంటనే మళ్లీ దొరుకుతాయి. వాటికి స్త్రీల వలే పుట్టింటికి పారిపోయే సౌకర్యం లేదు' అని ఆ పాఠం రాసిన రచయిత ఓ చమక్కు విసిరాడు. ఆ విషయాన్ని కిందిస్థాయి నుండి పైస్థాయి అధికారుల దాకా అందరూ ఆమోదించారు. కాస్త సున్నిత మనస్కులు, ఇంగిత జ్ఞానం ఉన్న ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు ఎవరైనా ఉంటే ఆ పాఠం పిల్లలకు ఎలా చెపుతారు? మనసు చంపుకుని ఉద్యోగ ధర్మంగా, పాఠం చెప్పడమంత శిక్ష మరొకటి ఉండదు కదా? 'పిల్లల పాఠంలో అలాంటి అంశం ఎందుకుందని' ఒక జాతీయ పత్రికా విలేకరి సంబంధిత అధికారిని అడిగితే "ఏదో పిల్లలకు కాస్త సరదాగా ఉంటుందని అలా పెట్టి ఉంటారని అదో పెద్ద విషయమా? " అని ఎదురు ప్రశ్నించాడు. "భార్యలు గాడిదల్లాంటి వారు" అన్న వాక్యంలో అతనికి ఏ తప్పూ కనిపించలేదు. బిజెపి ప్రభుత్వాలున్న గుజరాత్, రాజస్థాన్‌లలో అధికారులకు, మంత్రులకు, ముఖ్యమంత్రులకు అలాగే కేంద్ర ప్రభుత్వం వారికీ ఎవరికీ అందులో తప్పే కనిపించలేదు. వీళ్లంతా ఆధునిక మనువాద ప్రతినిధులన్న మాట! సెంట్రల్ బోర్డ్ ఫర్ సెకండరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్‌ఇ) పాఠ్య పుస్తకంలో పది, పదకొండేళ్ల పిల్లలు చదువుకునే పుస్తకంలో మాంసాహారం తినేవారి వల్ల సమాజంలో దౌర్జన్యాలు జరుగుతున్నాయని ఉంది. మాంసాహారం తీసుకునేవారు అవలీలగా అబద్ధాలు చెపుతారని, ఇచ్చిన వాగ్దానాలు నిలబెట్టుకోరని, అల్లర్లు, అలజడులూ సృష్టిస్తారని, ముఖ్యంగా లైంగిక దాడులకు పాల్పడుతారని, వారికి నిజాయితీ, నిబద్ధత ఉండవని, ఊరికే ఆవేశపడి బూతులు మాట్లాడుతారని ఉంది. ఇలా దోషాలన్నీ మాంసాహారులకు అంటగట్టి పసి మనసుల్ని ప్రభావం చేయడం ఏ సబబు? ఏ ఆహారం తీసుకుంటే ఏఏ లాభాలున్నాయి? ఎందులో ఎన్ని నష్టాలున్నాయి? అనేది శాస్త్రీయంగా వివరించాలి. ఆహారం ఎంచుకునే స్వేచ్ఛ పిల్లలకు ఇవ్వాలి. అంతేగాని, నైతికంగా దిగజారిన వారి లక్షణాలన్నీ గుదిగుచ్చి మాంసాహారులకు ఆపాదిస్తే, అది నిజమైపోదు కదా? ఒక రకంగా చూస్తే మాంసాహారులు శాఖాహారులు ప్రపంచంలో సమానంగా ఉండి ఉంటారు. లేదా మాంసాహారులు సంఖ్యే ఎక్కువగా ఉండి ఉంటుంది. అట్లని శాఖాహారులంతా సచ్ఛీలురు, సత్యవ్రతులు, సత్ప్రవర్తన గల మహనీయులు కాదు గదా? ఈ విషయమే సిబిఎస్‌ఇ డైరెక్టర్‌ని అడిగితే 'పాఠ్యాంశాలపై దేశంలో నియంత్రణ లేదని, ఒక్కో ప్రాంతంలో ఒక్కో భాషలో విషయాలు ఒక్కో రకంగా ఉన్నాయని ఒప్పుకున్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి డెబ్బయి ఏళ్లయిపోయినా బాలబాలికలకు చెప్పాల్సిన పాఠ్యాంశాలపై నిర్దుష్టమైన ప్రణాళిక లేకపోవడం ఘోరం! ప్రభుత్వాలు మారినప్పుడల్లా అంశాలు, వక్రీకరణలు మారుతూ ఉండడం మరో ఘోరం! మధ్య భారతంలోని చత్తీస్‌గఢ్‌లో హైస్కూలు విద్యార్థుల పాఠ్య గ్రంథంలో 'దేశంలో నిరుద్యోగ సమస్యకు మూల కారణం మహిళలు' అని ఉంది. మహిళలు అన్ని రంగాల్లో విజృంభించడం వల్ల అన్ని రకాల ఉద్యోగాల్లో చేరుతూ ఉండడం వల్ల పోటీ ఎక్కువైంది. అభ్యర్థుల సంఖ్య అనూహ్యంగా పెరుగుతూ వచ్చింది. ఫలితంగానే నిరుద్యోగ సమస్య పెరిగిపోయింది అని ప్రభుత్వం వారు నిర్ధారించారు. స్త్రీ, పురుషులందరూ దేశ పౌరులైనప్పుడు పౌరులకు సమాన హక్కులున్నప్పుడు అందుకు తగిన విధంగా ప్రభుత్వాలు పని చేయాలి. ఉద్యోగావకాశాలు కల్పించాలి. అంతేగాని, మహిళలు చదువుకుని ఉద్యోగాలకు పోటీపడడం వల్ల నిరుద్యోగ సమస్య పెరిగిందనడం అసంబద్ధంగా ఉంది. స్త్రీలను గాడిదలని, వారి వల్లే ఉద్యోగాలు లేకుండాపోయాయని, మాంసాహారులంతా నీతిమాలిన వారని చెపుతూ ఏ సమాజాన్ని నిర్మించాలని ప్రభుత్వం కలలు కంటోంది? జనాభాలో సగభాగమైన మహిళల్ని హీనంగా చూపిస్తూ ఆరోగ్యకరమైన సమాజాన్ని రూపొందించగలరా? పాఠశాల స్థాయి నుండే పిల్లలకు అసత్యాలను నూరిపోస్తే పర్యవసానం ఎలా ఉంటుంది? ఎలాగైనా సరే మళ్లీ మనువాదన్ని నిలబెట్టే ప్రయత్నం బిజెపి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చేస్తున్నట్టుగా లేదూ? ఇలాగైతే భవిష్యత్తంతా అంధకారమే కదా? అచ్ఛేదిన్ స్వచ్ఛభారత్ నినాదాల కింద ఎంత మురుగు పేరుకుపోతోందో ప్రజలు తెలుసుకోవాల్సి ఉంది. ఒక్కటంటే ఒక్కటి ముందడుగు వేయకపోగా, దేశం వెయ్యడుగులు వెనక్కి వేస్తున్నట్టుగా ఉంది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులూ నిజాలు గ్రహించి, పిల్లలకు వాస్తవాలు చెప్పాలి. వారికి హేతుబద్ధంగా ఆలోచించడం నేర్పాలి!

# చివరికి తోకముడిచిన జెలెన్ స్కీ



ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని ఎలాంటి సాయం తమ నుంచి అందకుండా ఏకాకిని చేస్తే కానీ తమ దారికి రాడని ట్రంప్ నిర్ణయానికి రావడం, ఈ మేరకు ఒక వ్యూహంతో ఉక్రెయిన్‌కు మిలిటరీ సాయం తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు మంగళవారం (మార్చి 4, 2025) ప్రకటించడం అనూహ్య పరిణామాలకు దారితీసింది. ట్రంప్ తాజా నిర్ణయంతో ఆయుధాలు, ఇతరత్రా యుద్ధ సామగ్రి రూపంలో దాదాపు 100కోట్ల డాలర్ల విలువైనవి ఉక్రెయిన్‌కు వెళ్లాల్సి ఉండగా, అవన్నీ నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది. దీంతో కొన్ని గంటల్లోనే ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ దిగివచ్చారు. ఇటీవల శ్వేత భవనంలోని ఓవల్ ఆఫీసులో మీడియా ప్రతినిధుల ముందే ట్రంప్ వాదనలను గట్టిగా ఎదుర్కొని అతిసాహసవంతుడన్న ప్రపంచ దేశాల ముఖ్యంగా ఐరోపా యూనియన్ దేశాల ప్రశంసలు పొందిన జెలెన్‌స్కీ చివరికి తోకముడచక తప్పలేదు. రష్యా నుంచి భద్రతాపరమైన హామీలు పొందడం కన్నా అమెరికాతో ఖనిజ ఒప్పందాన్ని కుదుర్చుకుంటేనే ఉక్రెయిన్‌కు రక్షణ లభిస్తుందన్న వ్యూహంతో అమెరికా పెట్టిన షరతులన్నిటికీ పరోక్షంగా అంగీకరిస్తూ చివరకు దాసోహం కావడం అనూహ్య పరిణామం. చేసిన తప్పులు దండంతో సరి అన్నట్టు ఇటీవల ట్రంప్‌తో చర్చలు జరిగిన తీరుపై పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. తమ దేశ ఖనిజాలను అమెరికా కొల్లగొట్టడానికి ఒప్పుకున్నారు. దీనివల్లనే భద్రతాపరమైన హామీలు లభిస్తాయని ఆశాభావంతో ఉన్నారు. ఇకపై ఇలాంటి చర్చలు, సహకారం నిర్మాణాత్మకంగా ఉండేలా చూసుకుంటామని కూడా స్పష్టం చేశారు. ఉక్రెయిన్‌కు ఐరోపా దేశాలు బాసటగా నిలుస్తున్న సమయంలో ఈ పరిణామాలు సంభవించాయి. ఐరోపా యూనియన్‌తో సంబంధం లేకుండా లాటిన్ అమెరికా దేశాలతో బలమైన సంబంధాలను ఏర్పర్చుకుని కొత్త కూటమిని సిద్ధం చేసుకోవాలని ట్రంప్ ఎత్తుగడలు వేస్తున్న సంగతి తెలిసిందే. ఈ పరిస్థితిని గమనించి ఐరోపా యూనియన్ దేశాలు అమెరికా నుంచి తమను తాము రక్షించుకోడానికి, రష్యా దురాక్రమణ నుంచి ఉక్రెయిన్‌ను కాపాడడానికి వీలుగా ఉక్రెయిన్ సైనిక శక్తిని బలోపేతం చేయడానికి నిర్ణయించాయి. దీనికి అనుగుణంగా 800 బిలియన్ యూరో (841 బిలియన్ అమెరికా డాలర్లు) విలువైన ప్యాకేజీని ఐరోపా యూనియన్ ఎగ్జిక్యూటివ్ మంగళవారం ప్రతిపాదించారు. గురువారం బ్రసెల్స్‌లో జరగనున్న 27 ఐరోపా యూనియన్ దేశాల సమావేశంలో ఈ ప్యాకేజీపై చర్చిస్తారు. మరి ఇప్పుడు జెలెన్‌స్కీ అమెరికాకు దాసోహం కావడంపై ఐరోపా యూనియన్ వైఖరి ఎలా ఉంటుందో చెప్పలేం. అమెరికాను కలుపుకోకుండా ఏదీ చేయలేమని ఐరోపా యూనియన్ దేశాలు మొదటినుంచి చెబుతున్నాయి. అయితే ఉక్రెయిన్‌కు ఆర్థికంగా, రక్షణపరంగా నేరుగా సహాయం అందించడానికి ఇదివరకటిలా అంత వెసులుబాటు కాకపోవచ్చు. దేనికైనా అమెరికా నుంచి గ్రీన్ సిగ్నల్ వస్తేనే కానీ ఐరోపా దేశాలు ఏపనీ చేయలేవు. మరోవైపు ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించే విషయంలో అమెరికా, ఐరోపా యూనియన్ మధ్య విభేదాలు నెలకొనడంతో దీన్ని అదునుగా చైనా ఉపయోగించుకోవాలనుకుంటోంది. అగ్రరాజ్యం తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలకు వ్యతిరేకంగా ఐరోపా యూనియన్‌తో కలిసి పనిచేసేందుకు చైనా ప్రయత్నాలు ప్రారంభించింది. దీనికి తాము సిద్ధంగా ఉన్నామని చైనా పార్లమెంట్ ప్రతినిధి లౌ కినిజియాన్ ప్రత్యేకించి వెల్లడించడం గమనార్హం. ట్రంప్‌పుతిన్ మధ్య సయోధ్య పెరుగుతుండడం రష్యాకు మిత్రదేశమైన చైనాకు ఆందోళన కలిగిస్తోంది. దీన్ని గమనించిన రష్యా అమెరికాతో తాము జరుపుతున్న చర్చల ఆంతర్యాన్ని వివరించడానికి తమ ఉన్నత భద్రతాధికారి షెర్గీ సోయిగును చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ వద్దకు పంపించింది. ఇదిలా ఉండగా ట్రంప్ 1980లో వ్యాపారవేత్తగా ఉన్న సమయంలో ట్రంప్‌ను తమ గూఢచారిగా రష్యా 1987లో నియమించుకుందని మీడియా కథనాలు ప్రచారంలోకి వస్తున్నాయి. సోవియట్ విచ్ఛిన్నం తరువాత ట్రంప్ కజకిస్థాన్‌లో పనిచేశారని, అప్పుడు ట్రంప్ కోడ్ నేమ్ క్రస్నోవ్ అని సోవియెట్ ఇంటెలిజెన్స్ అధిపతిగా పనిచేసిన అల్నూర్ ముస్సాయేవ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం సంచలనం కలిగిస్తోంది. 2020 ఎన్నికల్లో తనకు జెలెన్‌స్కీ ఏమాత్రం సాయం చేయలేదని ట్రంప్ ద్వేషం పెంచుకున్నారని కూడా కథనాలు వస్తున్నాయి. అందుకనే నాటో కూటమిలో సభ్యత్వం పొందాలన్న జెలెన్‌స్కీ ఆశలకు ట్రంప్ మొదటినుంచీ గండి కొట్టడానికి పాత వైరుధ్యమే ముఖ్యమైన కారణంగా ఊహాగానాలు వస్తున్నాయి. నాటో కూటమికి మొదటి నుంచీ సారథ్యం వహిస్తోంది అమెరికాయే. అందువల్ల జెలెన్‌స్కీ అనుకున్నవేమీ నెరవేరే పరిస్థితి ఇప్పుడు కనిపించడం లేదు. ట్రంప్ అధికారం చేపట్టక ముందు వరకు గత అధ్యక్షుడు జో బైడెన్ సహకారమే జెలెన్‌స్కీని ముందుకు నడిపించింది. రష్యాతో ఎంతకాలం యుద్ధం సాగించినా అంతకాలం తాము అండదండలు అందిస్తామని గతంలో జో బైడెన్ భరోసా ఇచ్చారు. కానీ ఇప్పుడు సీన్ తారుమారైంది. జో బైడెన్ తీసుకున్న నిర్ణయాలన్నీ తప్పుడు నిర్ణయాలని, అమెరికాకు తీవ్ర నష్టం కలిగించేవే అని ట్రంప్ తెరపైకి తెస్తున్నారు. అమెరికా ద్రవ్యోల్బణం పెరగడానికి జో బైడెన్ విధానాలే కారణమని ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఈ పరిస్థితుల్లో ట్రంప్ ప్రభుత్వ యంత్రాంగంతో కలిసి ముందుకు వెళ్లడమే ఉక్రెయిన్‌కు, ఐరోపా దేశాలకు తప్పనిసరి అవుతోంది. ఇప్పటికే రష్యాపై అవ్యాజ ప్రేమ ఒలకబోస్తున్నారన్న కళంకం ట్రంప్ మూటగట్టుకున్నారు. అందువల్ల రష్యాతో ఎలాంటి తుది ఒప్పందం చేసుకున్నా ఉక్రెయిన్ భద్రత విషయంలో ఎలాంటి ప్రమాదం లేకుండా అమెరికా పెద్దరికం వహించవలసిన బాధ్యత ఉంది. ఖనిజాల వ్యాపారం కన్నా కొన్ని వేల ప్రాణాలను పరిరక్షించడం ట్రంప్ తక్షణ కర్తవ్యం.